సూర్య 18వ వసంతంలోకి ...

www.suryaa.com

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com

సోమవారం | 3 మార్చి 2025 | హైదరాబాద్

సంపుటి 18 | సంచిక 131

| పేజీలు 8+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...



APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్

నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్

కరెంట్ అఫైర్స్

నమూనా ప్రశ్నాపత్రాలు

విద్యా ఉద్యోగ సమాచారం

'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.


అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - హేమంత ఋతువు, ఫాల్గుణమాసం శుద్ధ. చవితి రా.10.30, రేవతి ఉ.10.43, వర్జ్యం తె.5.19 వరకు
రాహుకాలం ఉ.7.30 నుంచి 9.00 వరకు దుర్ముహూర్తం మ.12.35 నుంచి 1.22 వరకు తిరిగి మ. 2.55 నుంచి 3.42 వరకు



# పాలమూరు ద్రోహి కేసీఆర్

నాగర్ కర్నూల్ జిల్లా దోమల పెంట సమీపంలోని ఎస్ఎల్బీసీ టన్నెల్లో వారం రోజుల క్రితం చిక్కుకుపోయిన ఎనిమిది మంది పరిస్థితి ఏంటి అన్న విషయం నిపుణుల అభిప్రాయం వచ్చిన తర్వాతే చెప్పగలను తప్ప ప్రభుత్వపరంగా ఎలాంటి ఊహాగానాలతో ప్రకటన చేయలేమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి ఎస్ ఎల్ బి సి తెన్నల్ దుర్ఘటన స్థలాన్ని ముఖ్యమంత్రి ఇరిగేషన్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ తదితరులు కలిసి పరిశీలించారు అక్కడ జరుగుతున్న సహాయ చర్యలు సంబంధించి నిపుణులతో మాట్లాడి తెలుసుకున్నారు.

## ఎస్ఎల్‌బిసిలో ప్రమాదానికి కారణం కెసిఆర్

- పాలమూరు బిడ్డ సీఎం అయితే ఓర్వలేకపోతున్నారు
- వరంగల్ ఎయిర్ పోర్ట్ తామే తెచ్చామని బీజేపీ వాళ్లు ప్రగల్భాలు పలుకుతున్నారు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పై సీఎం రేవంత్ సంచలన ఆరోపణలు
- సమస్యంతా కిషన్ రెడ్డితోనే మోడీని మోస్తున్నారు
- లోపల ఉన్న వారి పరిస్థితి అధికారికంగా ఏమీ చెప్పలేం
- విపత్తును ఎదుర్కోవడంలో అందరూ సహకరించండి
- దుబాయ్ దావత్ మత్తు దిగిన తర్వాత హరీష్ రావుది మతిలేని మాటలు
- ఎస్ఎల్‌బిసి దుర్ఘటనా స్థలిలో సీఎం రేవంత్ రెడ్డి

## అక్రమ వలసలు తగ్గాయి



6 లో

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన

తాను తీసుకున్న చర్యల వల్లే అమెరికా-మెక్సికో సరిహద్దుల్లో అక్రమ వలసలు భారీగా తగ్గినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అక్రమ వలసదారులను ఆయన ఆదేశాల మేరకు ప్రత్యేక విమానాల్లో వారి స్వదేశాలకు తిరిగి పంపిన విషయం తెలిసిందే.

## గాజాకు వెళ్లే సాయాన్ని అడ్డుకుంటున్నాం




6 లో

### కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన నేపథ్యంలో ఇజ్రాయెల్ కీలక ప్రకటన

తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఇజ్రాయెల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, దీనికి హమాస్ నిరాకరించింది. దీంతో గాజాకు అందే మానవతాసాయాన్ని తాము అడ్డుకుంటామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ విషయాన్ని ఆ దేశ ప్రధాని కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

## ప్రధాని మోడీ రంజాన్ శుభాకాంక్షలు

రంజాన్ మాసం ఆదివారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసం మన సమాజంలో శాంతి సామరస్యాలను తీసుకురావాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. ఈ పవిత్ర మాసం.. కృతజ్ఞత, భక్తిప్రపత్తులను సూచిస్తుంది. కరుణ, దయ, సేవలకున్న విలువలను మనకు గుర్తు చేస్తుంది అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇస్లాంలో రంజాన్ మాసానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ నెలలో ముస్లిం సోదరులు ఉపవాసం ఉంటూ భగవంతుడిని ఆరాధిస్తారు. ఇస్లాంలోని ఐదు స్తంభాలలో రంజాన్‌ను ఒకటిగా పరిగణిస్తారు.



## కుంభమేళాకు ఆర్ఎస్ఎస్ చీఫ్ ఎందుకు వెళ్లలేదు

- శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ప్రశ్న
- ప్రతిపక్షాలు కుంభమేళాకు వెళ్లలేదని అధికార పక్షం ఆరోపణల
- ఈ క్రమంలోనే ఈ అంశాన్ని లేవనెత్తిన శివసేన

రాజకీయ నేతలు కుంభమేళాలో పాల్గొనడంపై శివసేన(శిందే), శివసేన నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాను హిందువునని..ఆ ధర్మాలు పాటిస్తానని చెప్పుకునే శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే మాత్రం వెళ్లలేదని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్నాథ్ శిందే చేసిన వ్యాఖ్యలను రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ తిప్పి కొట్టారు.



6 లో


సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్


## మహిళలకు ఏపీ సీఎం మరో శుభవార్త

- 8 నుంచి కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభం
- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లోనూ... నిష్ణాతుల ఆధ్వర్యంలో 90 రోజుల పాటు టైలరింగ్‌లో శిక్షణ
- బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- 1,02,832 లబ్ధిదారుల ఎంపిక
- శిక్షణ అనంతరం కుట్టు మిషన్ల పంపిణీ
- మహిళలకు మంత్రి సవిత పిలుపు

మహిళలకు సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ తెలిపింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆర్థిక మేలు కలిగేలా నిర్ణయం తీసుకుంది.



2 లో


## శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ గ్లోబల్ హీరో



7 లో

- ఐటిటీలో బ్యాక్ బెంచ్‌లే ఉంటాయి, బ్యాక్ బెంచేరులు ఉండరు
- ఐటి విద్యార్థులు, టీచింగ్ సిబ్బంది నాకు అతిథులు,
- మిమల్ని పార్లమెంట్‌కు ఆహ్వానిస్తున్నా
- సృజనాత్మకత, ఆవిష్కరణలే భారత్ పెట్టుబడి
- శాస్త్ర, సాంకేతిక రంగాలే భారత్‌ను శాసిస్తున్నాయి
- ఉప రాష్ట్రపతి జగదీష్ దన్కర్

### జాబిల్లిపై బ్లూ ఘోస్ట్



6 లో

- చందమామపై అడుగుపెట్టిన ప్రైవేటు ల్యాండర్
- ఫైర్ ఫ్లై ఏరోస్పేస్ సంస్థ ప్రయోగం విజయవంతం

అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఫైర్ఫ్లై ఏరోస్పేస్ చరిత్ర సృష్టించింది. ఈ సంస్థ ప్రయోగించిన 'బ్లూ ఘోస్ట్ అనే వ్యోమనౌక జాబిల్లి ఉపరితలంపై విజయవంతంగా ల్యాండ్ అయ్యింది.

## అమరావతిలో పెద్ద ఎత్తున పనుల ప్రారంభం

- రూ.50 వేల కోట్ల విలువ చేసే పనులకు టెండర్లు
- ఖరారు కానున్న సచివాలయం, హైకోర్టు నిర్మాణాల టెండర్లు
- గత ప్రభుత్వం రాజధానిలో పేదలకు ఇచ్చిన భూములను తిరిగి తీసుకోనున్న కూటమి ప్రభుత్వం
- ఆ పేదలకు తమ గ్రామాలకు సమీపంలోనే నివేశన స్థలాలు ఇచ్చేందుకు నిర్ణయం

రాజధానిలో వచ్చే నెల నుంచి పనులు మొదలు కానున్నాయి. సచివాలయం, హైకోర్టు భవన నిర్మాణాలకు టెండర్లు పిలిచారు. మిగిలిన పనులకు ఇంతకు ముందే టెండర్లు పూర్తయ్యాయి. ఈనెల 20 నాటికి ఇప్పటి వరకు పిలిచిన టెండర్లతో పాటు సచివాలయం, హైకోర్టు నిర్మాణాలకు పిలిచే టెండర్లు కూడా ఖరారు కానున్నాయి.



2 లో

## అంతా ఇంతే!




ఎంతైనా నటుడు కదా నటనలో జీవిస్తున్నాడు సార్

## బీసీల రాజ్యాధికారం కోసం బీసీ రాజ్యాధికార సమితి

- అగ్ర వర్గాల ఆధిపత్యంపై ఎలుగెత్తిన బాణం
- విద్యార్థి దశ నుండి సామాజిక స్పృహ గల విద్యార్థిగా పోరాటాలు
- అసమానతలు అవమానాలపై నిరసన గళం
- తెలంగాణ ఉద్యమంలో సైతం భావజాల వ్యాప్తి కోసం కృషి
- భావజాల వ్యాప్తిని విస్తరింపజేసి రాజ్యాధికారం దిశగా అడుగులు
- బీసీల అస్తిత్వ పోరాటంలో ముందున్న బీసీ రాజ్యాధికార సమితి
- ప్రశ్నించే గొంతుకగా బీసీ రాజ్యాధికార సమితిని స్థాపించిన దాసు సురేష్
- తెలంగాణ రాష్ట్రంలో బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తున్న నేపథ్యం

దేశానికి స్వతంత్రం సిద్ధించి దశాబ్దాలు గడిచిన బీసీలకు రావాల్సిన రాజ్యాధికార వాటా రావడం లేదన్న విషయాన్ని గమనించి బీసీ రాజ్యాధికార సమితిని స్థాపించారు దాసు సురేష్. చిరుప్రాయం నుండి సామాజిక స్పృహ గల విద్యార్థిగా దాసు సురేష్ విద్యార్థి దశ నుండే ప్రశ్నించే గొంతుకు గా అసమానతలు, అవమానాలు, ఆర్థిక సమస్యలపై ఉద్యమాన్ని ఎంచుకున్నారు. ఈ దశలో తెలంగాణ ఉద్యమం రావడం తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో భావజాల వ్యాప్తి కోసం సోషల్ మీడియా ద్వారా కీలక భూమిక పోషించిన దాసు సురేష్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీసీలకు ఆశించిన స్థాయిలో న్యాయం జరగకపోవడంతో బీసీ రాజ్యాధికార సమితిని స్థాపించి పోరాటాలకు శ్రీకారం చుట్టారు.



2 లో

## బీజేపీ జాతీయాధ్యక్ష పదవి దక్కేదెవరికి?

- మహిళ పేరు పరిశీలించాలని డిమాండ్లు
- చారిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును మనతో ఆరంభిద్దామంటున్న మహిళా లోకం
- కొత్త జాతీయాధ్యక్షుడి ప్రకటన వచ్చే వారం రానుందని సమాచారం
- ఇప్పటికే అన్ని రాష్ట్రాలలో పూర్తయిన అంతర్గత ఎన్నికలు
- దక్షిణాది వారికి ఇవ్వాలని ఊపందుకుంటున్న డిమాండ్

బీజేపీ ఇప్పటి వరకు రాష్ట్రపతి, ముఖ్యమంత్రి, లోక్సభ స్పీకర్ సహా మరెన్నో పదవులను మహిళలకు కట్టబెట్టినప్పటికీ, ఆ పార్టీ జాతీయాధ్యక్ష పదవిలో ఇప్పటి వరకు ఒక్క మహిళ కూడా లేదు. చారిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ చేసిన కమలనాథులు.. అధ్యక్ష పదవిని సైతం మహిళ చేతిలో పెట్టి జనాభాలో సగం ఉన్న మహిళల మనసు గెలుచుకునే ప్రయత్నాలు చేయవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



6 లో

# దుర్గ గుడిలో 8 కీలక ఫైళ్లు మాయం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : దుర్గగుడి దేవస్థానంలో అత్యంత కీలకమైన 8 ఫైళ్ళు గల్లంతు అయినట్లు అధికారులు గుర్తించారు. గతంలో పని చేసిన ఈవోల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శలు వినిపిస్తున్నాయి. గల్లంతైన ఫైళ్ల వ్యవహారంపై ఈవో, దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ సంబంధిత విభాగాలకు చెందిన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఈవో ఫైళ్లను పరిశీలించిన క్రమంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో ఫైళ్ల గల్లంతు విషయంపై సబంధిత అధికారుల నుంచి ఈవో వివరాలు ఆరా తీశారు. కోర్టుకు వెళ్లిన ఉద్యోగుల సర్వీస్ సంబంధించిన కేసుల ఫైళ్లు గల్లంతు అయినట్లు గుర్తించారు. ఈ ఫైళ్ల ఆధారంగానే కోర్టు కేసుల్లో కౌంటర్ వేయడానికి అవకాశం ఉంటుంది. ఫైళ్లు కనిపించకపోవడంతో ఈవో వాటికి సంబంధించిన అధికారులను పిలిచి వివరాలు అడిగారు. ఉద్యోగులు సయితం సరైన సమాధానాలు చెప్పకుండా మౌనంగా ఉండిపోయారు. మాయమైన ఫైళ్ల గురించి గతంలో పనిచేసిన ఉద్యోగులు, ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులు సమాధానం చెప్పాలని ఈవో దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతానికి హెడ్ ఆఫీసు నుంచి ఫైళ్లు తెప్పించుకుని కోర్టులో కౌంటర్ వేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఫైళ్లకు సంబంధించిన వివరాలను ఈవో, దేవాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్రమోహన్ ఉద్యోగులను అడగ్గా వారు పొంతన లేని సమాధానాలు చెప్పడంతోపాటు మౌనం దాల్చడంపట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పనిచేసిన ఈవోలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఫైళ్లు మాయమయ్యాయి. ఈ ఫైలింగ్ చేయకపోవడంవల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రస్తుత అధికారులు అంటున్నారు. ఈవో, దేవాదాయ శాఖ కమిషనర్ ఒకరే కావడంతో ఫైళ్ల గల్లంతుకు కారణమైనవారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

# మహిళలకు ఏపీ సీఎం మరో శుభవార్త



**● 8 నుంచి కుట్టు శిక్షణా కేంద్రాలు ప్రారంభం ● రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లోనూ... నిష్ణాతుల ఆధ్వర్యంలో 90 రోజుల పాటు టైలరింగ్‌లో శిక్షణ ● బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ ● 1,02,832 మహిళా లబ్ధిదారుల ఎంపిక ● శిక్షణ అనంతరం కుట్టు మిషన్ల పంపిణీ ● రూ.255 కోట్ల వ్యయం ● చంద్రన్న పాలనలోనే మహిళా సంక్షేమం ● స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోండి ● మహిళలకు మంత్రి సవిత పిలుపు**

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మహిళలకు సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ తెలిపింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆర్థిక మేలు కలిగేలా నిర్ణయం తీసుకుంది. టైలరింగ్ లో మహిళలకు శిక్షణ అందజేసి, వారికి కుట్టు మిషన్లు ఉచితంగా అందజేయనుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడుతూ, ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మహిళలకు ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మరో టైలరింగ్ లో శిక్షణ అందజేసి, ఉచితంగా కుట్టుమిషన్లు ఇవ్వాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించడంపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. సమాజాభివృద్ధిలో మహిళలే కీలకమని గుర్తించిన టీడీపీ ప్రభుత్వాలు...వారి సాధికారితకు, ఆత్మగౌరవానికి, సంక్షేమానికి ఎనలేని ప్రాధాన్యమిస్తున్నాయి. నాడు అన్న ఎన్టీఆర్ ఆస్తిలో మహిళలకు సమాన హక్కులు కల్పించడంతో పాటు రాజ్యాధికారంలోనూ భాగస్వాములను చేశారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు కూడా అన్నింటా మహిళలకు ప్రథమ ప్రాధాన్యమిస్తున్నారు. ఇళ్ల పట్టాలను మహిళల పేరునే మంజూరు చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలు కూడా వారి పేరు మీదనే చేపడుతున్నారు. విద్య, ఉద్యోగావకాశాల్లో మహిళలకు 33.33 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత కూడా సీఎం చంద్రబాబుదే. మహిళల అభ్యున్నతికి వెన్నంటి ఉంటూ భరోసా కల్పిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు వారికి ఆర్థికాభ్యున్నతి కల్పించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా స్వయం ఉపాధి పథకాల్లోనూ మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. ఇంటి పట్టున ఉండే మహిళలకు ఆర్థిక భరోసా కలిగేలా టైలరింగ్ లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. కేవలం శిక్షణ ఇవ్వడమే కాకుండా వారికి కుట్టుమిషన్లను కూడా ఉచితంగా అందజేయనున్నారు. ఈ నెల ఎనిమిదో తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా లబ్ధిదారులకు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యలో ఈ శిక్షణా కేంద్రాలు ప్రారంభంకానున్నాయి.

**1,02,832 మహిళా లబ్ధిదారుల ఎంపిక**

రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజక వర్గాల్లోనూ బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సామాజిక వర్గానికి చెందిన 1,02,832 మహిళా లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేయాలని సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.255 కోట్లను ప్రభుత్వం వెచ్చిస్తోంది. బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా 46,044 మందికి, ఈడబ్లూఎస్ సామాజిక వర్గానికి చెందిన 45,772 మందికి, కాపు కార్పొరేషన్ ద్వారా అదే సామాజిక వర్గానికి చెందిన 11,016 మందిని ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం చివరి దశకు చేరుకుంది.

**90 రోజుల పాటు శిక్షణ...ఉచితంగా కుట్టు మిషన్లు**

మహిళలకు భవిష్యత్తుపై భరోసా లభించేలా టైలరింగ్ లో శిక్షణ ఇవ్వాలని చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. 90 రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగనుంది. తూతూ మంత్రంగా కాకుండా టైలరింగ్ లో నిష్ణాతులైన వారితో మహిళలకు శిక్షణివ్వనున్నారు. నేటి అభిరుచులకు అనుగుణంగా దుస్తుల తయారీలో ఈ శిక్షణ కొనసాగనుంది. శిక్షణ అనంతరం లబ్ధిదారులకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేయనున్నారు. శిక్షణ ద్వారా ప్రావీణ్యం పొందిన మహిళలు సొంతంగా ఆదాయ ఆర్జిస్తూ, తమ కుటుంబాలకు తద్వారా సమాజానికి ఆసరాగా నిలవ్వాలన్నదే సీఎం చంద్రబాబునాయుడు ధ్యేయం.

**మహిళల ఆర్థిక స్వేచ్ఛకు మరెన్నో పథకాలు**

సంపద సృష్టిలో మహిళలను భాగస్వాములను చేసేందుకు చంద్రన్న ప్రభుత్వం వారిని వివిధ వృత్తులను ప్రోత్సహిస్తోంది. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేవలం టైలరింగ్ శిక్షణతోనే సరిపెట్టకుండా ఈవెంట్ మేనేజ్ మెంట్ నిర్వహణ యూనిట్ల ఏర్పాటులోనూ మహిళలకే ప్రాధాన్యమిస్తున్నారు. వాటితో పాటు బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ల ద్వారా అమలు చేసే స్వయం ఉపాధి పథకాల అమలులోనూ మహిళలకు అవకాశం కల్పిస్తున్నారు. డెయిరీ, గొర్రెల వంటి యూనిట్లతో పాటు జనరిక్ మెడికల్ షాపుల ఏర్పాటులోనూ ముందుకొచ్చిన మహిళా లబ్ధిదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

**చంద్రన్న పాలనలో మహిళా సంక్షేమం: మంత్రి సవిత**

సమాజాభివృద్ధిలో మహిళల పాత్రే కీలకమని నమ్మిన వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడు అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చిల్లర దుకాణాలు, కుట్టు శిక్షణ, అగరబత్తీలు, పామాయిల్ తదితర చిన్నపాటి వ్యాపారాల వైపు నడిపిస్తూనే... ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొండపల్లి బొమ్మలు, మంగళగిరి, ధర్మవరం చీరలు, పూతరేకులు, చెక్క బొమ్మలు, పిల్లల ఆట బొమ్మల తయారీలో భాగస్వాములను చేస్తోందన్నారు. దీనిలో భాగంగా ఈ నెల ఎనిమిదో తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 1,02,832 మహిళలకు టైలరింగ్ శిక్షణ అందజేసి, కుట్టు మిషన్లు పంపిణీ చేయనున్నామన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, సీఎం చంద్రబాబు నాయుడు లక్షసాధనలో భాగంగా తమవంతు సంపద సృష్టిలో భాగస్వాములు కావాలని మంత్రి సవిత కోరారు.

# మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని, ఈ పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మార్చి 1వ తేదీ శనివారం రాత్రి నెలవంక కనిపించడంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంపప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... సర్వమతాల సారాంశం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు, ఆరాధన ప్రార్థనలు, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ యొక్క ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మైనార్టీ సోదరులు ఈ మాసాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో 30 రోజులుగా ముస్లిం సోదరులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉపవాసం ఉండి మూడు పూటలా నమాజ్ చేసుకోవడం ఎంతో గొప్ప విషయమన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో రంజాన్ పవిత్రతను గుర్తించి అల్లా అనుసరించిన మార్గంలో నడవాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా ప్రజలందరికీ పవిత్ర రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజులలో హిందూ, ముస్లిం సోదరులు కలిసిమెలిసి జీవించి అన్నమయ్య జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ముస్లిం సోదరులందరికీ రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

# సవితమ్మ శభాష్!

## మానవత్వం చాటుకున్న మంత్రి సవితపై ప్రశంసలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మరోసారి మానవత్వం చాటుకున్నారు. తీవ్రంగా గాయపడి బాధతో విలవిలాడుతూ, రోడ్డుపై నిస్సహాయంగా పడివున్న వ్యక్తిని గుర్తించి తన ఎస్కార్ వాహనంలో ఆసుపత్రికి పంపించారు. అక్కడితో తన పని అయిపోయిందని భావించకుండా, బాధ్యయుతమైన నాయకురాలిగా స్పందిస్తూ, ఆసుపత్రి వైద్యులకు ఫోన్ చేశారు. గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్యమందించాలని ఆదేశించారు. మంత్రి సవిత స్పందించిన తీరును చూసి స్థానికులు ప్రశంసలు కురిపించారు. ఈ సంఘటన పెనుకొండ పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. పట్టణంలో ఓ పెళ్లి కార్యక్రమానికి హాజరైన మంత్రి సవిత తన స్వగ్రహానికి పయనమయ్యారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ కు రాగానే, రోడ్డుపై యాక్సిండ్ గురైన వ్యక్తి నిస్సహాయంగా పడిఉండడాన్ని మంత్రి గమనించారు. తక్షణమే తన కాన్వాయ్ ను ఆపి, క్షతగాత్రుడిని పరిశీలించారు. తీవ్ర గాయం కావడంతో విలవిలలాడుతున్న బాధితుడిని తన ఎస్కార్ట్ వాహనంలో ఎక్కించి, స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులకు ఫోన్ చేసి, క్షతగాత్రుడికి మెరుగైన వైద్యమందించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు తనకు బాధితుడి ఆరోగ్య పరిస్థితి గురించి తెలపాలని స్పష్టం చేశారు. మంత్రి సవిత ఆగమేఘాలపై స్పందించిన తీరును చూసి పెనుకొండ వాసులు అభినందించారు. గతంలోనూ పలు ప్రమాద సంఘటనలో మంత్రి స్పందించిన తీరును గుర్తు చేసుకుంటూ, ప్రశంసలు కురిపించారు.


# అమరావతిలో పెద్ద ఎత్తున ప్రారంభం కానున్న పనులు

**● రూ.50 వేల కోట్ల విలువ చేసే పనులకు టెండర్లు ● ఖరారు కానున్న సచివాలయం, హైకోర్టు నిర్మాణాల టెండర్లు ● జాతీయ, అంతర్జాతీయ సంస్థల కార్యాలయాలకు వెయ్యి ఎకరాలు కేటాయింపు ● గత ప్రభుత్వం రాజధానిలో పేదలకు ఇచ్చిన భూములను తిరిగి తీసుకోనున్న కూటమి ప్రభుత్వం ● ఆ పేదలకు తమ గ్రామాలకు సమీపంలోనే నివేశన స్థలాలు ఇచ్చేందుకు నిర్ణయం**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాజధానిలో వచ్చే నెల నుంచి పనులు మొదలు కానున్నాయి. సచివాలయం, హైకోర్టు భవన నిర్మాణాలకు టెండర్లు పిలిచారు. మిగిలిన పనులకు ఇంతకు ముందే టెండర్లు పూర్తయ్యాయి. ఈనెల 20 నాటికి ఇప్పటి వరకు పిలిచిన టెండర్లతో పాటు సచివాలయం, హైకోర్టు నిర్మాణాలకు పిలిచే టెండర్లు కూడా ఖరారు కానున్నాయి. ఇక పనుల ప్రక్రియ ప్రారంభం కావడమే ఆలస్యం. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గతంలో మొదలు పెట్టి వదిలేసిన పనులకు శ్రీకారం చుట్టింది. విదేశీయులతో తయారు చేయించిన డిజైన్ల ప్రకారం నిర్మాణాలు జరగనున్నాయి. అంతర్జాతీయ స్థాయి రాజధాని నిర్మాణం చేపడుతున్నందున దేశ దేశాలకు చెందిన వారు ఆకర్షితులు కావాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉంది. పలు జాతీయ సంస్థలు అమరావతిలో కార్యాలయాలు నిర్మించుకునేందుకు అనువుగా వెయ్యి ఎకరాల భూమిని ప్రత్యేకంగా కేటాయించింది. ఈ సంస్థలు వాటి నిర్మాణాలకు దరఖాస్తులు చేసుకుంటే ప్రభుత్వం అడుగులు ముదడుగు వేస్తుంది. హైకోర్టును రూ.1,048 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. అసెంబ్లీకి రూ.748 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు టెండర్లు ఈ నెల 17 సాయంత్రం వరకు స్వీకరిస్తారు. ఏ సంస్థ తక్కువగా కోట్ చేస్తుందో దానికి నిర్మాణ బాధ్యతలను అప్పగించనున్నారు. టెక్నికల్, ఫైనాన్షియల్ బిడ్స్ వేరు వేరుగా వేయాల్సి ఉంటుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాల్సి వస్తుండటంతో తుపాన్, వరద నీటికి తట్టుకునేలా భవనాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అసెంబ్లీ భవనాన్ని దేశంలో ఎక్కడా లేని ఆకృతిలో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ భవనాన్ని 103 ఎకరాల్లో నిర్మించనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు మూడు అంతస్థులు ఉండేలా నిర్మాణ పనులు సాగనున్నాయి. ఇందులోనే మంత్రులకు ఛాంబర్లతో పాటు కౌన్సిల్ కూడా ఉంటుంది. మూడో అంతస్తు నుంచి నగరాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. హైకోర్టు భవనాన్ని 42.36 ఎకరాల్లో నిర్మించనున్నారు. ఏడు అంతస్థుల్లో హైకోర్టు భవనాన్ని నిర్మించనున్నారు. లైబ్రరీతో పాటు డైనింగ్ హాలు కూడా ఈ నిర్మాణంలో చోటు చేసుకోనున్నాయి. హైకోర్టు నిర్మాణానికి అంచనా వ్యయం రూ. 1,048 కోట్లుగా నిర్ణయించారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల క్వార్టర్లు పూర్తి కావొచ్చాయి. రహదారుల నిర్మాణాలు కూడా వేగంగా సాగుతున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు వేయడం ద్వారా విజయవాడ, గుంటూరు, గన్నవరం కలిసిపోతాయి. గన్నవరంలోని విమానాశ్రయం నుంచి గుంటూరు శివారు ప్రాంతాల వరకు సుమారు 60 కిలో మీటర్ల ప్రాంతం పూర్తి స్థాయిలో కలిసి పోతుంది. అంటే హైదరాబాద్ సిటీ కంటే పెద్ద సిటీగా అమరావతి తయారు కానుంది. అన్ని అవసరాలకు పోను ఐదు వేల ఎకరాలు అదనంగా స్థలం ఉంటుందని మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. వెయ్యి ఎకరాలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు కేటాయించగా, మిగిలిన నాలుగు వేల ఎకరాల భూమిని విక్రయించి ఆ నిధులు అమరావతి నిర్మాణానికి వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. గత ప్రభుత్వం ఆర్-5 జోన్ కిందకు 1450 ఎకరాలు తీసుకువచ్చి 50 వేల మంది పేదలకు పట్టాలు ఇచ్చింది. ఈ మొత్తం భూమికి బదులుగా ఆ పేదలకు వారి ఊళ్లకు సమీపంలోనే ఇళ్ళ స్థలాలు ఇచ్చేందుకు నిర్ణయించామని, ఆ భూమిని ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి తెలిపారు.

# ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ సస్పెన్షన్




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : జిపి ర్యాంకు లో ఉన్న ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ ఊహించని షాక్ తగిలింది. తాజాగా డిజిపి ర్యాంకు లో ఉన్న ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ పై సస్పెన్షన్ వేటు వేసింది ఎపి సర్కార్. . ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ముందస్తు అనుమతులు లేకుండా పలు సార్లు విదేశీ యాత్రలు చేసినట్టు అభియోగం డిజిపి ర్యాంకు లో ఉన్న ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ పైన ఉంది. సునీల్ కుమార్ విదేశాలకు వెళ్లిన సమయంలో ప్రభుత్వం అనుమతి తీసుకోలేదని, మరికొన్ని పర్యటనలకు అనుమతి తీసుకున్నప్పటికీ.. ట్రావెల్ ఫ్లాన్‌కు విరుద్ధంగా సునీల్ విదేశాల్లో ఉండడం.. అక్కడ ప్రయాణించడం జరిగిందనే ఆరోపనలు వచ్చిప నేపథ్యంలో ప్రభుత్వం విచారణ అధికారిని నియమించింది.

# బీసీల రాజ్యాధికారం కోసం

# బీసీ రాజ్యాధికార సమితి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: దేశానికి స్వతంత్రం సిద్ధించి దశాబ్దాలు గడిచిన బీసీలకు రావాల్సిన రాజ్యాధికార వాటా రావడం లేదన్న విషయాన్ని గమనించి బీసీ రాజ్యాధికార సమితిని స్థాపించారు దాసు సురేష్. చిరుప్రాయం నుండి సామాజిక స్పృహ గల విద్యార్థిగా దాసు సురేష్ విద్యార్థి దశ నుండే ప్రశ్నించే గొంతుకు గా అసమానతలు, అవమానాలు, ఆర్థిక సమస్యలపై ఉద్యమాన్ని ఎంచుకున్నారు. ఈ దశలో తెలంగాణ ఉద్యమం రావడం తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో భావజాల వ్యాప్తి కోసం సోషల్ మీడియా ద్వారా కీలక భూమిక పోషించిన దాసు సురేష్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీసీలకు ఆశించిన స్థాయిలో న్యాయం జరగకపోవడంతో బీసీ రాజ్యాధికార సమితిని స్థాపించి పోరాటాలకు శ్రీకారం చుట్టారు. బీసీలకు జరిగిన అన్యాయం ప గత ప్రభుత్వం ఈ ప్రభుత్వం హాయంలో ఎన్నో వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఎలాంటి న్యాయం జరగలేదు. తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా చేనేత కార్మికుల సమస్యలపై దృష్టి సారించిన దాసు సురేష్ చేనేత కార్మికుల సమస్యలపై గల్లి నుండి ఢిల్లీ వరకు పోరాటం చేసినప్పటికీ ఎలాంటి న్యాయం జరగకపోవడంతో బీసీలకు రాజ్యాధికారమే ఏకైక ఎజెండాతో ముందుకు సాగుతున్నారు. దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అన్న గురజాడ అప్పారావు స్ఫూర్తి సందేశం నేడు కాల గమనంలో ప్రభుత్వాల అసమర్థ విధానాల వల్ల ప్రాధాన్యతను కోల్పోతుంది. ఈ దేశ అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం మనం రచించుకున్న భారత రాజ్యాంగ స్ఫూర్తి నేటికీ సంపూర్ణంగా ఆవిష్కృతం కాకపోవడం మెజారిటీ వర్గాల ప్రజలైన బీసీల సార్వభౌమత్వాన్ని దెబ్బ తీసినట్టే అవుతుంది. మన మహాత్ములు జ్యోతిబాపూలే, సావిత్రి బాయి పూలే, అంబేద్కర్, బి పీ మండల్, పెరియార్ రామస్వామి, నారాయణ గురు వంటి ప్రజా నాయకులు వెట్టిచాకిరికి, అగ్రవర్ణాల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడి బీసీలను ఐక్యం చేయడానికి తమ జీవితాలను త్యాగం చేశారు. ఐనా నేటికీ బీసీలు రాజకీయ బానిసత్వంలోనే మగ్గుతూ అగ్ర వర్ణ నాయకత్వపు కబంధ హస్తాలలో అణగదొక్కబడుతున్నారు. బీసీల ఈ ప్రస్తుత పరిస్థితిని మార్చడానికి అన్ని జిల్లాలలో, అసెంబ్లీ, పార్లమెంటు నియోజక వర్గాలలో బిసి క్యాడర్ నిర్మాణాన్ని కొనసాగిస్తూ బీసీ హక్కులు, అవకాశాలు, బీసీలకు జరుగుతున్న నష్టాన్ని, మన ఓటు విలువను ప్రజలకు విభిన్న రూపాలలో తెలియజెప్పడానికి, బీసీ వర్గాలను ఏకీకరణ చేసే దిశగా బీసీ రాజ్యాధికారసమితి ముందుకు సాగుతుంది. ఈ లక్ష్య సాధనలో భాగంగా బీసీల ఓట్లతో అగ్రవర్ణాలు అందలమెక్కడం ఇకపై కుదరదన్న విషయాన్ని మన ఓట్లతో మనం స్పష్టంగా అగ్రవర్ణాలకు చెప్పగలగాలి. బీసీల ఓట్లు ఈ వర్గపు ఎదుగుదల పట్ల చిత్తశుద్ధి కలిగిన బీసీ అభ్యర్థులకే పడే విధంగా మన కార్యాచరణను రూపొందించాలి. క్షేత్రస్థాయిలో బీసీలను సమైక్య పరచి, సంఘటిత శక్తిగా మార్చి బలమైన ఓటు బ్యాంకుగా రూపొందించడానికి బృహత్తర కార్యాచరణతో ముందుకెళ్లాలి. రాజ్యాధికారం ఎవరో ఇచ్చే ఆటవస్తువు కాదు, అది స్వయంగా మనం సాధించుకోవాల్సిన అంశం అని మనం గమనించాలి. ఎన్నికలలో బీఫారంల కోసం అగ్రవర్ణ పార్టీలపై ఆధారపడటం మాని ప్రజలకు చేరువయి ఇతర బీసీ నాయకులతో, కుల సంఘాలతో, కార్మిక కర్షక, ప్రజా సంఘాలతో, విద్యార్థి మహిళా సంఘాలతో సంఘటితమై ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీలను నిర్మించడంపై బీసీ నాయకులు దృష్టి పెట్టాలి. పట్టుదలతో కృషిచేస్తే బీసీల రాజ్యం ఎంతో దూరంలో లేదని మనం గ్రహించాలి. 2018లో పార్లమెంటు సాక్షిగా అప్పటి హోం మంత్రి రాజ్నాథ్ సింగ్ స్వయంగా 2021 దేశ జనాభా లెక్కలలో బీసీల లెక్క తేలుస్తామని చెప్పి అందుకు అవసరమైన కేవలం ఒకే ఒక కాలంను (2001 సెన్సెస్) లెక్కల టేబుల్ లో పొందు పరచడానికి వెనకఅడుగువేశారు.. ప్రజాధనంతో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి ఏడు సంవత్సరాలు కావస్తున్నా ఆ నివేదికను నేటికీ తెలంగాణ ప్రభుత్వం బహిరంగపరచడం లేదు.. దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో బీసీల జనాభా శాతం బయటకు తెలిస్తే రాజకీయ సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందని, బీసీలు తమ రాజకీయ వాటాను డిమాండ్ చేస్తారన్న ఏకైక కారణంతోటే అట్టి నివేదికలను ప్రజలకు తెలియనీయకుండా ఈ ప్రభుత్వాలు జాగ్రత్తపడుతున్నాయి. ఈ విషయాలను గమనిస్తే బీసీలపై వివక్ష ఏమేరకు కొనసాగుతుందో మనకు సున్నితంగా స్పష్టమవుతున్నది. సమాజ సేవకు రాజకీయాలే ఉత్తమమైన మార్గమైతే గ్రామస్థాయి నుండి ఉత్పత్తి సేవా రంగాలలో నిష్ణాతులైన బీసీలు అనివార్యంగా రాజకీయ మార్గాన్ని ఎంచుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.. అప్పుడే ప్రజలకు ఈ దోపిడిదారుల నుండి విముక్తి కలిగి న్యాయం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 6 బీసీ కార్పొరేషన్లు, 11 ఫెడరేషన్లకు గడిచిన 8 సంవత్సరాల నుండి పాలకమండళ్లు లేకుండా ఇక్కడి ప్రభుత్వం అడ్డుకుంది. చేనేత సహకార సంఘాలతో పాటు ఇతర చేతి వృత్తి సహకార సంఘాలకు కూడా ఎన్నికలు నిర్వహించకుండా రాజకీయ క్షేత్రంలో బీసీలు ఎదగకుండా అడ్డుకుంటున్నదీ ప్రభుత్వం.. కార్పొరేషన్, ఫెడరషన్ లకు పాలక వర్గాలను నియమిస్తే రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుండి 561 మంది బీసీ నాయకుల ఎదుగుదలకు ప్రభుత్వం అవకాశం ఇచ్చినట్లు అయ్యేది. బీసీ సహకార సంఘాలలో,, 



ఫెడరేషన్లల్లో డైరెక్టర్లుగా నియమితులయ్యే బీసీలు తదనంతరం గ్రామ సర్పంచులుగా, ఎంపిటిసి, జెడ్పిటిసి నాయకులుగా ఎదిగే అవకాముండేది. గతంలో 34 శాతం ఉన్న స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్ లను సైతం ప్రభుత్వం 22 శాతానికి కుదించిన విషయాన్ని బట్టి చూస్తే బీసీల నాయకత్వం, సంక్షేమం అగ్రవర్ణ పార్టీలకు ఏ మాత్రం రుచించడం లేదని స్పష్టంగా అర్థమవుతున్నది. నేడు దేశంలో రిజర్వేషన్ వ్యవస్థ ఖచ్చితమైన ప్రాతిపథిక లేకుండా అస్తవ్యస్తంగా కొనసాగుతున్నది. ఈదేశపు భవిష్యత్తు గూర్చి ప్రధాన నిర్ణయాలు తీసుకునే పార్లమెంటు, న్యాయ వ్యవస్థలో బీసీలు తమ జనాభా నిష్పత్తిలో లేకపోవడం వల్లనే రిజర్వేషన్ ల ద్వారా అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్ల వంటి చారిత్రాత్మక తప్పిదాలు సంభవిస్తున్నాయి. రాజకీయ పార్టీలు వాళ్ళ ఓటు బ్యాంకును పెంచుకోవడం కోసం ఎన్నో కులాలను బీసీలలో కలిపారు. కాని మన రిజర్వేషన్ శాతాన్ని మాత్రం పెంచలేదు. అయినా ఇప్పటికీ మన రిజర్వేషన్ వ్యవస్థ మండల్ కమీషన్ సిఫార్సుల మేరకు విద్య, ఉద్యోగాలలో కేవలం 27% మించలేదు. అనేక మార్లు బీసీల రిజర్వేషన్లను వారి జనాభాకు అనుగుణంగా పెంచాలని అనేక పిటిషన్లు సుప్రీమ్ కోర్టు పరిగణనలోకి వచ్చినా సరైన శాస్త్రీయ, సాంకేతిక సమాచారం, బీసీ గణన లేదన్న ఏకైక కారణంతో ఉటంకించిన సుప్రీమ్ కోర్ట్ ప్రస్తుతం ఏ అధికారిక గణనతో అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కేటాయించిందో ఈ దేశ ప్రజలకు వివరించాలి. ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ ఎస్టీ బీసీలకు అవకాశం కల్పించకపోవడం మరొక చారిత్రాత్మక తప్పిదంగా పేర్కొనవచ్చు. తెలుగు రాష్ట్రాలలో అగ్రవర్ణాల జనాభా 7 శాతం ఉండగా ఇతర రాష్ట్రాలలో 10 నుండి 12 శాతం లోపే ఉంటుంది. మరి 10 శాతం లేని అగ్రవర్ణ సమాజంలో 10 శాతం పేదలు ఎలా ఉంటారో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు ఒకసారి పునరాలోచన చేయాలి. మనం 75 ఏళ్లుగా అనుభవించిన వివక్ష సరిపోదా ? ఇంకా ఎందుకు మనకీ బానిస బతుకులు. మన ఓటు మన చేతిలో ఉంటే మనమే అగ్ర వర్ణాలకు రాజకీయంగా వారి జనాభా శాతం రీత్యా 7 శాతం రిజర్వేషన్ ఇవ్వగలం కదా !! నేడు ప్రభుత్వ పాలన, పార్టీల పెత్తనం మొత్తం అగ్రవర్ణాలదే. పెద్ద పెద్ద పరిశ్రమలు, కాంట్రాక్టులు, కార్పొరేట్ ఆసుపత్రులు, విద్యాసంస్థలు అగ్రవర్ణాల చేతిలోనే ఉన్న విషయం మనకు విదితమే. మన రాజకీయ అవకాశాలను కొల్లగొట్టిన అగ్ర వర్ణ రాజకీయ పార్టీలను సీట్లివ్వమని అడుక్కుందామా ? లేక సంఘటితమై మనమే అధికారాన్ని చేపడదామా ? ఒక సారి ఆలోచించండి. ప్రస్తుత పరిస్థితులను అధిగమించడానికి ఇతర పార్టీలకు వలసపోయిన బీసీలు సైతం తమ ఆత్మ గౌరవం కోసం సొంత గూటికి చేరే విధంగా బలమైన బీసీ మేనిఫెస్టోతో రాజకీయ పార్టీ నిర్మాణాన్ని చేపట్టాలి. డబ్బుతో మన ఓట్లు రాబట్టాలనే అగ్ర వర్ణ కుట్రలను మనం తిప్పికొట్టాలి. ఈ ప్రధాన ఉద్యమ కార్యాచరణలో భాగంగా ప్రస్తుత అగ్రవర్ణ ఆధిపత్య వ్యవస్థ వల్ల బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని గ్రామీణ ప్రాంతాల్లోని బీసీ వ్యక్తులకు తెలియజేప్పే విధంగా పలు డాక్యుమెంటరీ చిత్రాలను నిర్మించాల్సి ఉంది. కరపత్రాలు, రచనలు, పాటలు ద్వారా, వక్తృత్వ వ్యాసరచన పోటీల ద్వారా ప్రజలకు బలమైన సందేశం మనం అందించాల్సి ఉంది. బీసీ ఉద్యోగులు తమ అవకాశాలు, హక్కుల కోసం సహాయ నిరాకరణ కార్యక్రమాలను సైతం చేపట్టాల్సి ఉంది. రాజకీయ ఒత్తిడిని, అన్ని రాజకీయ పార్టీలకు బీసీ ఓట్లపై అనివార్యతను ఏర్పరిచే విధంగా బీసీ ఉద్యమాలను నిర్మించగలిగినప్పుడే భవిష్యత్తులో బీసీలు తమ తలరాతలు మార్చుకోగలుగుతారు. సామాజిక తెలంగాణకై కలలు గన్న ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్, చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో బీసీల ఆత్మ గౌరవ పోరాటాన్ని తీవ్రతరం చేయాల్సి ఉంది. ఇక్కడ మనం గమనించాల్సిన ప్రధాన అంశం ఏమిటంటే బీసీలకు అగ్రవర్ణాల పార్టీలు ఎన్నటికీ అద్దె కొంపలే.. రాజ్యాధికారం దక్కితేనే బీసీలకు సామాజిక న్యాయం దక్కుతుందని మనం గుర్తెరగాలి.. మన వర్గపు ఓట్ల పట్ల రాజకీయ అనివార్యతను మనం ఏర్పరచగలిగినప్పుడే ఈ సమాజంలో మార్పును, మన స్వయంపాలనను సాధించగల్గుతాము. ఈ విషయాలను గమనించిన బీసీ రాజ్యాధికార సమితి ఇప్పటికే తెలంగాణ లోని 5 ఉమ్మడి జిల్లాలలో క్షేత్రస్థాయి రౌండ్ టేబుల్ సమావేశాలను ఏర్పాటు చేసి 500 మంది బీసీ క్యాడర్ ను నియమించి వారికి నాయకత్వపు శిక్షణను నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమాన్ని ఘనమైయంగా విస్తరించి బలమైన రాజకీయ శక్తిగా అవతరించడానికి, బీసీ ప్రాతినిధ్యపు అసెంబ్లీ, పార్లమెంటరీ స్థానాలను కైవసం చేసుకుని బీసీ రాజ్యాధికార స్థాపన గావించే దిశగా విస్తృతంగా కృషి చేస్తుంది. కోటలో రాజ్యపు నిర్ణయాలు జరుగుతాయని బీసీ బహుజన నాయకుడు మన సర్దార్ సర్వాయి పాపన్న ఆనాడే గమనించి కోటను కైవసం చేసుకోవడం కోసం మొఘలులపై యుద్ధాన్ని ప్రకటించాడు. మరి నేడు ప్రధాన నిర్ణయాలు జరుగుతున్న అసెంబ్లీ, పార్లమెంటుకు బీసీలు ఎగబాకడానికి ఇంకెందుకు ఆలస్యం... రండి...! ఇక బలమైన క్షేత్రస్థాయి బీసీ నాయకత్వ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు కొనసాగుదాం. బీసీ యువతను, మహిళలను వారి నాయకత్వాన్ని ప్రోత్సహిద్దాం, దృఢమైన



నాయకత్వపు తర్ఫీదునిద్దాం. బీసీ రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా దూసుకెళదాం. మేము కట్టే టాక్సులతో ఊరేగుతూ మేము వేసిన ఓటుతో అందల మెక్కిన ఓ పాలక వర్గమా అధికారంలో అణగారిన వర్గాలకు, బీసీలకు ప్రాధాన్యత నివ్వకుండా ఇంకెంత కాలం కొనసాగుతారు. కాలం మారింది. మిమ్మల్ని గద్దె దింపడమే ఇక మిగిలింది.

**కొండా లక్ష్మణ్ బాపూజీ వారసత్వానికి ప్రతీక దాసు సురేష్**

లక్షలాది రూపాయల ఉద్యోగాన్ని తృణప్రాయంగా వదులుకొని తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న చేనేత రైతు ఆత్మహత్యలను అరికట్టాలనే బలమైన ఆకాంక్ష తో లక్ష్యాన్ని ముద్దాడే వరకు విరమించకుండా ప్రభుత్వంతో కొట్లాడి ప్రతీ రైతు , చేనేత కుటుంబాలకు 5 లక్షల రూపాయలు ఉచిత బీమాను ఇప్పించి తెలంగాణలో 60 లక్షల కుటుంబాలకు అండగా నిలిచిన యోధుడు, ప్రభుత్వానికి చేనేత రైతు వర్గాల పట్ల భాద్యతగా వ్యవహరించాల్సిన అనివార్యతను తన దేశ వ్యాప్త ఉద్యమాల ద్వారా సృష్టించిన ఘనుడు , మానవతావాది, అంబేద్కరిస్టు మా ప్రియతమ సోదరుడు దాసు సురేశ్ కి తెలంగాణ సమాజం పక్షాన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇది మాత్రమే కాకుండా ప్రత్యేక తెలంగాణ సాధన ఆకాంక్ష కోసం తన పదవులను సైతం లెక్కచేయకుండా అవకాశాలను తృణప్రాయంగా త్యాగం చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నిలువెత్తు విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టింపజేసేలా అన్ని సామాజిక ఉద్యమ రాజకీయ ప్రతినిధులను కూడగట్టి 6 సంవత్సరాలు అలుపెరగని పోరాటం చేసి ప్రభుత్వాన్ని దిగివచ్చే విధంగా నిర్విరామ కృషి సల్పి ఫలితాన్ని ప్రజల ముందుంచిన ఉద్యమాల యోధుడు, మా ఓరుగల్లు ,పోరుగల్లు వారసుడు దాసు సురేశ్ కు ఆత్మీయ ఉద్యమ వందనాలు తెలియజేస్తున్నారు.





## బీసీ మహిళలకు సబ్-కోటా కల్పించాలి

**బీసీ మహిళా భేరీ పోస్టర్ను ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ**

తెలంగాణ బ్యూరో[ప్రతినిధి: కేంద్ర[ప్రభుత్వం మహిళా బిల్లును ఆమోదించడం అభినందనీయమే నని, బీసీ మహిళలకు సబ్-కోటా ఎందుకు ఇవ్వడం లేదని మంత్రి కొండా సరేఖ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మార్చి 18, 19న ఢిల్లీలో జరుగనున్న బీసీ మహిళా భేరీ పోస్టర్ను మంత్రి ఆవిష్కరించారు. జాతీయ బీసీ మహిళా సంఘం ఉపాధ్యక్షురాలు మట్టా జయంతి గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నందగోపాల్, ఉదయ్ తదితర బీసీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళ బిల్లులో బి.సి. మహిళలకు జనాభా ప్రకారం సబ్-కోటా ఇవ్వాలని చేశారు. మహిళ బిల్లులో బి.సి మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళ బిల్లుకు సార్థకత లేదన్నారు. ఇప్పటికీ మహిళ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. లోక్ సభలో కూడా పెట్టి పూర్తి చేయాలని కోరారు. మహిళా బిల్లు గురించి గొంతులు చించుకొని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బి.సి మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాల గురించి, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నిస్తున్నాం. బి.సి.లంటే చిన్న చూపా? అసెంబ్లీ లో మొక్కుబడిగా తీర్మాణం చేసి చేతులు దులువుకుంటే సరిపోతుందా? అని ఆయన ప్రశ్నించారు. మహిళ బిల్లు పాస్ కావాలంటి బి.సి మహిళలకు సబ్-కోటా ఇవ్వక తప్పదు. జనాభాలో సగం ఉన్న బి.సి. మహిళలకు కోటా ఇవ్వకుండా మహిళల గురించి మాట్లాడటం అన్యాయమన్నారు. మహిళ బిల్లులో రాజకీయ రిజర్వేషన్ల తో పాటు విద్యా ఉద్యోగాలలో కూడా 50 శాతం రిజర్వేషన్ల ను ప్రవేశపెట్టాలని కోరారు రాజకీయ రిజర్వేషన్ల ను పెడితే 180 మంది మహిళలు పార్లమెంటులో సభ్యులవుతారు. కాని ఉద్యోగాలలో రిజర్వేషన్లు పెడితే కేంద్ర ప్రభుత్వం లోని 54 లక్షల ఉద్యోగాలలో, 27 లక్షల ఉద్యోగాలు, 29 రాష్ట్రలలో కలిపి ఒక కోటి 80 లక్షల ఉద్యోగాలలో 90 లక్షల ఉద్యోగాలు మహిళలకు దక్కుతాయని అన్నారు.మహిళలకు రక్షణ కోసం ఇప్పటికే అనేక చట్టాలు ముఖ్యంగా వరకట్న నిషేధ చట్టం, అత్యాచార నిరోధక చట్టం, నిర్భయ చట్టం,బాల్య వివాహాల నిరోధక చట్టం, దిశా చట్టం లాంటి 19 చట్టాలు వచ్చినప్పటికి వారి పై అత్యాచారాలు తగ్గలేదు. పురుశాధిక్యత తగ్గలేదు మహిళల రక్షణ కోసం మరిన్ని చట్టాలు తేవలసిన అవసరం ఉందన్నారు. మహిళలను చైతన్యం చేయాలి. అధికారంలో వాటా ఇవ్వాలని వారు కోరారు.

# పాలమూరు ద్రోహి కేసీఆర్

- రోబోలను రంగంలోకి దించుతాం ● లోపల ఉన్న వారి పరిస్థితి అధికారికంగా ఏమీ చెప్పలేం
- విపత్తును ఎదుర్కోవడంలో అందరూ సహకరించండి
- దుబాయ్ దావత్ మత్తు దిగిన తర్వాత హరీష్ రావుది మతిలేని మాటలు
- ఎస్ ఎల్ బి సి దుర్ఘటనా స్థలిలో సీఎం రేవంత్ రెడ్డి



నాగర్ కర్నూల్ ప్రతినిధి, మేజర్ న్యూస్ : నాగర్ కర్నూల్ జిల్లా దోమల పెంట సమీపంలోని ఎస్ఎల్బీసీ టన్నల్లో వారం రోజుల క్రితం చిక్కుకుపోయిన ఎనిమిది మంది పరిస్థితి ఏంటి అన్న విషయం నిపుణుల అభిప్రాయం వచ్చిన తర్వాతే చెప్పగలను తప్ప ప్రభుత్వపరంగా ఎలాంటి ఊహాగానాలతో ప్రకటన చేయలేమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి ఎస్ ఎల్ బి సి తెన్నల్ దుర్ఘటన స్థలాన్ని ముఖ్యమంత్రి ఇరిగేషన్ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ తదితరులు కలిసి పరిశీలించారు అక్కడ జరుగుతున్న సహాయ చర్యలు సంబంధించి నిపుణులతో మాట్లాడి తెలుసుకున్నారు తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి స్వయంగా పలు సూచనలు చేశారు అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జరిగిన సంఘటన ఇది ఒక విపత్తు అని ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్కతాటిపై అందరూ నిలబడి సమస్యలు పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు జరిగిన ప్రమాదంలో సహాయక చర్యలు చేపడుతున్న క్రమంలో సహాయక చర్యలో పాల్గొన్న వారికి ఎలాంటి నష్టం కలగకుండా సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూడాలని సూచించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు ప్రమాద స్థలికివెళ్లే క్రమంలో మరియ ప్రమాదం జరగకుండా అవసరమైతే రోబోలను రంగంలోకి దించేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు మిస్సయిన వారు ఎక్కడ ఉన్నారు అన్నది ఏ పరిస్థితుల్లో ఉన్నారనేది ఎక్స్పర్ట్ తేల్చాల్సిన అంశం అని అంతవరకు ప్రభుత్వపరంగా అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేమని అన్నారు బాధిత కుటుంబాల సభ్యులను ప్రభుత్వం ఆదుకుంటుందని కూడా ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ దుర్ఘటనకు సంబంధించి సహాయక చర్యల్లో పాల్గొన్న 11 సంస్థలను ఆయన కృతజ్ఞతలు తెలిపారు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అవసరమైన తక్షణ చర్యలను ప్రమాదం జరిగిన వెంటనే ప్రారంభించిందని కూడా సీఎం వెల్లడించారు

**ప్రపంచంలోనే అతిపెద్ద టన్నెల్**

నల్లగొండ ఫ్లోరైడ్ బాధితుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించే తో పాటు తెలంగాణలో లక్షలాది ఎకరాలకు సాగు తాగు నీరు అందించే ప్రాజెక్టు ఇది అని దేశంలోనే కాక ప్రపంచంలోనే 44 కిలోమీటర్ల తో తవ్వుతున్న అతిపెద్ద టన్నల్ ఇది అని ఇది ఒక మానవ నిర్మిత అద్భుతమని కూడా ముఖ్యమంత్రి అన్నారు. 2005 2006 సంవత్సరంలో ప్రారంభించిన ఈ 10 పనులు 2014 వరకు 32 కిలోమీటర్లు పూర్తి చేయడం జరిగిందని తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఈ పనుల పట్ల నిర్లక్ష్యం వహించడం జరిగిందని ఇక్కడ జరుగుతున్న పనులకు సంబంధించి పురోగతి లేకపోగా కనీసం జరుగుతున్న పనులకు విద్యుత్ బిల్లులు కూడా చెల్లించకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరిగిందని పరితంగానే నీరు నిలిచిపోయి ఇతర సమస్యలు ఏర్పడి నేటి ఈ దుర్ఘటనకు కారణంగా మారిందని కూడా ముఖ్యమంత్రి ఆరోపించారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సాంకేతిక నిపుణులతో చర్చించి డ్రిల్లింగ్ మిషన్ సంబంధించి అమెరికా నుండి స్పేర్ పార్ట్స్ తెప్పించి పనులు ప్రారంభించడం జరిగింది అన్నారు దురదృష్టవశాత్తు అనుకోకుండా ఈ ఘటన జరగడం బాధాకరమైన అన్నారు అయితే ఈ ఘటన వల్ల పనులు ఇలాంటి పరిస్థితుల్లో ఆపవమని మరింత మనోధైర్యాన్ని కూడగట్టుకొని అకుంఠిత దీక్షతో పనులు పూర్తి చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు బాధ్యత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని కూడా ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

హరీష్ రావు వి మతిలేని మాటలు గతంలో జరిగిన ఇలాంటి విపత్తులు దుర్ఘటనల్లో ప్రతిపక్షాలను దరిదాపుల్లోకి రాకుండా గత ప్రభుత్వం ఎక్కడికక్కడ నిర్బంధించిందని తాము మాత్రం అలా చేయకుండా విపక్షాలను ఘటనా స్థలానికి అనుమతించామని అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వాలని కూడా కోరామని ముఖ్యమంత్రి అన్నారు మాజీ మంత్రి హరీష్ రావు ఘటన జరిగిన తర్వాత దుబాయ్లో దావత్ లో పాల్గొని ఆ దావత్ మత్తు దిగిన తర్వాత వచ్చి మతి లేని మాటలు దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి దియబట్టారు ఘటన జరిగిన వెంటనే హరీష్ రావు దుబాయ్ దావత్ లో ఉన్నాడా లేదా అన్న విషయాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు ఆయన అబద్ధం చెప్పినా ఎయిర్పోర్టులో రికార్డు ఉంటుందని కూడా ముఖ్యమంత్రి అన్నారు. సహాయక చర్యల తీసుకునే విషయంలో ఎలాంటి జాప్యం కానీ నిర్లక్ష్యం కానీ లేదని ఇక్కడి పరిస్థితులను పట్టి తన్నల్లో చిక్కుకుపోయిన వారిని ఎప్పుడూ బయటికి తీసుకు వస్తారన్నది చెప్పేందుకు నిపుణులు పరిస్థితులను పట్టి అంచనాలు వేసి స్పష్టం చేస్తే కానీ చెప్పలేమని కూడా ఈ సందర్భంగా మంత్రి అన్నారు.

## వనపర్తిలో సీఎం రేవంత్ పర్యటన

- పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన
- వెంకన్న ఆలయంలో సీఎం పూజలు



తెలంగాణ బ్యూరో[ప్రతినిధి: తెలంగాణ సీఎం రేవంతడ్డి వనపర్తిలో పర్యటించారు. దీనిలో స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం ప్రత్యేక పూజలులు నిర్వహించారు. సీఎంకు వేదపండితులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆ తర్వాత ఆలయంలో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు. అనంతరం వనపర్తి జీజీహెచ్ భవన నిర్మాణం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణం, జెప్స్(బాలుర) పాఠశాల, జూనియర్ కాలేజీ భవనాలు, వనపర్తి ఐటీ టవర్, శ్రీ రంగాపురం దేవాలయం పనులు, పెబ్బేరు 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవనం, రాజానగరం - పెద్దమందడి బీటీ రోడ్డు నిర్మాణ పనులు, సీసీఆర్ రోడ్ల నిర్మాణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.

## వీహెచ్ తీరుపై ఏఐసీసీ ఆగ్రహం

**స్పందించిన హనుమంతరావు**



తెలంగాణ బ్యూరో[ప్రతినిధిః కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ హనుమంతరావు ఇంట్లో కావు నేతల సమావేశం జరిగిన విషయం పై కాంగ్రెస్ అధిష్టానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సమావేశానికి కాంగ్రెస్తో పాటు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కూడా హాజరైనట్లు తెలిసింది. ప్రతిపక్ష పార్టీలను పిలవడమేంటని మీనాక్షి నటరాజన్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. ఈ అంశంపై తాజాగా వీహెచ్ స్పందించారు. ఒకరిద్దరికి కోపం రావచ్చు. నిన్న మీటింగ్ లో సీఎం నీ.. ప్రభుత్వాన్ని ఎవరు తిట్టలేదు. జనాభా లెక్క కొంచెం తక్కువ ఉందని అన్నారు. దాని మీద సీఎం తోనే మాట్లాడుతాం. సీఎం తో మాట్లాడిన తర్వాత మున్నూరు కావు సభ తేదీ ఖరారు చేస్తాం. అని వీహెచ్ హనుమంతరావు స్పష్టం చేశారు. కాగా.. ఈ సమావేశం విషయంపై ఏఐసీసీ (అఖిల భారత కాంగ్రెస్ కమిటీ) సీరియస్ అయింది. కాంగ్రెస్ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ ఈ భేటీపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలను పిలిచి, ప్రభుత్వాన్ని విమర్శించడం ఏమిటని ప్రశ్నించారు. బీసీ కుల గణన చేసిన ప్రభుత్వాన్ని అభినందించాల్సిన పరిస్థితిలో, విమర్శించడం కరెక్ట్ కాదని ఆమె అన్నారు. అంతేకాకుండా.. కాంగ్రెస్ పార్టీ లీడ్ చేయాల్సిన సమావేశానికి ఇతర ప్రతిపక్ష పార్టీల నేతలను పిలిపించడం ఏంటని మీనాక్షి నటరాజన్ ప్రశ్నించారు. ఈ ఘటనతో మున్నూరు కావు నేతల అసంతృప్తి, కాంగ్రెస్ లో అసహనం స్పష్టంగా కనిపించింది. ఈ సమావేశం తర్వాత ఏఐసీసీ స్పందన ఇప్పుడు స్థానిక కాంగ్రెస్ నాయకుల్లో ఆందోళన కలిగించింది. పార్టీ పట్ల నిబద్ధత ఉన్న నేతలు మాత్రమే ముందుకు రావాలని, పార్టీ నియమాలను పాటించవలసిన అవసరం ఉందని అధిష్టానం సందేశం పంపినట్లుగా తెలుస్తోంది.

### గత ప్రభుత్వం కళాకారులకు

# నంది అవార్డులు ఇవ్వలేదు

- ఎల్బీ స్టేడియంలో ఘనంగా శ్రీ భక్త రామదాసు 392వ జయంతి ఉత్సవాలు
- పాల్గొన్న డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ● కళాకారుల నంది అవార్డులపై కీలక వ్యాఖ్యలు




తెలంగాణ బ్యూరో[ప్రతినిధిః హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో శ్రీ భక్త రామదాసు 392వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రతి యేటా తమిళనాడులో జరిగే త్యాగరాజ ఆరాధనోత్సవాల మాదిరిగా, ఇకపై ప్రతి సంవత్సరం తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా భక్త రామదాసు జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తోందని, ఇందులో ప్రముఖ సంగీత విద్వాంసులు పద్మశ్రీ డా. యెల్లా వెంకటేశ్వరరావు, పద్మశ్రీ డా. శోభారాజు, హైదరాబాద్ బ్రదర్స్, హైదరాబాద్ సిస్టర్స్, కోవెల శాంత, డివి మోహన్ కృష్ణ తదితరులు పాల్గొనడం గర్వంగా ఉందని చెప్పారు. తన జిల్లా ఖమ్మం నుంచే శ్రీ భక్త రామదాసు జన్మించారని, ఆ జిల్లాకు తాను ప్రాతినిధ్యం వహించడమే గాకుండా రాష్ట్రానికి డిప్యూటీ ముఖ్యమంత్రిగా ఉన్నందుకు ఎంతో గర్వంగా ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. తానిషా పాలనలో తహసిల్దారుగా ఉన్న రామదాసు, ప్రజల నుంచి వసూలు చేసిన డబ్బుతో భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని నిర్మించిన చరిత్రను స్మరించారు. ఈ చర్యకు తానిషా ప్రభువుల ఆగ్రహానికి గురై, గోల్కొండ కోటలో ఖైదీగా మారిన విషాద కహానీని వివరించారు. చిత్రహింసలను భరించి కూడా భక్త రామదాసు తన భక్తిని కోల్పోకపోవడం, కీర్తనలు రాయడం ద్వారా భక్తి రస వాగ్గేయకారుడిగా నిలిచారని కొనియాడారు. భక్త రామదాసును స్ఫూర్తిగా తీసుకొని, మరెంతో మంది సంగీత విద్వాంసులు, వాగ్గాయకారులు ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం కళలను ప్రోత్సహిస్తున్నట్లు వివరించిన భట్టి విక్రమార్క, గత దశాబ్ద కాలంగా సినిమా కళాకారులకు నంది అవార్డులు ఇవ్వలేదని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గద్దర్ పేరిట గద్దర్ ఫిలిం అవార్డులను ఉగాదికి అందజేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా, నాటక రంగాన్ని ప్రోత్సహించే దిశగా రాష్ట్రవ్యాప్తంగా నాటక పోటీలను నిర్వహించి, కళాకారులకు అవార్డులు ఇవ్వనున్నట్లు చెప్పారు. కళలు కొంతమందికే సొంతం అయినప్పటికీ, ఆ కళను సమాజానికి పంచి, కళాకారులు సమాజ వికాసానికి దోహదపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం అంతటా భక్తి రసాలను పండించింది. శ్రీ భక్త రామదాసు త్యాగాలు, భక్తి, కీర్తనలు తలచుకుంటూ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## నేడే ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి
- మూడు షిఫ్టుల్లో లెక్కింపు! ● ఫలితాలపై ఉత్కంఠ

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: వరంగల్- ఖమ్మం- నల్లగొండ, కరీంనగర్- మెదక్- ఆదిలాబాద్- నిజామాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. నల్లగొండలో ఓట్ల లెక్కింపు సిబ్బందికి శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సిబ్బంది కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి చివరి వరకు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. బ్యాలెట్ బాక్సులను ఏజెంట్ల ఎదురుగా సీల్ తీయడం, సంబంధిత ఫారాలలో సంతకాలు తీసుకోవాలని చెప్పారు. అలాగే కరీంనగర్- మెదక్- ఆదిలాబాద్- నిజామాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్యాలెట్ బాక్సులు భద్రపరిచిన కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలోనే ఓట్లను లెక్కించనున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి రెండు, మూడురోజులు సమయం పట్టే అవకాశమున్నందున మూడు షిఫ్టుల్లో లెక్కింపు చేపట్టేందుకు సిబ్బందిని నియమించారు. ఓట్ల లెక్కింపు చేసే హాళ్లలో సీసీ కెమెరాలను, భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శనివారం బ్యాలెట్ బాక్సుల భద్రతను, కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు తగు సూచనలిచ్చారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థులు హోరాహోరీగా తలపడడంతో ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## యాదాద్రి బ్రహ్మోత్సవాలు.. : అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం..



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు ఆదివారం ఉదయం అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. యాదాద్రి భక్తులతో కిటకిటలాడుతోంది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఆదివారం కొనసాగుతున్నాయి. ఉదయం అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈరోజు సాయంత్రం భేరిపూజ, దేవతాహ్వానం, హవనము తదితర పూజలు అర్చకులు నిర్వహించనున్నారు. ఆదివారం సెలవు దినం, మరోవైపు బ్రహ్మోత్సవాలు కావడంతో భక్తులు (గ్రా) పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. క్యూ లైన్లలో నిలుచుని లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుంటున్నారు. కాగా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం అయ్యాయి. ప్రధానాలయానికి స్వర్ణ విమాన గోపురం ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు మరింత శోభను సంతరించుకోనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వస్తివాచనం, అంకురారోపణం కార్యక్రమాలు జరిగాయి. ఆదివారం నుంచి 6వ తేదీ వరకు వరుసగా ధ్వజారోహణం, దేవతాహ్వానం, వేదపారాయణ, హవన, అలంకార సేవలు జరుగుతాయి. 7వ తేదీన ఎదుర్కోలు, 8న లక్ష్మీనరసింహస్వామి తిరు కల్యాణోత్సవం, 9న దివ్య విమాన రథోత్సవం, 10న శ్రీపుష్పయాగం, దేవతోద్వాసన, దోవ ఉత్సవం, 11న శతఘటాభిషేకం, శృంగారడోలోత్సవం, ఉత్సవ సమాప్తి కార్యక్రమాలు ఉంటాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ప్రధానాలయాన్ని, ఆలయ మండపాలను, ముఖద్వారాలను, గోపురాన్ని విద్యుద్దీపాలు, వివిధ రకాల పూలమాలలు, అరటి, మామిడి తోరణాలతో అందంగా తీర్చిదిద్దారు. ఈ నెల 8న తిరుకల్యాణ మహోత్సవానికి ప్రభుత్వం తరవున దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్వామివారిని దర్శించుకొని స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని, బ్రహ్మోత్సవాల నేపథ్యంలో కొండపైకి వాహనాలను ఉచితంగా అనుమతించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ఈవో ఏవూరిభాస్కరరావు వెల్లడించారు.

# స్వాతంత్ర్యానికి ముందే దేశంలోనే అతిపెద్ద విమానాశ్రయం మామునురు

- ఈ ఎయిర్‌పోర్టు నిర్మించాలని చిరకాల కోరిక
- హైదరాబాద్ క్యాపిటల్ సిటీ అవ్వడంతో తాకిడి తగ్గింది
- కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి



తెలంగాణ బ్యూరో[ప్రతినిధిః మామునూరు ఎయిర్ పోర్ట్ నిర్మించాలన్నది ఎప్పటి నుండో చిరకాల కోరిక అని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం మామునూరు ఎయిర్ పోర్టుకు నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కవాడిగూడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్రం రాకముందే దేశంలోనే అతిపెద్ద విమానాశ్రయం మామునూరు ఎయిర్ పోర్ట్.. హైదరాబాద్ క్యాపిటల్ సిటీ అవ్వడంతో వరంగల్ విమానాశ్రయానికి తాకిడి తగ్గి హైదరాబాద్ కు పెరిగింది.. మోదీకి ముందు 2014 లో దేశంలో 76 ఎయిర్ పోర్టులు ఉండేవి.. మోదీ ప్రధాని అయ్యాక ఈ పదేండ్లలో 159 విమానాశ్రయాలు పెరిగాయి.. ఉడాన్ స్కీమ్ వల్ల చిన్న నగరాలకు కూడా విమానయాన ప్రయాణం విస్తరించింది.. నువ్వు ఏపీకే కాదు.. తెలంగాణకు, యావత్ దేశానికి మంత్రివి అని చంద్రబాబు నాకు పలు సూచనలు చేశారు.. ఏపీ అభివృద్ధితో పాటే తెలంగాణకు కూడా అభివృద్ధి జరగాలని ఆయన చెప్పారు.. మామునూరు ఎయిర్ పోర్ట్ కు సంబంధించి ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వద్ద 696 ఎకరాల స్థలం ఉంది.. ప్రస్తుత రన్ వే 1600 మీటర్లు ఉంది.. ఎయిర్ బస్ లాంటి విమానాలకు 2800 మీటర్ల రన్ వే అవసరం.. అందుకే ఆలస్యం అయింది.. గతంలో కిషన్ రెడ్డి ఉడాన్ స్కీమ్ లో డెవలప్ చేయాలని ప్రయత్నాలు చేశారు కానీ రాష్ట్ర ప్రభుత్వం సహకరించలేదు.. అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో బ్రహ్మండమైన ఎయిర్ పోర్ట్ నిర్మిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్నాయుడు స్పష్ట చేశారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా దీన్ని నిర్మిస్తుంది.. టర్మినల్ బిల్డింగ్ కాకతీయుల చరిత్ర ప్రస్ఫుటిల్లేలా చేపడుతాం.. కావాల్సిన భూమి సేకరణ చేపట్టాల్సి ఉంది.. మరో ఎయిర్ పోర్ట్ భద్రాద్రి కొత్తగూడెం వద్ద ఉంది.. అక్కడ కొండలు, జియోగ్రాఫికల్ స్ట్రక్చర్ వల్ల ఫిజిబులిటి లేదన్నారు దీనితో మరో స్థలం చూపించారు.. ఆ స్థలంలో ఫిజిబులిటి చూశారు కానీ కొన్ని ఎర్రర్స్ ఉన్నాయి.. అన్ని పూర్తయ్యాక వచ్చే నివేదిక ఆధారంగా దానిపై నిర్ణయం తీసుకుంటాం.. విమానాశ్రయం ఏర్పాటు అయితే ఆ ప్రాంత రూపురేఖలు మారిపోతాయి.. రియల్ ఎస్టేట్, భూమి ధరలు పెరుగుతాయి.. ఎంతో అభివృద్ధి జరుగుతుంది.. ప్రపంచ నలుమూలల నుంచి వరంగల్ కు వస్తుంటారు.. విద్యకు కేంద్రంగా వరంగల్ ఉంది.. టెక్స్ టైల్ పార్క్, ఇతర పరిశ్రమల ఏర్పాటుకు మంచి అవకాశాలు ఉన్నాయి.. శంషాబాద్ విమానాశ్రయం చంద్రబాబు విజన్ కు నిదర్శనం.. తెలంగాణ అభివృద్ధి, ఎయిర్ పోర్ట్ ల నిర్మాణానికి కిషన్ రెడ్డి వారధిలా ఉన్నారు.. నాకు జన్మనిచ్చిన నేల తెలంగాణ..పార్టీ టీడీపీ.. తెలంగాణలో ఏరో స్పేస్ ఏర్పాటుకు కేంద్రం ప్లాన్ చేస్తోంది.. దాని వల్ల ఎంతో మందికి ఉపాధి లభిస్తుంది.. మామునూరు ఎయిర్ పోర్ట్ కు భూసేకరణ చేపడితే త్వరలో మామునురు నిర్మాణం చేపడుతాం.. ఇప్పటికే అన్ని అనుమతులు వచ్చాయి.. భూసేకరణ అయిపోయాక 3 ఏండ్ల సమయం పడుతుంది..కానీ దీనిపై మా ఫోకస్ ఉంది కాబట్టి రెండున్నర ఏండ్లలో పూర్తి చేస్తాం.. మామునూరు ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి జీఎంఆర్ కూడా ఎలాంటి అబ్జెక్షన్ చెప్పలేదు.. హైదరాబాద్ లో త్వరలో ఉడాన్ యాత్రి కేఫ్ ఏర్పాటు చేస్తాం.. అని రామ్మోహన్నాయుడు మీడియాకు తెలిపారు.

## సిటీ ఆర్టీసీ బస్సుల్లో ఆన్‌లైన్ టికెటింగ్ విధానం




సిటీ బస్సు ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త చెప్పింది. చిల్లర సమస్యకు తావులేకుండా కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ప్రతి సిటీ బస్సులో క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ ఉంచుతారు. యూపీఐ పెమెంట్స్ ద్వారా టికెట్ తీసుకునే వెసులుబాటు టీజీఎస్ ఆర్టీసీ కల్పించింది. తెలంగాణ ప్రభుత్వం సిటీ ఆర్టీసీ బస్సుల్లో ఆన్లైన్ టికెటింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. యూపీఐ చెల్లింపుల విధానంతో టీజీఎస్ ఆర్టీసీ ప్రారంభించింది. గ్రేటర్ హైదరాబాద్లోని మొత్తం 2,200 బస్సుల్లో క్యూఆర్ కోడ్ ద్వారా టికెటింగ్ విధానం మొదలు పెట్టింది. దీంతో టీజీఎస్ ఆర్టీసీ సిటీ బస్సుల్లో చిల్లర సమస్యకు చెక్ పెట్టింది. యూపీఐ చెల్లింపులు జీవితంలో ముఖ్య భాగం అయిపోయాయి. షాపింగ్కు వెళ్లినా చిన్న చిన్న కిరాణా దుకాణాలకు వెళ్లినా వస్తువలు కొనుగోలు చేసి క్యూఆర్ కోడ్ ద్వారా డబ్బులు చెల్లిస్తున్నాం. అదే విధంగా ఆన్లైన్ షాపింగ్ కూడా చేస్తున్నాం. భారతదేశాన్ని న్యూ ఇండియా, డిజిటల్ ఇండియాగా మార్చడానికి ఇది చాలా ముఖ్యమైన సాధనమని చెప్పవచ్చు. ఇప్పటికే ప్రజలు ఆన్లైన్ చెల్లింపు విధానానికి అలవాటు పడ్డారు. దీన్ని దృష్టిలో పెట్టుకున్న తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చిల్లర సమస్యకు చెక్ పెడుతూ.. సిటీ ఆర్టీసీ బస్సుల్లో ఆన్లైన్ టికెటింగ్ విధానం ప్రవేశపెట్టింది. సిటీ బస్సు ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ శుభవార్త చెప్పింది. చిల్లర సమస్యకు తావులేకుండా కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ప్రతి సిటీ బస్సులో క్యూ ఆర్ కోడ్ స్కానింగ్ ఉంచుతారు. యూపీఐ పెమెంట్స్ ద్వారా టికెట్ తీసుకునే వెసులుబాటు టీజీఎస్ ఆర్టీసీ కల్పించింది. ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టంలో భాగంగా ఆర్టీసీ ఆన్ లైన్ టికెటింగ్ తీసుకొచ్చింది. త్వరలోనే మరిన్ని ఆన్లైన్ సేవలు అందుబాటులోకి తీసుకొస్తామని టీజీఎస్ ఆర్టీసీ ప్రకటించింది. సిటీ బస్సుల్లో క్యూఆర్ కోడ్ స్కానింగ్తో ప్రయాణం చేయవచ్చునని టీజీఆర్టీసీ ప్రకటించింది. కాగా కాంగ్రెస్ సర్కార్ తెలంగాణలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన విషయం తెలిసిందే. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి పథకం ఒకటి. అయితే, పల్లెవెలుగు, ఎక్స్ప్రెస్ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2023 డిసెంబర్ 8న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. మహిళా ప్రయాణికుల ఛార్జి మొత్తాన్ని ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది.

# పదిమందికి మేలు చేస్తే పది తరాలు గుర్తుండాలి

- ఘనంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు 88వ జయంతి వేడుకలు
- పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు



తెలంగాణ బ్యూరో[ప్రతినిధి: పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాదరావు 88వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పాల్గొని, శ్రీపాదరావు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. పదిమందికి మేలు చేస్తే పది తరాలు గుర్తుంచుకోవాలి అంటూ శ్రీపాదరావు సేవా స్ఫూర్తిని ప్రతిబింబించారు. శ్రీపాదరావు ఉమ్మడి రాష్ట్రంలో చేసిన సేవలను ఆయన కొనియాడారు. నివాళులర్పించిన అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మంథని ప్రభుత్వ సామాజిక వైద్యశాలను సందర్శించారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయడంతో పాటు శానిటేషన్ సిబ్బందికి దుస్తులను అందజేశారు. అ తర్వాత, మంథని ప్రయాణ ప్రాంగణంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించి, ప్రజలకు ఉచితంగా మజ్జిగను అందించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకుల ప్రేమ, అభిమానాలే మాకు స్ఫూర్తి. నేను రాష్ట్రానికి మంత్రి అయినా, ఈ నియోజకవర్గంలో సాధారణ కార్యకర్తగానే ఉంటాను. మా మధ్యలో శ్రీపాదరావు లేకపోయినా, ఆయన స్ఫూర్తితో కార్యకర్తలు ముందుకు సాగుతున్నారు అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'సూర్య' సాహిత్య సాంస్కృతిక వేదిక
అక్షరం
4 సోమవారం 3 మార్చి 2025
suryaeditpage@gmail.com

# ఎక్కడమ్మా... నువ్వు



ఎక్కడమ్మా... నువ్వు
ఎక్కడమ్మా... నువ్వు లేనిది
ఏమిటమ్మా నీకు రానిది
అమ్మగా నువ్వే అనంతం
ఆలిగా నువ్వే అద్భుతం
అక్కగా చెల్లిగా నువ్వే అమృతం...

టీచర్ గా నువ్వే ఫ్యూచర్
డాక్టర్ గా.. యాక్టర్ గా
కలెక్టర్ గా.. కండక్టర్ గా
న్యాయవాదిగా నాయకురాలిగా
వ్యాపారంలో నువ్వే వ్యవహారంలో నువ్వే
అన్నిట్లో నీదే అందెవేసిన చెయ్యి...

గల్లీ నుండి ఢిల్లీ దాకా
నువ్వు పాదం మోపని రంగం ఏది?.
నీ సంకల్ప బలమే నీకు కవచం
నీ కళ్ళ నిండా ధైర్యం నీ కలల నిండా లక్ష్యం
ఆకాశమే నీ హద్దు...

అద్వితీయమైన నీ శక్తి అద్భుత ఫల ప్రదం
కాలం మారినా నీ స్థానం మారలేదన్న
ముఖాలు ముఖం చాటేస్తున్న రోజులు ఇవి

నీ ధ్యేయాలు దేశానికి కొత్త పాలసీ కావాలి
నీ ధైర్యం జనులందరికి పాఠం కావాలి
ఎద్దేవా చేసే వారికి నీ విజయం
గుణపాఠం కావలి..

సృష్టికి దృష్టి నువ్వే
నీతోనే సమస్తం ఈ లోకం
నీతోనే సాధ్యం కొత్త లోకం ..

**గిరిపట్ల 9985926292.**

# భూమి పుత్రుడు



భూమి పుత్రుడు
ఉదయ భానుడి తొలి కిరణాలు
నేలను తాకేలోగానే
అతను చేత ముల్లుకర్రబూని
యథాలాపంగ బయలుదేరతాడు–
ఆ గమనం...
ఉదయ కాలపు వాహ్యాళికి కాదు
నలుగురితో కలిసి
కబుర్లాడుకునేందుకూ కాదు
తను ప్రాణంకన్నా మిన్నగా ప్రేమించే
నేలతల్లి నిత్య దర్శనం కోసం..
గుడిచుట్టూ చేసే భక్తి ప్రదక్షిణంలా
తన జీవనాధారమైన చేను చుట్టూ
అనురక్తి ప్రదక్షిణం చేస్తూ
మట్టివాసనను, పచ్చని పైరుగాలిని
పరిమళంగా ఆస్వాదిస్తుంటాడు
అతడు చేలో కాలుమోపడంతోటే
మట్టిలోని అణువణువూ
పులకరించిపోతుంది
మట్టిపొరల్లోంచి మొలకెత్తిన
ప్రతిమొక్కా తృప్తిగా తలూపుతుంది
కనులారా చేనుతల్లిని తిలకించి
గట్టున కూర్చొని సేదతీరుతుంటాడు
ఈ నిత్యకృత్యం నిర్వహించనిదే
అతని మనసు కుదుట పడదు
రోజువారీ చర్యలు మొదలవ్వవు
భూమితల్లికీ తనకి మధ్య పెనవేసుకున్న
ఈ అనుబంధం ఒకనాటిది కాదు
తరతరాల విడదీయరాని బంధం అది
అపజయాలు ఎన్నెదురౌతున్నా
నష్టాల ఊబిలో దిగబడినా
సేద్యాన్ని వీడని విక్రమార్కుడతను!
ఎందుకంటే..
భూమినే నమ్ముకున్నభూమిపుత్రుడతను!!

**పి.వి.ప్రసాద్**
**9440176824**

# కవల పిల్లలు !

కొలువులు ప్రేమల నెలవుల
కోమలుల వలలో పడి
కాలం కరిగిపోతున్నా
కళ్యాణం ఊసెక్కడిది !

పరుగెత్తి పాలు త్రాగే కన్నా
నిల్చుండి నీళ్ల త్రాగడం మిన్న
కాలం కలిసి వస్తే
నడిచొచ్చే పిల్లలు పుడతారట!

కరోనా కరుణ లేనిదే అయినా
కళ్యాణాలు కార్యాలు ఆపినా
పెళ్లిళ్ల ఆత్రుత,వాయిదాలు పడినా
జంటలకు కవలపిల్లల ప్రాప్తి ఫాయిదానే!

**పి.ఐక్కారెడ్డి**
**9705315250**

# కవితాజల్లులు



విచిత్రాలు చూపనా
వినోదము కలిగించనా
విస్మయము కొల్పనా
వినువీధిన విహరింపజేయనా
కొత్తదనాలు కుమ్మరించనా
కమ్మదనాలు క్రోలమందునా
వయ్యారాలు వర్ణించనా
సింగారాలు చూపించనా
మాటలు కూర్చనా
మనసులు దోచనా
మల్లెలు విసరనా
మత్తునందు ముంచనా
భావాలు పారించనా
భ్రమలందు తేలించనా
తేనెబొట్లు చల్లనా
అమృతచుక్కలు చిందనా
కలాలు కదిలించనా
కవనాలు సృష్టించనా
కవితలు చదివించనా
మోములు వెలిగించనా
కవితాజ్వాలలు రగిలించనా
కవితాలోకమందు సంచరింపజేయనా
కవితాజల్లులు కురిపించనా
కవనప్రవాహమును కొనసాగించనా

**గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,**
**9177915285**

# ప్రపంచం అంతా నిద్రలో



ప్రొద్దు వాలిపోతోంది
భానుడు తన ప్రతాపం చాలించి
పడమటి కొండలో క్రుంగిపోతున్నాడు
పక్షులు గూళ్ళు చేరుకుంటున్నాయి
ఆకాశం తన రంగు మార్చుకుంటోంది
చిరు చీకట్లు అలుముకున్నాయి
నెమ్మదిగా చిక్కటి చీకటి అలుముకుంటోంది
భూమి నిద్రలోకి జారుకుంది
ఆకాశం కూడా నిద్రలోకి జారుకుంది
ప్రపంచం అంతా నిద్రలో కూరుకుంది
ప్రయాణం కొనసాగుతూనే ఉంది
ప్రతి మలుపు
ప్రతి మజిలీ
నిద్రపోతోంది
ఇల్లు పరివారం ఉన్నవారు
నిశ్చింతగా నిద్రపోతున్నారు
ఇల్లు వాకిలి లేని ఒంటరిగాళ్ళు
దారి దిక్కులేక గాలితోపాటుగా
ప్రయాణం చేస్తూనే ఉన్నారు
మౌనవ్రతం దాల్చకు
ఏదో ఒక కథ చెపుతూఉండు
సమయం అనే రథం కదలాలి కదా
ప్రయాణం ఒకచోట ప్రారంభం
అంతం ఎక్కడో తెలియదు
అంతరంగం నిండా దిగులు మేఘాలు
ప్రేమలో మునిగి తేలిన క్షణాలు
ఎటో దొర్లిపోయాయి
మనం ఓటమి పాలయ్యాము
మనపై ప్రపంచం గెలిచింది
ఇక కనుచూపు మేరలో
కేవలం అంధకారం నెలకొంది

**అరుణ డేనియల్**
9000606889

# కాల లక్షణ నిరూపణ



**వనం జ్వాలా నరసింహారావు**
**80081 37012**

**కం॥ చదివెడిది భాగవతమిది,**
**చదివించును కృష్ణు, దమృతఝరి పోతనయున్**
**చదివినను ముక్తి కలుగును,**
**చదివెద నిర్విఘ్నరీతి 'జ్వాలా' మతినై**

పరమేశ్వరుడి సృష్టికి అంతం, అన్యవస్తు సంయోగం, రెండూ అవసరం లేదు. ఈ యావత్ ప్రపంచం పుట్టుక వేరు. సృష్టిలో విడదియ్యలేని అత్యంతా సూక్ష్మాంశానికే 'పరమాణువు' అని పేరు. కిటికీ నుంచి ప్రసరించే సూర్యకాంతిలో మనకు కనిపించే చిన్న రేణువులలో ఆరవ భాగానికి 'పరమాణువు' అని పేరు. సూర్యకాంతి ఈ పరమాణువు ద్వారా ప్రసరించేటప్పుడు పట్టె కాలానికి 'సూక్ష్మకాలం' అని పేరు. దీన్ని మనం ఊహించుకోవాల్సిందే! సూర్యుడు మేషాది పన్నెండు రాశులలో తిరిగే కాలానికి 'మహత్కాలం' అని పేరు. దీనినే సంవత్సరం అని కూడా అంటాం. రెండు పరమాణువులు కలిస్తే ఒక 'అణువు' అవుతుంది. మూడు అణువులు ఒక 'త్రసరేణువు'. మూడు త్రసరేణువులు కలిస్తే ఒక 'త్రుటి'. నూరు త్రుటులు కలిస్తే ఒక 'వేధ'. మూడు వేధలు కలిస్తే ఒక 'లవం'. మూడు లవములు ఒక 'నిమేషం'. మూడు నిమేషాలు ఒక 'క్షణం'. అయుదు క్షణాలు ఒక 'కాష్ట'. పది కాష్టలు ఒక 'లఘువు'. పదిహేను లఘువులు ఒక 'నాడి'. రెండు నాడులు ఒక 'ముహూర్తం'. అలాంటి నాడులు ఆరు కానీ ఏడు కానీ అయితే ఒక 'ప్రహరం'. దానినే 'యామం' అనీ, 'జాము' అనీ అంటారు.

దిన పరిమాణాన్ని తెలిపే నాడిని కొలిచే విధానం ఉన్నది. ఆరు ఫలాల రాగితో పాత్రను సిద్ధం చేసి, నాలుగు మినప గింజల బరువు కల బంగారంతో నాలుగు అంగుళాల పొడవుకల కమ్మీ తయారు చేసి, దానితో ఆ పాత్ర కింద రంధ్రం చేసి, ఆ రంధ్రం గుండా తూమెడు నీరు పూర్తిగా కిందకు కారడానికి ఎంతకాలం పడుతుందో అంత కాలాన్ని 'నాడి' అంటారు. నాలుగు జాములు ఒక 'పగలు' అవుతుంది. అలాగే నాలుగు జాములు ఒక 'రాత్రి' అవుతుంది. పగలు, రాత్రి కలిస్తే మానవులకు ఒక 'దినం' అవుతుంది. పదిహేను దినాలు ఒక 'పక్షం' అవుతుంది. 'శుక్ల పక్షం', 'కృష్ణ పక్షం' అని రెండు ఉన్నాయి. రెండు పక్షాలు కలిస్తే ఒక 'నెల'. అది పితృదేవతలకు ఒక 'దినం'. రెండు నెలలు ఒక 'ఋతువు'. ఆరు నెలలు ఒక 'ఆయనం'. ఆయనాలు రెండు. 'దక్షిణాయనం', "ఉత్తరాయనం'. ఈ రెండూ కలిస్తే ఒక సంవత్సరం. నూరు సంవత్సరాలు మానవులకు పరమాయువు. మానవుల సంవత్సరం దేవతలకు ఒక్క దినం అవుతుంది.

ఈశ్వరుడు అంశ అయిన సూర్యుడు గ్రహ, నక్షత్రాలతో కూడి తారాచక్రంలో ఉండి తారాచక్రంలో ఉండి పరమాణువు మొదలు సంవత్సరం వరకు వున్న కాలంలో పన్నెండు రాశులను చుట్టి వస్తాడు. ఈ సూర్యగమనమే సంవత్సరం, వలీసంవత్సరం, ఇడాసంవత్సరం, అనువత్సరం, వత్సరం అనే భేదాలు కలిగి ఉంటుంది. సూర్యగమనం వల్ల సౌరమానం, చాంద్రమానం, నక్షత్రమానం, బార్హస్పత్యమానం అనే భేదాలతో సంవత్సర కాలం ఏర్పడుతుంది. కాలాన్ని ప్రవర్తింప చేసే సూర్యుడు, విత్తనాల నుండి అంకురాలు మొలకెత్తినట్లు కాలరూపమైన తన శక్తితో అనుకూలంగా మలచుకుంటూ, జీవుల ఆయువు మొదలైనవాటిని తగ్గిస్తూ, ఆయువు తగ్గుతుంటే క్రమంగా విషయాల పట్ల కోరికలు తగ్గుతూ, కోరికలతో యజ్ఞాలు చేసేవారికి గుణాలతో కూడిన స్వర్గాది లోకాలను సమకూరుస్తూ, ఆకాశంలో సంచరిస్తూ ఉంటాడు. ఈ విధంగా అయిదు విధాలైన సూర్యభగవానుడిని ఆరాధించాలి.

ఇకపోతే కృతయుగ సంఖ్య నాలుగువేల దివ్య సంవత్సరాలు. దాని సంధ్యాకాలం ఎనిమిదివందల ఏళ్లు. గతించిన యుగానికి, రాబోయే యుగానికి మధ్యకాలాన్ని 'సంధ్య' అంటారు. త్రేతాయుగ ప్రమాణం మూడువేల దివ్య సంవత్సరాలు. సంధ్యాకాలం ఆరువందల ఏళ్లు. ద్వాపరయుగ ప్రమాణం రెండువేల దివ్య సంవత్సరాలు. సంధ్యాకాలం నాలుగువందల సంవత్సరాలు. కలియుగ ప్రమాణం వెయ్యి దివ్య సంవత్రసరాలు. సంధ్యాకాలం రెండువందల సంవత్సరాలు. ఈ సంధ్యాంశాల మధ్యకాలంలో ధర్మం అతిశయిస్తుంది. సంధ్యాంశలో ధర్మం అల్పమై వుంటుంది. దర్మదేవత కృతయుగంలో నాలుగు పాదాలు, త్రేతలో మూడు పాదాలు, ద్వాపరలో రెండు పాదాలు, కలియుగంలో ఒక్క పాదంతో సంచరిస్తుంది. ఈ పాదాల భేదం వల్ల ప్రజలలో మర్యాదలు తగ్గుతాయి. అధర్మం పుట్టి వృద్ధిపొందుతుంది.

భూలోకం, భువర్లోకం, స్వర్గలోకం.....వీటికంటే పైన సత్యలోకం ఉంటుంది. అక్కడ ఉండే బ్రహ్మకు చతుర్యుగాలు వేయి అయితే ఒక పగలు అవుతుంది. అలాగే రాత్రికూడా. బ్రహ్మ రాత్రి నిద్రపోతే లోకాలన్నిటికీ ప్రళయం వస్తుంది. మేల్కొని చూస్తే తిరిగి లోకాలు పుట్టాయి. ఆ బ్రహ్మ ఒక్క దినంలో పద్నాలుగు మన్వంతరాల కాలం గడుస్తుంది. వాళ్లలో ఒక్కొక్క మనువుకాలం 71 దివ్య యుగాలు. దీనికే మన్వంతరం అని పేరు. దేవతలు, మునులు, సప్తఋషులు వీళ్లంతా భగవదంశతో పుట్టి ఈ మన్వంతరాలలో ఈ లోకాలను పాలిస్తారు. శ్రీహరి పితృ, దేవ, పశు , పక్షి, మానవ రూపాలలో జన్మించి ఈ మన్వంతరాలలో తన సత్త్వగుణం వల్ల, పురుష భావం వల్ల ఈ విశ్వాన్ని పాలిస్తాడు. పగలు పూర్తికాగానే బ్రహ్మ శయనిస్తాడు. ఆయన నిద్రలో ఉన్నప్పుడు ఆయన శక్తిసామర్థ్యాలు, పరాక్రమం అంధకారంతో ఆవరింపబడి వుంటాయి. బ్రహ్మ నిద్రించే సరికి భువనత్రయం కూడా కటిక చీకటిలో సూర్యచంద్రులతో పాటు లీనమై



## శ్రీ మహాభాగవత కథ-25

పోతుంది. శ్రీహరి శక్తిరూపమైన సంకర్షణాగ్ని ముల్లోకాలను దహిస్తుంది. ఆ అగ్నికీలలకు వ్యాపించిన వేడికి తట్టుకోలేక మహర్లోకవాసులు జనలోకానికి పరుగెత్తుతారు. ఆ విలయ సమయంలో వీచే భీకరమైన వాయువులకు ఎగిసిపడే మహా భయంకరమైన సముద్ర జలాలు మూడులోకాలను కప్పేస్తాయి. ఆ మహార్ణవ మధ్యలో శయనించి ఉంటాడు శ్రీమన్నారాయణుడు. తన కడుపులో సమస్త లోకాలను పెట్టుకుని యోగనిద్రలో ఉంటాడు ఆయన.

ఈ విధంగా అనేక రాత్రుళ్లు, పగళ్లు గడుస్తుంది. మానవుల లాగానే బ్రహ్మ దేవుడి ఆయుర్దాయం కూడా (ఆయన లెక్కలో) వంద సంవత్సరాలే. ఆ వంద సంవత్సరాలలో మొదటి 50 'పూర్వ పరార్ధం' అనీ, రెండవ 50ని 'ద్వితీయ పరార్ధం' అనీ అంటారు. ఈ మొత్తం కాలాన్ని 'బ్రహ్మకల్పం' అని పిలుస్తారు. ఈ కల్పం ప్రారంభంలో బ్రహ్మదేవుడు ఉదయించిన కారణంగా బ్రహ్మకల్పం అని పిలుస్తారు. దీనికే 'శబ్దబ్రహ్మం' అని మరొక పేరుంది. ఎప్పుడైతే పంకజనాభుడి నాభి అనే సరస్సులో సమస్త భువనాలకు ఆశ్రయభూతమై పద్మం ప్రకాశిస్తుందో అది 'పద్మకల్పం' అనే పేరుతో ఒప్పుతుంది. బ్రహ్మదేవుడి ఆయుర్దాయంలో మొదటి సగం అంటే 'పూర్వ పరార్ధం' గడిచిపోయింది. ఇక రెండవది అయిన 'ద్వితీయ పరార్ధం' ప్రారంభం ఎప్పుడంటే సూకరాకారాన్ని ఎప్పుడు ధరిస్తాడో అప్పుడు ప్రారంభమవుతుంది. దానిని 'వరాహకల్పం' అంటాం. ఇప్పుడు నడుస్తున్న కల్పం వరాహకల్పమే! ఈ శ్వరుడికి పరమాణువు మొదలు పరార్ధం వరకు గల కాలం ఒక్క నిమిషం మాత్రమే. ఈశ్వరుడే కాలానికి కర్తగాని, కాలం ఈశ్వరుడికి కాదు. శ్రీమహావిష్ణువు అన్నిటికీ అతీతుడు. ఆ మహాపురుషుడికి కాలం ఎన్నటికీ కర్తకాదు. ఈ బ్రహ్మాండం పదహారు వికారాలతో కూడి, పంచభూతాలు, పది విధాలైన ఆవరనాలు కలిగి, 50 కోట్ల యోజనాల విస్తీర్ణంలో ఉంటుంది. భగవంతుడు పరమాణు రూపంలో బ్రహ్మాండంలో ప్రకాశిస్తూ ఉంటాడు. అసంఖ్యాకమైన మహాండ సమూహాలు ఆయనలో అణగి ఉంటాయి. ఆ పరమపురుషుడిని వర్ణించడం ఎవరి తరం కాదు.

**(బమ్మెర పోతన శ్రీమహాభాగవతం,**
**రామకృష్ణ మఠంప్రచురణ ఆధారంగా)**

# పుస్తకాల తోటలో..29

**డా:అమ్మిన@77298 83223**

రాయలసీమ బాల సాహితీమణి చారిత్రక కథా వీధిలో తెలుగు బాల సాహిత్యాన్ని సుసంపన్న చేసిన కథారత్న "కల్లూరు రాఘవేంద్రరావు" గారి కలం నుంచి వెలువడిన పిల్లల కథాపొత్తం "స్వర్గానికి దుప్పట్లు"


బాల సాహిత్యం అనగానే యుక్తి కథలు, అద్భుత కథలు, నీతి కథలు, మనకు గుర్తుకు వస్తాయి. కానీ రాఘవేంద్రరావు గారి కథల్లో చారిత్రక విషయాలు నిండిన కథలు కనిపిస్తాయి, వృత్తిరీత్యా అధ్యాపకత్వం చేసిన హిందూపురం వాసి అయిన వీరి తొలి బాలల కథా సంపుటిఇది. దీనిలో మొత్తం 24 కథలు ఉన్నాయి, ప్రతి కథ స్థానిక చారిత్రక అంశానికి ముడిపడి సాగుతుంది, మరికొన్ని సంస్కృతి సాంప్రదాయాలకు చెందినవై ఉన్నాయి.

ఉచితాల వల్ల కలిగే నష్టాల గురించి చెబుతూ కష్టం యొక్క ఫలితాలను కళ్ళకు కట్టి చక్కని నీతిని పంచిన మంచి కథ "కష్టేఫలి" నుంచి మొదలు సఖ్యత లోని సహృదయత చాటి, తద్వారా కుటుంబాలు సమాజం ఎలా మేలు పొందుతాయో ఎంచక్కా చెప్పిన చక్కని కథ "కాదంటావా"? వరకు సాగిన ఈ 24 కథల సమాహారం లోని ప్రతి కథ విలువైనదే!!

శ్రీకృష్ణదేవరాయల కాలంలో జరిగినట్టు చెప్పిన చారిత్రక కథ "గొడుగు గోపాలుడు" రాయల వారి పనివారిలో ఒకడైన గోపాలుడు ఒకరోజు రాజ్యాధికారం చేపట్టి కేవలం రోజు వ్యవధిలో ఆ రాజ్య ప్రజలకు ఎంతటి గొప్ప సాయం చేశాడో తెలియాలి అంటే ఈ వాస్తవ చారిత్రక కథ చదవాల్సిందే!!

మనలోని అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు మనల్ని ఎలా మోసం చేస్తారో చెబుతూనే దానగుణంలోని గొప్పతనం చెబుతూ అపాత్ర దానం ఎంతకు తగదు అని చురకవేసిన హితో పదేశపు కథ "స్వర్గానికి దుప్పట్లు" అదే దాన గుణమును మరికాస్త ఉన్నతీకరిస్తూ చక్కగా చెప్పిన మంచి కథ "మజ్జిగ దానం," పరిపాలనలో తీసుకునే చర్యల ద్వారానే ఉత్తమ ఫలాలు అందుతాయి, ప్రజలకు ఉపాధితో కూడిన ధన లాభం ఉండాలి తప్ప ఉచితాలతో కలిగే వాటి వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు రాదు అనే అసలు సత్యం చాటిన మంచి కథ "నేరగాళ్ల రాజ్యం"

సంతృప్తికి మించిన సంపద లేదు అనే సత్యం చాటుతూ అత్యాశకు




పోయి కోరి కష్టాలు తెచ్చుకొని చివరికి చనిపోయిన ఓ చేప కథ "కొత్త బతుకు" తో పాటు... మాటల చతురత తో ఎలాంటి లాభాలు పొందవచ్చో చెబుతూ ఒక సాధువు తనదైన మాటల నేర్పుతో గిరిజనుల నుంచి మంచి మాంసాహారం సంతృప్తిగా ఎలా పొందాడో తెలుసుకోవాలి అంటే "ఆహారపు రాళ్లు" కథ చదివి తీరాల్సిందే మరి,

ఇందులోని ప్రతి కథ పాఠకులను ఇట్టే ఆకర్షిస్తూ చదివించుకుంటూ పాఠకులను తన వెంట నడిపించుకు పోతుంది, కథలోని శైలితో పాటు కథల పేర్లు కూడా భలే గమ్మత్తుగా ఆకర్షణీయంగా ఉంటాయి. వింత పువ్వు, స్వర్గానికి దుప్పట్లు, ఆహారపు రాళ్లు, మొదలైనవి ఈకోవకు చెందుతాయి. సకల రసాల సమ్మేళనంగా సాగే ఈ చక్కని బాలల కథా సంపుటి ఆబాల గోపాలాన్ని అలరిస్తుంది అనడంలో అక్షర సత్యం నిండి ఉంది.

**స్వర్గానికి దుప్పట్లు (బాలల కథా సంపుటి) రచన: కల్లూరు రాఘవేంద్రరావు, పేజీలు: 72, వెల: 60/- రూ, ప్రతులకు: రచయిత, శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల,26-4-982, త్యాగరాజనగర్, హిందూపురం - 515 201, సెల్: 94932 71620.**

# పరిమళ లేపనం"చందనాగ్ని" కవిత్వం

ఎవరికీ చెప్పుకోలేని భావాలని, సంఘటనల్ని కవిత్వపు పరిభాషలో కాగితాలపై అరబోస్తుంటారు కొందరు. ఏళ్లకేళ్ళ అపూర్వ అనుభవాల్ని, మానవీయ విలువల్ని అక్షరాలుగా మార్చి తనదైన శైలిలో మాలలుగా అల్లిన కవిత్వమిది. పుస్తకం చదివినంత సేపూ చందనం లాంటి శీతలపు పరిమళమేదో చదువరుల మదిమేనిని సుతారంగా తాకుతూ ఉంటుంది. కాస్త చమత్కారం, కొంత తాత్వికత, ఒకలాంటి లయ, అందరికీ అర్థమయ్యే పదాల సరళత మనల్ని ఆకర్షిస్తుంది. వి.పి. చందన్ రావు గారు సాహితీ ప్రపంచమెరిగిన సాహితీ వేత్త. వక్త, వ్యాఖ్యాత. ఆయన కవిత్వ పుస్తకం"చందనాగ్ని" 171 కవితలు 214 పేజీల ఉద్గ్రంథం. చదువుతున్నంత సేపూ మనం ఆయన చమత్కార కవితా పంక్తుల వెంట నడుస్తూ, గాఢమైన అభివ్యక్తుల చుట్టూ తిరుగుతూ, తాత్విక చింతన వైపు నిమ్మళంగా జారిపోతుంటాం.

మొదటి కవితలోనే మనుషుల్ని పిట్ట పిల్లలుగా శ్రమ–జీవులుగా చూపి శ్రమ జీవన సౌందర్యాన్ని గౌరవింపజేస్తాడు కవి.

**చీకటి దండెం మీద వెలుతురు వస్త్రం ఆరేసినట్లు,**
**చీకట్ల మీద కాంతి అస్త్రాన్నీ**
**యుద్ధం మీద శాంతినీ,**
**సమరం బదులు సహనాన్నీ**

ప్రయోగించాలని గొప్ప సందేశమిస్తారు.

సఫలీకృతమైన తెలంగాణ కలను ఏక వాక్యంలో ఇలా చెబుతారు

**"1968 ఉద్యమ ఊరేగింపులో తగిలిన పోలీసులాఠీ దెబ్బ 2014 జూన్ 2 న నొప్పి మానింది"** అని.

పందిరి గుంజలను ముళ్ళకంపలను అల్లుకునే తీగలు ఇతరులకు పూలు కాయలిచ్చినట్లు. శత్రువులకైనా మన మూ సహాయం చేద్దామనే తాత్వికతను బోధిస్తారు.

**"జీవితంలో అధిక భాగం నేను జీవించింది అద్దె ఇంట్లోనే.**
**అద్దె ఇంట్లో ఎన్ని స్వప్నాలో**
**ఆ స్వప్నాల్లో ఒకటి సొంతిల్లు"**

అంటూ ఇంటిని అమితంగా ప్రేమిస్తారాయన "ఇల్లంటే" కవితలో.

**ఉన్న ఊరు కన్నతల్లి అనడం జగమెరిగిన నానుడి.**
**'నా ఊరు నాకు తండ్రంత ధైర్యం'** అని చెప్పుకొస్తారు కవి తన నిజామాబాద్ గురించి.

**ఎవరి తలపై వారు జండుబాంమ్ రుద్దుకుంటూనో**
**మల్లెపూల దండను సవరించుకుంటూనో వుంటారు.**
**తల ఒక ప్రత్యేక ప్రపంచం.**
**ఎవడి తలను వాడే మోయాలి.**
**ఇతరుల ప్రపంచాలను ఎక్కడ మోస్తారు?**
**అంటూ ఇతరుల గురించి ఆలోచించే తీరికే లేని**
**నేటి మనుషుల బిజీ లైఫ్** ను గురించి జాగా లేదు కవితలో చూపిస్తాడు.

**మంచితనంతో మౌనంగా ఇతరులని భరించే మెత్తని వాళ్ళు,**
**కన్నీళ్లు తుడిచి మంచిని పంచేవాళ్లు**
**ఇక్కడే ఉండాలనీ**
**ఈ భూమి ఆకాశం**
**వాళ్ల కోసమే అని**
**మంచి వాళ్ళ మనుగడను కాంక్షిస్తాడు కవి.**
**అయ్యా నా మాటినండి!**
**మీ భుజం మీది శాలువాపై నల్ల తేలుంది.**

అంటూ సభలలో మైకు పట్టుకుంటే వదలని మైకాసురుల మనోభావాల్ని సున్నితంగా గాయపరుస్తారు.

**పండుగంటే సంబరం నీకు**
**పండుగంటే మరో కొత్త గాయం నాకు.**
**అంటూ మధ్యతరగతోడి పండుగను** దృశ్యమానం చేస్తాడు కవి.

సినిమాల గురించి చెబుతూ

**'అప్పుడు సినిమాలు బాగుండేవి**
**ఇప్పుడు సినిమా హాళ్లు బాగున్నవి'**అంటూ వ్యంగ్యంగా చెప్పుకొస్తాడు కవి.

మరో కవిత "ఉత్త నాటకం" లో

**మేకల తిండి కోసం తన ఆకుల అవయవాల్ని**
**కోస్తున్నప్పుడు కూడా చెట్టు బాధపడదు.**
**కానీ తన గుండె గూట్లోని**
**పక్షిని ఎవడైనా గురి చూసి కొడుతున్నప్పుడే చెట్టు**
**గల గల చప్పుళ్ళ తో విలవిల్లాడుతుంది.**

అంటూ చలనమే లేని చెట్టుకు పక్షి పై ఉండే ప్రేమను వ్యక్తం చేస్తాడు.

**అత్యాశాపరులను చూసి**
**'దోచుకుంటూ**
**దాచుకుంటూ**
**ఎంత తిన్నా వాళ్లది పరిగడుపేనాయే.**

అని నిష్ఠురపడతాడు.

**వంట అంటే ఎలా ఉండాలో చెబుతూ కవి**
**"చూడగానే కన్ను**
**'ఆహా' అనాలి.**
**ముక్కు**
**'ఓహో' అనాలి.**
**ఆఖరున జిహ్వ**
**'వహ్వా' అనాలి."** అంటారు.


**ఓ ఉదయాన్ని చేరాలంటే**
**ఓ రాత్రిని దాటాలనీ,**
**ఓ శుక్లపక్షాన్ని చూడాలంటే**
**ఓ కృష్ణపక్షాన్ని దిగమింగాలనీ,**
**ఓ విజయాన్ని చూడాలంటే**
**ఓ అపజయాన్ని చవిచూడాలని కవి గెలుపు సూత్రాన్ని**
**దిశా నిర్దేశం చేస్తాడు** 'నజరానా' కవితలో.

**"తడిసి మోపిడైన జ్ఞాపకాల బరువుని,**
**ఎవరి భుజాల మీద మోపలేను**
**ఓ మూలన విసిరేయనూ**
**లేను"**

అంటూ జ్ఞాపకాల దొంతరను కదిలిస్తాడు.

**"ఆలికి**
**అత్తమామల మెడకి**
**తాడు అల్లు వాడే అల్లుడు"**
**అంటూ చమత్కరిస్తాడు.**
**మనమంతా ఎప్పుడో**
**చచ్చిపోయాం**
**ఇప్పుడిదంతా ఫ్లాష్ బ్యాక్**

అంటారాయన 'జీవితం' కవితలో తాత్వికంగా.




**ప్రేమ విఫలమైందనో,**
**పరీక్షలో మార్కులు తక్కువ**
**వచ్చాయనో,**
**వ్యాపారంలో నష్టం వచ్చి అప్పులపాలయ్యామనో**
**ఆత్మహత్య చేసుకునే వారిని వెక్కిరిస్తూ**
**"ఆ చావేదో దేశం కోసం సైన్యంలో చేరి వీరమరణం**
**పొందు"**
**లేదా దీన జనులకు సేవలందించు.**
**ఈ కాయం పోవుట ఖాయం**
**ఇతరుల కోసం జీవించడానికే ఈ జన్మ**

అంటారాయన.

**"నీ**
**నా**
**పుణ్యం కోసం**
**అవి తలలు బద్దలు కొట్టుకుంటున్నాయి** పాపం!"

అంటాడు రాయిని కొబ్బరికాయను చూసి చమత్కారంగా.

"ఫలతత్వం" చెబుతూ కవి జీవిత దశల్ని వివరిస్తాడు.

**"తొక్కతో సహా పండుని నమిలి ఉమ్మడం బాల్యం**
**తొక్క ఒలిచి నలుగురు నడిచే దారిలో విసిరి**
**పండు తినడం యవ్వనం.**
**తొక్కా మందు లాంటిదేనని తెలుసుకోవడం**
**వృద్ధాప్యం."**

**పూటకు తిండి లేక కష్టాలు పడ్డన్నినాళ్ళూ**
**ఉన్న కాస్త మాకే వడ్డించి**
**నువ్వు నీళ్లు తాగి పడుకునే దానివి అమ్మా.**
**ఏకాదశులన్నీ నువ్వుండి**
**ద్వాదశి భోజనాలు మాకు పెట్టే దానివి.**
**ఇప్పుడు అన్నీ ఉన్నా తినడానికి నువ్వు లేవు**
**నీకు పెట్టే తర్పణమూ నువ్వు తినవు.**
**కాకో, గోవో తినేలా ఏర్పాటు చేశావు.**
**అమ్మా నీ త్యాగానికి వందనం** అంటాడు 'తర్పణం' కవితలో కవి. బ్రాహ్మణ కుటుంబాల్లోని ఆకలినీ, అది తీర్చుకోలేని అశక్తతనీ కవి కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు ఈ కవితలో. పిండం పెట్టే అన్నం ముద్దలోని త్యాగాన్ని విప్పి చెప్పారాయన.

**'నవ్వించీ,**
**నవ్వించీ,**
**చివరకు వాడు కూడా పోయి**
**ఒకరోజు ఏడిపిస్తాడు'**

అంటాడు జోకర్ అనే కవితలో.

**'మాట సంసారి**
**మౌనం సన్యాసి'**

అంటూ మనిషి అనే నాణానికి మాట మౌనం బొమ్మ బొరుసు లాంటివి అంటారు కవి.

డాక్టర్. సి.నారాయణరెడ్డి,
అయాచితం నటేశ్వర శర్మ,
సూరారం శంకర్,
కందాళై రాఘవాచార్య,
ఆప్కారి సూర్యప్రకాష్ గార్లతో తన అనుబంధం గురించి కూడా కవిత్వీకరించాడు ఈ పుస్తకంలో చందర్ రావు గారు.

ఇంకా

**"చెంబెడు నీళ్లతో రంగు కడిగేసుకున్నాక ముఖాలన్నీ ఒక్కటే"**
**"నాకైతే కవిత్వం ఒక**
**ఊతకర్రే"**
**"ఎక్కడైనా కవిత్వం చెప్పేది కళ్ళు తుడుచుకోమనే"**
**"కన్నీళ్లు తుడిచే కర్చీఫ్ కవిత్వం"**
**"రాత్రి కాసేపే ఆమె నీకు భార్య**
**మిగతా అంతా తల్లే కదా!"**
**"సామాన్యుడి దుఃఖం ఏడుపు**
**కవి దుఃఖం కవిత్వం"**

వంటి కవిత్వ పాదాలు ఈ పుస్తకం నిండా కొల్లలు.
పురా సుగంధం వెదజల్లడమే కాకుండా, పురుగు, లైఫ్, జీవకణాలు, కానుక, ఇంకొంచెం ఓర్చుకో వంటి చాలా కవితలు మోడరన్ కవిత్వ ధోరణులను కూడా ఒలకబోస్తాయి.
ఇందూరు భారతి ద్వారా ఆవిష్కరించబడిన ఈ పుస్తకం సాహితీ ప్రియులకు, కొత్తగా కవిత్వం రాస్తున్న కవులకు దిక్సూచి లాంటిది.

పుస్తకం వెల:200 రూపాయలు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ 9440038565.

# బిజినెస్

## గ్లోబల్ లాట్ కనెక్టివిటీ ప్రొవైడర్ వైర్‌పాస్‌తో జతకట్టిన హెచ్‌పిఎల్

హైదరాబాద్ : స్మార్ట్ మీటర్ విభాగంలో తన ఉనికిని బలోపేతం చేసుకోవాలని చూస్తున్న హెచ్ పిఎల్ ఎలక్ట్రిక్ & పవర్ లిమిటెడ్, అధునాతన మీటరింగ్ మౌలిక సదుపాయాలలో ఆర్ఎఫ్ మెష్ టెక్నాలజీ కోసం గ్లోబల్లాట్ కనెక్టివిటీ ప్రొవైడర్ వైర్ పాస్ తో కలిసి భారతదేశంలో మొట్టమొదటి "వైర్ పాస్ సర్టిఫైడ్ ఇన్-మీటర్ గేట్ వే"ని ప్రారంభించింది.
ఈ ఆఫర్ సాంప్రదాయ గేట్ వేలలో అడ్డంకులను తగ్గిస్తుందని మరియు పౌరులు 24/7 విద్యుత్కు సజావుగా ప్రాప్యత పొందేలా చేస్తుందని భావిస్తున్నారు.
హెచ్ పిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ రిషి సేథ్ మాట్లాగుతూ "స్మార్ట్ మీటర్ లోనే పూర్తిగా ధృవీకరించబడిన గేట్ వేను పొందుపరచడం ద్వారా, సాధారణంగా పాచీ సెల్యులార్ కవరేజ్ తో పోరాడుతున్న యుటిలిటీల కోసం మేము విస్తరణను సులభతరం చేస్తున్నాము. విశ్వసనీయ డేటా సేకరణను నిర్ధారించడంతో పాటు, ఈ విధానం యాజమాన్యం యొక్క మొత్తం ఖర్చును గణనీయంగా తగ్గిస్తుంది మరియు రోల్ అవుట్ ను సులభతరం చేస్తుంది, భారతదేశంలో ఏఎంఐ ల్యాండ్ స్కేప్‌ను సంభావ్యంగా మారుస్తుంది." అన్నారు.



## మార్చి నెలలో బ్యాంక్‌ల హాలిడేస్ లిస్ట్





2025 మార్చి నెలలో హెూలీ, ఉగాది, రంజాన్ వంటి కీలక పండుగలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. మార్చి నెలలోని 31 రోజుల్లో, 14 రోజులు బ్యాంక్ లు సెలవులో ఉంటాయి. అంటే, ఈ నెలలో దాదాపు సగం రోజులు బ్యాంక్లు పని చేయవు. మన దేశంలో, బ్యాంకులను నియంత్రించే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI), 2025 మార్చి నెల కోసం బ్యాంకు సెలవుల జాబితాను విడుదల చేసింది. RBI హాలిడేస్ క్యాలెండర్ ప్రకారం, మార్చి నెలలో దేశవ్యాప్తంగా బ్యాంక్ లు మొత్తం 14 రోజులు మూతబడతాయి.
మార్చి నెల హాలిడేస్ లిస్ట్ లో.. ప్రభుత్వ సెలవులు, ప్రాంతీయ సెలవులు, రెండో & నాలుగో శనివారాలు, అన్ని ఆదివారాలు కలిసి ఉన్నాయి. బ్యాంక్ సెలవులు అన్ని రాష్ట్రాలకు ఒకేలా ఉండవు, ప్రాంతాన్ని బట్టి సెలవులు మారతాయి. ప్రాంతీయ పండుగల సమయంలో, కేవలం ఆయా రాష్ట్రాల్లో మాత్రమే బ్యాంకులు పని చేయవు, మిగిలిన చోట్ల 'వర్కింగ్ డే'లో ఉంటాయి. మార్చి 14న హెూలీ, మార్చి 31న రంజాన్ వంటి ప్రధాన పండుగల సమయంలో చాలా రాష్ట్రాల్లో బ్యాంకులు హాలిడే తీసుకుంటాయి.
తెలుగు నూతన సంవత్సరం ప్రారంభ పండుగ 'ఉగాది', మార్చి 30న వచ్చింది. ఆ రోజు ఆదివారం కావడంతో సాధారణ సెలవులో కలిసిపోయింది.
తేదీ & రాష్ట్రం వారీగా మార్చి 2025లో బ్యాంక్ సెలవుల జాబితా:
మార్చి 02 (ఆదివారం) – వారాంతపు సెలవు, దేశవ్యాప్తంగా బ్యాంక్ లు పని చేయవు
మార్చి 07 (శుక్రవారం): చాప్చర్ కుట్ ఎ– మిజోరంలో బ్యాంకులు హాలిడే తీసుకుంటాయి, మిగిలిన రాష్ట్రాల్లో ఇది 'వర్కింగ్ డే'
మార్చి 08 (రెండో శనివారం) – వారాంతపు సెలవు, దేశవ్యాప్తంగా బ్యాంక్ లు పని చేయవు
మార్చి 09 (ఆదివారం) – వారాంతపు సెలవు, దేశవ్యాప్తంగా బ్యాంక్ లు పని చేయవు
మార్చి 13 (గురువారం): హెూలికా దహన్ & అట్టుకల్ పొంగల్ —– ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, జార?ండ్, కేరళలో బ్యాంకులకు హాలిడే
మార్చి 14 (శుక్రవారం): హెూలీ (ధులేటి/ధులండి/ధోల్ జాతర)– త్రిపుర, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, మణిపూర్, కేరళ, నాగాలాండ్ మినహా చాలా రాష్ట్రాల్లో ప్రభుత్వ సెలవు
మార్చి 15 (శనివారం): కొన్ని ఎంపిక చేసిన రాష్ట్రాల్లో హెూలీ సెలవు
మార్చి 16 (ఆదివారం) – వారాంతపు సెలవు, దేశవ్యాప్తంగా బ్యాంక్ లు పని చేయవు
మార్చి 22 (నాలుగో శనివారం): వారాంతపు సెలవు, దేశవ్యాప్తంగా బ్యాంక్లు పని చేయవు మరియు బీహార్ దివాస్
మార్చి 23 (ఆదివారం) – వారాంతపు సెలవు, దేశవ్యాప్తంగా బ్యాంక్లు పని చేయవు
మార్చి 27 (గురువారం): షబ్-ఎ-ఖాదర్ – జమ్ములో బ్యాంకులు మూతబడతాయి
మార్చి 28 (శుక్రవారం): జుమాత్-ఉల్-విదా– జమ్ము&కశ్మీర్లో బ్యాంకులు సెలవులో ఉంటాయి
మార్చి 30 (ఆదివారం) – వారాంతపు సెలవు, దేశవ్యాప్తంగా బ్యాంక్లు పని చేయవు
మార్చి 31 (సోమవారం): రంజాన్-ఈద్ (ఈద్-ఉల్-ఫితర్) (షావల్-1)/ఖుతుబ్-ఎ-రంజాన్ ఎ– మిజోరాం, హిమాచల్ ప్రదేశ్ మినహా చాలా రాష్ట్రాల్లో బ్యాంక్లకు సెలవు
బ్యాంకు సెలవుల జాబితాను ఆర్ బిఐ ప్రతి నెలా తయారు చేస్తుంది. నెగోషియబుల్ ఇన్ స్ట్రుమెంట్స్ యాక్ట్ హాలిడే, రియల్ టైమ్ గ్రాస్ సెటిల్మెంట్ హాలిడే, బ్యాంకుల క్లోజింగ్ ఆఫ్ అకౌంట్స్ అనే మూడు వర్గాల కింద ఈ సెలవులు డిక్లేర్ అవుతాయి.

## హవా చూపిస్తున్న డీప్ సీక్

### ఏడాదికి 200 మిలియన్ డాలర్లకు పైగా ఆదాయం!

చైనాకు చెందిన ఏఐ స్టార్టప్ డీప్ సీక్ ) దూకుడు కొనసాగుతోంది. వీ3, ఆర్1 మోడళ్ల విడుదలతో మొత్తం ఇండస్ట్రీనే కుదిపేస్తోంది. ఈ నేపథ్యంలోనే వీటిపై ఖర్చు, లాభాలకు సంబంధించి కీలక విషయాలను కంపెనీ వెల్లడించింది. బాగా ప్రాచుర్యం పొందుతున్న ఈ మోడళ్ల నుంచి రోజుకు వ్యయ- లాభ మార్జిన్ నిష్పత్తి 545 శాతం వరకు ఉంటుందని పేర్కొంది. అయితే వాస్తవిక ఆదాయం దీని కంటే తక్కువగా ఉండే అవకాశం ఉన్నట్లు తెలిపింది. డీప్ సీక్ వినియోగంతో వచ్చే ఆదాయం గురించి కంపెనీ కొన్ని ఆసక్తికరమైన విషయాన్ని పంచుకుంది. "ఒక హెచ్800 చిప్ను అద్దెకు తీసుకొనేందుకు గంటకు 2 డాలర్లు ఖర్చువుతుం దని అనుకుంటే.. అలా వీ3, ఆర్1 మోడళ్లకు మొత్తం రోజువారీ ఖర్చు 87,072 డాలర్లు అవుతుంది. ఇలా మోడళ్లపై సైద్ధాంతికంగా రోజువారీ ఆదాయం 5,62,027 డాలర్లు వస్తుందని అంచనా. అలా ఖర్చు- లాభ నిష్పత్తి 545 శాతంగా ఉంటుంది. ఈ లెక్కన ఏడాదికి 200 మిలియన్ డాలర్లు పైగా ఆదాయం లభిస్తుంది" అని తెలిపింది. అయితే వాస్తవంగా ఈ ఆదాయం తక్కువగా ఉంటుందని పేర్కొంది. ఆర్1 మోడల్ వెబ్, యాప్ యాక్సెస్ సేవలు ఉచితంగా అందిస్తుండటంతో మార్జిన్లపై ఆ ప్రభావం ఉంటుందని తెలిపింది. హాంగ్జౌకు చెందిన ఏఐ (AI) రీసెర్చ్ సంస్థ డీప్సీక్ లాభాల మార్జిన్లను వెల్లడించడం ఇదే మొదటిసారి. అయితే, ఈ ఏడాది మేలో మరింత సామర్థ్యంతో పనిచేసే ఆర్2 పేరుతో కొత్త వెర్షన్ను లాంచ్ చేసేందుకు ఆ సంస్థ సన్నాహాలు చేస్తోందని సమాచారం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై పెద్ద టెక్ సంస్థలు భారీ మొత్తంలో ఖర్చు చేస్తున్నాయి. లేటెస్ట్ ఏఐ మోడళ్ల తయారీ కోసం ఓపెన్ ఏఐ, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు బిలియన్ల




కొద్దీ డాలర్లు ధారపోస్తున్నాయి. అదే సమయంలో డీప్ సీక్ మాత్రం కేవలం 6 మిలియన్ డాలర్లతో లేటెస్ట్ ఏఐ మోడల్ను రూపొందించి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఇది తీసుకొచ్చిన ఆర్1, వీ3 మోడళ్లతో నడిచే వెబ్ లు, చాట్ బాట్ లు తీసుకొచ్చిన కొద్ది రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా ప్రజాదరణ పొందాయి.
దాని డీప్సీక్- వి3 మోడల్ కు శిక్షణ ఇచ్చేందుకు తక్కువ సామర్థ్యం గల ఎన్విడియా హెచ్800 చిప్ లను ఉపయోగించినట్లు పేర్కొంది. అయితే, ఈ ఆర్1 ఏఐ మోడల్ పూర్తిగా ఉచితం కావడంతో ఒక్కసారిగా విశేష ఆదరణను సొంతం చేసుకుంది. ఈ ఎఫెక్ట్‌తో అమెరికా స్టాక్ మార్కెట్ లోని టెక్ షేర్లు నష్టపోయిన విషయం తెలిసిందే.

## నాలుగేళ్ల కనిష్ట స్థాయికి జీడీపీ

భారతదేశ ఆర్థిక వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) మూడవ త్రైమాసికం అంటే 2024 సంవత్సరం అక్టోబర్%-%డిసెంబర్ కాలానికి కూడా బలహీన ధోరణినే కనిబర్చింది. దేశ జీడీపీ వృద్ధి రేటు ఆశించిన స్థాయి కంటే తక్కువగా నమోదైంది. ఈ త్రైమాసికానికి 6.2 శాతం వృద్ధి రేటు నమోదైంది. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో నమోదైన 5.6 శాతం (సవరణకు ముందు 5.4 శాతం) నుంచి డిసెంబర్ త్రైమాసికంలో 6.2 శాతానికి పెరిగినప్పటికీ.. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి అంటే (2023-24) మూడవ త్రైమాసికంలో నమోదైన 9.5 శాతం రేటుతో పోలిస్తే గణనీయంగా తగ్గిపోయింది. అంతేకాకుండా, ఈ వృద్ధి రేటు ఆర్బీఐ అంచనా వేసిన 6.8 శాతం కంటే చాలా తక్కువగా ఉంది. మైనింగ్, తయారీ రంగాల పనితీరు బలహీనంగా ఉండడం కారణంగానే వృద్ధి రేటు తగ్గడానికి ముఖ్య కారణం. పట్టణ వినియోగం కూడా బలహీనంగానే కొనసాగింది. అయితే అనూహ్యంగా వ్యవసాయ రంగం పటిష్ట పనితీరు కనబర్చింది. దీనికి తోడు ప్రభుత్వం మూలధన వ్యయాలను పెంచడం, వర్షాలు కూడా బాగా పడడం కారణంగా పండుగల సీజన్ లో గ్రామీణ వినియోగం పెరగడం ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చాయి. డిసెంబర్ త్రైమాసిక జీడీపీ గణాంకాలను జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ ఎస్ వో- నేషనల్ స్టాటిస్టిక్స్) శుక్రవారం విడుదల చేసింది.

**నాలుగేళ్ల కనిష్ట స్థాయికి జీడీపీ..**

2024-25 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ 6.5 శాతం వృద్ధిని (స్థిర కరెన్సీలో రూ.188 లక్షల కోట్లు) సాధిస్తుందని ఎన్ఎస్వో తన ద్వితీయ ముందస్తు అంచనాల్లో పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో వేసిన తొలి ముందస్తు అంచనాల్లో ఇది 6.4 శాతంగా ఉండడం గమనార్హం. అయినప్పటికీ, ఇది నాలుగేళ్ల కనిష్ట వృద్ధి కానుంది. క్రితం ఆర్థిక సంవత్సరం 9.2 శాతం కంటే తక్కువగా ఉంది. ఎన్ఎస్వో తాజా అంచనాల ప్రకారం, జీడీపీ 6.5 శాతానికి చేరుకోవాలంటే చివరి త్రైమాసికంలో ఆర్థిక వ్యవస్థ మరింత మెరుగైన పనితీరు చూపించాల్సి ఉంటుంది.

**రంగాల వారీగా వృద్ధి చూస్తే..**

స్థూల విలువ జోడింపు (జీవీఏ) డిసెంబర్ త్రైమాసికంలో 6.2 శాతంగా నమోదైంది. అంతకుముందు త్రైమాసికంలో ఇది 5.6 శాతంగా ఉంది.
వ్యవసాయ రంగం ఆరు త్రైమాసికాల గరిష్ట స్థాయికి పుంజుకున్నది. డిసెంబర్ త్రైమాసికంలో ఇది 5.6 శాతం వృద్ధిని చూపించింది. అంతకుముందు త్రైమాసికంలో (జూలై-సెప్టెంబర్) ఇది 4.1 శాతంగా ఉండగా, క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో 1.5 శాతం మాత్రమే నమోదైంది.
తయారీ రంగంలో వృద్ధి సెప్టెంబర్ త్రైమాసికంలో 2.1 శాతం నుంచి డిసెంబర్ త్రైమాసికంలో 3.5 శాతానికి పెరిగింది. అయినప్పటికీ, క్రితం ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో ఇది 14 శాతం వృద్ధి రేటుతో పోల్చితే చాలా తక్కువ.
మైనింగ్లో వృద్ధి 1.4%కి పడిపోయింది. క్రితం ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో ఇది 4.7%గా ఉంది.
సేవల రంగం వృద్ధి రేటు మూడవ త్రైమాసికంలో 7.4 శాతానికి మెరుగుపడింది. క్రితం ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో ఇది 8.3 శాతం కావడం గమనార్హం.

**అధిక ఆదాయ దేశంగా మారాలంటే 7.8 శాతం వృద్ధి అవసరం**




ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం, 2047 నాటికి భారత్ అధిక ఆదాయ ఆర్థిక వ్యవస్థగా మారాలంటే సగటున 7.8 శాతం వార్షిక వృద్ధి రేటు అవసరం. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఆర్థిక రంగంతో పాటు భూమి, కార్మిక విభాగాల్లో సంస్కరణలు తప్పనిసరి. 2000 నుంచి 2024 మధ్య భారత్ సగటున 6.3% వృద్ధి సాధించింది. భవిష్యత్ లక్ష్యాలను సాధించడానికి అవసరమైన బలమైన పునాదులు ఇప్పటికే వేసినట్లు నివేదిక తెలిపింది. స్థూల తలసరి ఆదాయం ప్రస్తుత స్థాయి నుంచి దాదాపు 8 రెట్లు పెరగాల్సి ఉంటుందని హెచ్చరించింది.
అంతర్జాతీయ తయారీ హబ్గా భారత్ను మార్చేందుకు ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టింది. మౌలిక సదుపాయాలు, మానవ వనరుల మెరుగుదల, డిజిటలీకరణలు మరియు ఆర్థిక స్థిరత్వానికి ప్రాధాన్యత ఇవ్వడం దీనికి ఉదాహరణలు. చిలీ, కొరియా, పోలండ్ వంటి దేశాలు అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఏకీకృతం కావడం ద్వారా అధిక ఆదాయ దేశాలుగా ఎదిగాయి. భారత్ కూడా వారి నుండి పాఠాలు నేర్చుకోవాలి.
2000 నుంచి ఇప్పటివరకు భారత ఆర్థిక వ్యవస్థ దాదాపు 4 రెట్లు పెరిగింది. తలసరి ఆదాయం మూడింతలైంది. 2000లో అంతర్జాతీయ జీడీపీలో భారత వాటా 1.6% కాగా, 2023లో 3.4%కి చేరింది. భారత్ ప్రపంచంలోనే అయిదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. పేదరికం గణనీయంగా తగ్గగా, సేవల రంగం మరియు మౌలిక సదుపాయాలు విస్తరించాయి. 2047కు భారత్ భారీ లక్ష్యాలను నిర్దేశించుకుంది.

## ప్రణీత్ గ్రూప్ నుంచి ట్రిపులెక్స్ విల్లా ప్రాజెక్ట్



హైదరాబాద్ : నాణ్యత మరియు విశ్వాసానికి ప్రసిద్ధి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ ప్రణీత్ గ్రూప్ మరో అద్భుతమైన ప్రాజెక్టు ను ఆవిష్కరించింది. రంగారెడ్డి జిల్లాలోని తుక్కుగూడలో లగ్జరీ విల్లా ప్రాజెక్ట్ ప్రణీత్ ప్రణవ్ రెడ్‌ఫెర్న్ స్క్వేర్ ప్రాజెక్టు భూమి పూజ ఆదివారం నిర్వహించింది. రూ.వెయ్యి కోట్ల విలువైన ఈ లగ్జరీ ప్రాజెక్టు నివాసితులకు సాటిలేని విలాసం మరియు సౌకర్యాన్ని అందిస్తానని వాగ్దానం చేస్తుంది. ప్రణీత్ ప్రణవ్ రెడ్‌ఫెర్న్ స్క్వేర్ సమకాలీన నిర్మాణ శైలి మరియు ప్రశాంతమైన సహజ పరిసరాల యొక్క సామరస్య సమ్మేళనాన్ని అందించే ఖచ్చితంగా రూపొందించిన విల్లాలను కలిగి ఉంటుంది.
30 ఎకరాలలో విస్తరించి ఉన్న రెడ్ ఫెర్న్ స్క్వేర్ 350ం ఖచ్చితంగా రూపొందించిన విల్లాలను కలిగి ఉంటుంది, ఒక్కొక్కటి 180 నుండి 350 చదరపు గజాల వరకు ప్లాట్ పరిమాణాలను అందిస్తుంది. చదరపు అడుగు ధర రూ.8,000 వసతులకు అదనం. ఆధునిక సౌకర్యాలు మరియు విశాలమైన జీవనానికి ప్రాధాన్యతనిస్తూ ఈ ప్రాజెక్ట్ సాటిలేని సౌకర్యం మరియు అధునాతన జీవనశైలిని వాగ్దానం చేస్తుంది.
"అసాధారణమైన జీవన ప్రదేశాలను సృష్టించాలనే మా దృష్టిని ప్రతిబింబించే ప్రణీత్ ప్రణవ్ రెడ్ ఫెర్న్ స్క్వేర్ ను పరిచయం చేయడానికి మేము సంతోషిస్తున్నాము" అని ప్రణీత్ గ్రూప్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ నరేంద్ర కుమార్ కామరాజు అన్నారు. "విలాసం, సౌకర్యం మరియు సౌలభ్యం యొక్క పరిపూర్ణ సమ్మేళనాన్ని కోరుకునే వివేచనాత్మక గృహ యజమానిని దృష్టిలో ఉంచుకుని ఈ ట్రిపుల్ఎ విల్లాలు రూపొందించబడ్డాయి." అన్నారు.

## రూ.2,000 నోట్లు పై ఆర్ బిఐ ఓపెన్ ఆఫర్..



2వేల కరెన్సీ నోటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉపసంహరించుకుని దాదాపు 20 నెలలపైనే అయింది. చలామణిలో ఉన్నవాటిలో 98.18 శాతం నోట్లు తిరిగి బ్యాంకులకు చేరాయి. అయినా ఇంకా 6వేల 400 కోట్ల విలువైన 2వేల రూపాయల నోట్లు ప్రజల చేతుల్లోనే ఉన్నాయి. స్వయంగా రిజర్వు బ్యాంకాఫ్ ఇండియానే చెప్పిందీ విషయాన్ని. 2వేల నోటును ఉపసంహరించుకుంటున్నట్లు 2023 మే 19న ఆర్బీఐ ప్రకటించింది. ఆ నిర్ణయం వెలువడే నాటికి 3లక్షల 56 వేల కోట్ల విలువైన నోట్లు చలామణిలో ఉన్నాయి.
2వేల రూపాయల నోట్లను తొలుత బ్యాంకుల్లో మార్చుకునేందుకు, డిపాజిట్ చేసేందుకు 2023 సెప్టెంబరు 30దాకా ప్రజలకు అవకాశం ఇచ్చారు. తర్వాత ఆ గడువును మరోవారం పొడిగించారు. ఆ తర్వాత నుంచి రద్దయిన 2వేల రూపాయల నోట్లను ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో మాత్రమే స్వీకరిస్తున్నారు. అలా ఈ ఏడాది ఫిబ్రవరి 28దాకా 98.18 శాతం నోట్లు బ్యాంకులను చేరినట్లు ఆర్బీఐ వెల్లడించింది. అవగాహన లేక అనుకోడానికి లేదు. అఫీషియల్గా చూపించేందుకు ఇష్టపడనివారు కొందరు ఉండుండొచ్చు. అందుకే ఇంకా కొంతమేర 2వేల నోట్లు బ్యాంకులకు తిరిగిరాలేదని భావిస్తున్నారు.
ఇప్పటికీ ఆర్ బిఐ ప్రాంతీయ కార్యాలయాలలో నోట్ల మార్పిడి, డిపాజిట్కి అవకాశముందంటోంది రిజర్వ్బ్యాంక్. రీజనల్ ఆఫీసులకు చేరుకోలేనివారు పోస్టల్ డిపార్ట్మెంట్ ద్వారా ఆయా కార్యాలయాలకు పంపొచ్చు. దేశంలో హైదరాబాద్ సహా 18చోట్ల ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి. రద్దయినా 2వేల నోట్లుచిత్తు కాగితాలేం కావు. అధికారికంగా మార్చుకునే ఆఫర్ని ఓపెన్గా ఉంచింది ఆర్బీఐ.

## ఈ వారం రానున్న ఐపీఓలు




ఐపీఓల వీక్ మళ్లీ రానే వచ్చేసింది. ఈసారి మార్చి 3 నుంచి ప్రారంభమయ్యే వారంలో పలు కంపెనీల్లో పెట్టుబడులు చేసేందుకు ఛాన్సుంది. అయితే ఈసారి మాత్రం ఒక కొత్త పబ్లిక్ ఇష్యూ మాత్రమే అందుబాటులో ఉంది. దీంతోపాటు గతవారం మొదలైన IPOలలో కూడా పెట్టుబడులు చేసేందుకు అవకాశం ఉంది. మరోవైపు కొత్త వారంలో 4 కంపెనీలు స్టాక్ మార్కెట్లో లిస్ట్ కానున్నాయి. ఆ విశేషాలేంటో ఇక్కడ తెలుసుకుందాం.

**మార్చి 3 తర్వాత కొత్తగా వస్తున్న ఐపీఓ**

NAPS గ్లోబల్ ఇండియా ఐపీఓ: వస్త్ర దిగుమతిదారు అయిన నాప్స్ గ్లోబల్ ఇండియా రూ. 11.88 కోట్ల ఐపీఓ మార్చి 4న ప్రారంభం కానుంది. దీని ముగింపు మార్చి 6న ఉంటుంది. బిడ్డింగ్ ధర ఒక్కో షేరుకు రూ. 90 కాగా, లాట్ సైజు 1600. ఈ IPO ముగిసిన తర్వాత షేర్లు మార్చి 11న బిఎస్ఈ ఎంఎస్ఈ లో లిస్ట్ కానున్నాయి.

**ఇప్పటికే మొదలైన ఐపిఓ:**

బాలాజీ ఫాస్ఫేట్స్ ఐపిఓ : రూ. 50.11 కోట్ల ఈ ఇష్యూ ఫిబ్రవరి 28న ప్రారంభమైంది. మార్చి 4న ముగియనుంది. ఒక్కో షేరుకు రూ. 66-70 ధర ఉండగా, లాట్ సైజు 2000. ఈ షేర్లు మార్చి 7న ఎన్ఎస్ఈ ఎంఎస్ఈ లో లిస్ట్ కానుంది.

**లిస్టింగ్ కానున్న కంపెనీలు:** బీజాసన్ ఎక్స్ప్లోటెక్ షేర్లు మార్చి 3న కొత్త వారంలో BSE SMEలో లిస్ట్ కానున్నాయి. ఆ తరువాత న్యూక్లియస్ ఆఫీస్ సొల్యూషన్స్ మార్చి 4న బిఎస్ఈ ఎంఎస్ఈ జాబితా చేయబడుతుంది. శ్రీనాథ్ పేపర్ షేర్లు మార్చి 5న BSE SMEలో లిస్ట్ కావచ్చు. బాలాజీ ఫాస్ఫేట్స్ ఐపిఓ మార్చి 7న ఎన్ఎస్ఈ ఎంఎస్ఈ లో లిస్ట్ కానుంది.

**గతంతో పోలిస్తే.. :**

అయితే గతంతో పోలిస్తే ఈసారి మాత్రం స్టాక్ మార్కెట్లో ఐపీఓల సందడి తగ్గిందని చెప్పవచ్చు. ఇదివరకు వారంలో మూడు నుంచి నాలుగు కంపెనీలు ఐపీఓకు వచ్చే ఛాన్స్ ఉండగా, ఈసారి మాత్రం భారీగా తగ్గిపోయింది. కేవలం ఒక కంపెనీ మాత్రమే కొత్తగా ఐపీఓకు సిద్ధమైంది. గత కొన్ని రోజులుగా స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా నష్టాలను ఎదుర్కొంటున్నాయి. దీంతో కొత్త కంపెనీలు సైతం ఐపీఓకు వచ్చేందుకు వెనుకాడుతున్నట్లు తెలుస్తోంది.

**లక్షల కోట్ల నష్టం..:**

అంతేకాదు గత కొన్ని వారాల్లో స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయిన వేళ మదుపర్లు భారీగా నష్టపోయారు. ఈ క్రమంలో కొన్ని వారాల వ్యవధిలోనే 10 లక్షల కోట్ల రూపాయలు నష్టపోయారని పలు నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే వారంలో స్టాక్ మార్కెట్లు ఎలా ఉంటాయనే దానిపై మదుపర్లు ఆసక్తిగా ఉన్నారు. మరోవైపు ట్రేడింగ్ నిపుణులు సైతం మదపర్లు మార్కెట్ తీరును బట్టి నిర్ణయం తీసుకోవాలని చెబుతున్నారు.

## మళ్లీ తగ్గిన బంగారం ధరలు



గోల్డ్ కొనుగోలు చేసేవారికి ఇది గుడ్ న్యూస్ అనే చెప్పాలి. వరుసగా గత కొద్ది రోజుల నుంచి గోల్డ్ రేట్స్ దిగొచ్చాయి. ఈ నాలుగు రోజుల నుంచి చూస్తే సుమారు రూ.1500 వరకు తగ్గింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా బంగారం ధరలు చూస్తే.. 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.79,400 ఉంది. 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.86,620 వద్ద కొనసాగుతోంది. గాకా గోల్డ్ రేట్స్ భారీగా తగ్గడంతో ఈ ప్రభావం మార్కెట్లపై పడింది. ఈ నేపథ్యంలో వరుసగా నాలుగు, ఐదు రోజుల నుంచి పసిడి ధరలకు కాస్త బ్రేక్ పడింది. ప్రస్తుతం ఔన్స్ గోల్డ్ $29 డాలర్లు తగ్గి $2,867 డాలర్లగా ఉంది. గత మూడు నెలల్లో బంగారం ఈవారం తొలిసారిగా భారీగా తగ్గింది. ఒక దశలో రికార్డు స్థాయిలో ఈ వారం గోల్డ్ $2956 డాలర్లు దాటింది. అయితే ఆ తర్వాత పసిడి ఒక్కసారిగా ప్రాఫిట్ బుకింగ్ కు గురయ్యింది. ట్రంప్ తీసుకున్న కీలక నిర్ణయాలు గోల్డ్ శాపంగా మారుతున్నాయి. తాజాగా ట్రంప్తో ఉక్రెయిన్ ప్రెసిడెంట్ జెలన్స్కీ చర్చలు కొలిక్కి రాకపోవడం.. రాబోయే పరిణామాలను ఇన్వెస్టర్లు జాగ్రత్తగా గమనిస్తున్నారు. అమెరికా టారిఫ్ అమలుతో గోల్డ్పై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

**ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో పరిశీలిద్దాం..**

ఢిల్లీలో గోల్డ్ రేట్స్ చూస్తే.. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.79,500కి చేరుకుంది. 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.86, 770 వద్ద ట్రేడింగ్లో ఉంది.

**చెన్నైలో గోల్డ్ రేట్స్ చూస్తే..**

22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.79,400 వద్ద కొనసాగుతోంది. 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.86,620 పలుకుతోంది. బెంగళూరులో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.79,400 ఉండగా.. 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.86, 620కి చేరుకుంది. ముంబైలో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.79,400 వద్ద కొనసాగుతోంది. 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.86, 620 ట్రేడ్ అవుతోంది.
కేరళ, కోల్కత్తాలో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.79,400 వద్ద ట్రేడింగ్లో ఉంది. 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.86, 620 ఉంది.

**తెలుగు రాష్ట్రాల్లో పసిడి ధరలు ఇలా**

హైదరాబాద్, తెలంగాణలో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.79,400 వద్ద కొనసాగుతోంది. 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.86, 620 వద్ద ట్రేడింగ్లో ఉంది. విజయవాడలో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.79,400 ఉంది. 24 క్యారెట్ల తులం బంగా రం ధర రూ.86, 620 వద్ద కొనసాగుతోంది. వైజాగ్లో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.79,400 వద్ద కొనసాగుతోంది. 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.86, 620 పలుకుతోంది.

**వెండి ధరలు పరిశీలిస్తే..**

గోల్డ్ రేట్స్ మాదిరిగా వెండి ధరలు కూడా స్థిరంగా కొనసాగుతున్నాయి. నేడు హైదరబాద్, వైజాగ్, చెన్నై, కేరళలో కిలో వెండి ధర రూ.1,05,000 కి చేరుకుంది. బెంగళూరు, కోల్కత్తా, ఢిల్లీ, ముంబైలో కిలో వెండి ధర రూ.97,000 వద్ద కొనసాగుతోంది.

## గృహ రుణాల వడ్డీ రేట్లు తగ్గాయ్

గత నెల 7న జరిగిన ద్రవ్య పరపతి విధాన సమీక్షలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక రెపో వడ్డీ రేటు తగ్గించింది. అప్పటి వరకు 6.5 శాతంగా ఉన్న ఈ వడ్డీ రేటును 6.25 శాతానికి కుదించారు. దీంతో అనేక బ్యాంకులు తమ రెపో ఆధారిత గృహ రుణాల వడ్డీ రేట్లనూ పావు శాతం వరకు కుదించాయి. ఈ తగ్గింపుతో చాలా మంది రుణ గ్రహీతలు హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నారు. అయితే చాలా మంది ప్రస్తుతం ఒక సందిగ్ధంలో ఉన్నారు. తగ్గిన వడ్డీ రేట్లకు అనుగుణంగా ఈఎంఐల మొత్తం తగ్గించుకోవాలా? లేక అదే ఈఎంఐలు చెల్లిస్తే రుణ చెల్లింపు కాలపరిమితి తగ్గించుకోవాలా? అనే సందేహంలో ఉన్నారు. పెద్దగా ఆర్థిక ఇబ్బందులు లేని గృహ రుణ గ్రహీతలు అదే ఈఎంఐలతో రుణ చెల్లింపు గడువు తగ్గించుకోవడమే మంచిదని నిపుణుల సూచన. గత నెల 26వ తేదీ నాటికి వివిధ బ్యాంకులు రూ.75 లక్షలకు మించిన రెపో ఆధారిత గృహ రుణాలపై వసూలు చేస్తున్న వడ్డీ రేట్లు ఇలా ఉన్నాయి. ఆ వివరాలు మీ కోసం..

**ప్రభుత్వ రంగ బ్యాంకులు వడ్డీరేటు (%)**

ఎస్ బీఐ 8.25-9.40
బీఓబీ 8.40-10.65
యూబీఐ 8.10-10.65
పీఎన్ బీ 8.15-9.90
బ్యాంక్ ఆఫ్ ఇండియా 8.30-10.85
కెనరా బ్యాంక్ 8.15-10.90
యూకో బ్యాంక్ 8.30 నుంచి
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 8.10-10.90
పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ 8.35-9.85
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ 8.15-10.75
ఇండియన్ బ్యాంక్ 8.15-9.55

**ప్రైవేట్ బ్యాంకులు**

హెచ్ డీఎఫ్ సీ బ్యాంక్ 8.7 నుంచి




ఐసీఐసీఐ బ్యాంక్ 8.75 నుంచి
యాక్సిస్ బ్యాంక్ 8.75-9.65
కోటక్ మహీంద్రా బ్యాంక్ 8.75 నుంచి
హెచ్ ఎస్బీసీ బ్యాంక్ 8.5 నుంచి
సౌత్ ఇండియన్ బ్యాంక్ 8.5 నుంచి
కరూర్ వైశ్యా బ్యాంక్ 8.79-9.44
ఫెడరల్ బ్యాంక్ 8.55 నుంచి
ధనలక్ష్మి బ్యాంక్ 8.75 నుంచి
టీఎంబీ 8.60-9.95
బంధన్ బ్యాంక్ 9.16-13.33
ఆర్ బీ ఎల్ బ్యాంక్ 9 నుంచి
సీ ఎస్ బీ బ్యాంక్ 10.24-12.09
సిటీ యూనియన్ బ్యాంక్ 10.15-14.05

## గత వారం భారీ నష్టాలను చవి చూసిన 10 కంపెనీలు

గత వారం స్టాక్ మార్కెట్ విధ్వంసం ప్రభావం దేశంలోని ప్రముఖ కంపెనీల డేటాలో స్పష్టంగా కనిపిస్తుంది. దేశంలోని టాప్ 10 కంపెనీలలో 8 కంపెనీల మార్కెట్ క్యాప్ నుండి రూ.3 లక్షల కోట్లకు పైగా తుడిచిపెట్టుకుపోయింది. దేశంలోనే అతిపెద్ద ఐటీ కంపెనీ టీసీఎస్ అతిపెద్ద నష్టాన్ని చవిచూసింది. గత వారం రోజుల్లో టీసీఎస్ లక్ష కోట్ల రూపాయలకు పైగా నష్టాన్ని చవిచూసింది. ఇన్ఫోసిస్, భారతి ఎయిర్టెల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా భారీ నష్టాలను చవిచూశాయి. మరోవైపు దేశంలో మార్కెట్ క్యాప్ పెరిగిన కంపెనీలు కేవలం రెండు మాత్రమే ఉన్నాయి. హెచ్డీఎఫ్సీ బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ. 30 వేల కోట్లకు పైగా పెరిగింది. మరోవైపు, బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ క్యాప్ రూ.9 వేల కోట్లకు పైగా పెరిగింది. గత వారం బిఎస్ఇ బెంచ్మార్క్ గేజ్ సెన్సెక్స్ 2,112.96 పాయింట్లు లేదా 2.80 శాతం పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 671.2 పాయింట్లు లేదా 2.94 శాతం పడిపోయింది.
ఫిబ్రవరిలోనే నిఫ్టీ 1,383.7 పాయింట్లు (5.88 శాతం) పడిపోయింది. సెన్సెక్స్ 4,302.47 పాయింట్లు (5.55 శాతం) పడిపోయింది. గత వారం టాప్ 10 అత్యంత విలువైన కంపెనీలలో ఎనిమిది కంపెనీల మార్కెట్ విలువ రూ.3,09,244.57 కోట్లు తగ్గింది. ఏ కంపెనీ మార్కెట్ క్యాప్ ఎంత అనేది కూడా తెలుసుకుందాం.

**దేశంలోని అగ్రశ్రేణి కంపెనీల మార్కెట్ క్యాప్ ఎంత?**

దేశంలోనే అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ మార్కెట్ విలువ రూ.1,09,211.97 కోట్లు తగ్గి రూ.12,60,505.51 కోట్లకు చేరుకుంది.
దేశంలోని అతిపెద్ద ఐటీ కంపెనీలలో ఒకటైన ఇన్ఫోసిస్ విలువ రూ.52,697.93 కోట్లు తగ్గి రూ.7,01,002.22 కోట్లకు చేరుకుంది.
దేశంలోని అతిపెద్ద టెలికాం కంపెనీలలో ఒకటైన భారతీ ఎయిర్టెల్ మార్కెట్ విలువ రూ.39,230.1 కోట్లు తగ్గి రూ.8,94,993.67 కోట్లకు చేరుకుంది.
దేశంలోనే అతిపెద్ద కంపెనీ అయిన రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.38,025.97 కోట్లు తగ్గి రూ.16,23,343.45 కోట్లకు చేరుకుంది. దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విలువ రూ.29,718.99 కోట్లు తగ్గి రూ.6,14,236.97 కోట్లకు చేరుకుంది. దేశంలో రెండవ అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ (ఎంక్యాప్) రూ.20,775.78 కోట్లు తగ్గి రూ.8,49,803.90 కోట్లకు చేరుకుంది. దేశంలోనే అతిపెద్ద ఎఫ్ఎంసిజి కంపెనీ హిందూస్తాన్ యూనిలీవర్ మార్కెట్ క్యాప్ రూ.11,700.97 కోట్లు తగ్గి రూ.5,14,983.41 కోట్లకు చేరుకుంది. దేశంలోని అతిపెద్ద ఎఫ్ ఎంబిసి కంపెనీలలో ఒకటైన ఐటిసి వాల్యుయేషన్ రూ.7,882.86 కోట్లు తగ్గి రూ.4,93,867.57 కోట్లకు చేరుకుంది. దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రుణదాత హెచ్డిఎఫ్సి బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.30,258.49 కోట్లు పెరిగి రూ.13,24,411.31 కోట్లకు చేరుకుంది. దేశంలోని అతిపెద్ద ఫైనాన్స్ కంపెనీలలో ఒకటైన బజాజ్ ఫైనాన్స్ రూ.9,050.24 కోట్లు జోడించి, దాని విలువను రూ.5,29,516.99 కోట్లకు పెంచింది.

## గాజాకు వెళ్లే మానవతా సాయాన్ని అడ్డుకుంటున్నాం

### కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన నేపథ్యంలో ఇజ్రాయెల్ కీలక ప్రకటన

తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఇజ్రాయెల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, దీనికి హమాస్ నిరాకరించింది.
దీంతో గాజా కు అందే మానవతాసాయాన్ని తాము అడ్డుకుంటామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ విషయాన్ని ఆ దేశ ప్రధాని కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించింది.
'తొలి దశ ఒప్పందం ముగియడంతో దాన్ని కొనసాగించే ప్రతిపాదనను మేము అంగీకరించాం. కానీ, హమాస్ నిరాకరించింది.
ఈ నేపథ్యంలోనే నేటి ఉదయం నుంచి గాజాలోకి వెళ్లే అన్ని వస్తువుల సరఫరాలను నిలిపివేయాలని ప్రధాని నెతన్యాహు నిర్ణయించుకున్నారు. మా బందీలను విడుదల చేయకుండా పూర్తిస్థాయి కాల్పుల విరమణకు అంగీకరించేది లేదు.
ఈ ప్రతిపాదనకు అంగీకరించకపోతే ఆ సంస్థ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని ఆ ప్రకటనలో హెచ్చరించింది.

**రంజాన్ వేళ.. ఇజ్రాయెల్- హమాస్ మధ్య మరో ఒప్పందం**

ఇటీవల ఈజిప్టు, ఖతార్ దేశాల మధ్యవర్తిత్వంలో ఇజ్రాయెల్-హమాస్ ల మధ్య తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఇది శనివారంతో ముగిసింది. ఈ క్రమంలోనే రంజాన్ సందర్భంగా తొలి దశ ఒప్పందాన్ని ఏప్రిల్ 20 వరకు పొడిగించాలని అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కోఫ్ ప్రతిపాదించారు.
ఇందులో భాగంగా హమాస్ తమ ఆధీనంలోని పలువురు బందీలను విడుదల చేయాల్సి ఉంటుందని ఇజ్రాయెల్ తెలిపింది. దీనికి హమాస్ నిరాకరించింది.
ఈ క్రమంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. దీనిపై హమాస్ స్పందించాల్సి ఉంది. ఇదిలా ఉండగా.. రెండో దశ కాల్పుల విరమణకు సంబంధించిన చర్చలు కైరోలో కొనసాగుతున్నాయి.



# ప్రధాని మోడీ రంజాన్ శుభాకాంక్షలు

న్యూఢిల్లీః రంజాన్ మాసం ఆదివారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.
'పవిత్ర రంజాన్ మాసం మన సమాజంలో శాంతి సామరస్యాలను తీసుకురావాలని' ప్రధాని మోదీ ఆకాంక్షించారు. 'ఈ పవిత్ర మాసం.. కృతజ్ఞత, భక్తిప్రపత్తులను సూచిస్తుంది.
కరుణ, దయ, సేవలకున్న విలువలను మనకు గుర్తు చేస్తుంది' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.
ఇస్లాంలో రంజాన్ మాసానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ నెలలో ముస్లిం సోదరులు ఉపవాసం ఉంటూ భగవంతుడిని ఆరాధిస్తారు. ఇస్లాంలోని ఐదు స్తంభాలలో రంజాన్ను ఒకటిగా పరిగణిస్తారు.
ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ అవతరణ కూడా ఈ నెలలో ఒక రోజు రాత్రి వేళ జరిగిందని చెబుతారు. రంజాన్ ముగిసిన తర్వాత, ముస్లిం సోదరులు ఈద్-ఉల్-ఫితర్ పండుగను జరుపుకుంటారు. ముస్లింలు ఈ నెలను ఆరాధన మాసంగా భావిస్తారు.
ముస్లిం సోదరులకు పలువురు ప్రముఖులు, రాజకీయ నేతలు, విశిష్ట వ్యక్తులు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసాన్ని ఆరంభించుకుంటుండగా, భారతదేశంలోని రాజకీయ నాయకులు ముస్లిం సోదరులకు తమ ప్రత్యేక సందేశాలను అందజేశారు.

**శుభాకాంక్షలు తెలిపిన నేతలు**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, ఇతర ప్రముఖులు 'ఎక్స్' (మాజీగా ట్విట్టర్) వేదికగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

**చంద్రబాబు నాయుడు:**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రంజాన్ ప్రారంభం సందర్భంగా ట్వీట్ చేశారు. నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలతో చేసే ప్రార్థనలు ఫలించాలని, అల్లా దయతో అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నాను. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు. అంటూ ఆయన తెలిపారు.

**వైఎస్ జగన్ మోహన్ రెడ్డి:**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉపవాస దీక్షలు చేస్తున్న అందరికీ అల్లా దీవెనలు మెండుగా ఉండాలని, రంజాన్ మాసం శాంతి, ఐక్యత, దైవభక్తిని పెంపొందించేలా ఉండాలని కోరుకుంటున్నాను. అని ట్వీట్ చేశారు.




**నారా లోకేశ్:**

రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా రంజాన్ చాంద్ ముబారక్ అంటూ నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు.
"నెలవంక కనిపించడంతో పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైంది. ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనం, తరావీ నమాజ్ భక్తి శ్రద్ధలతో చేపట్టే ముస్లిం సోదర సోదరీమణులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు." అని అన్నారు.

## తన మేనల్లుడుని పార్టీ పదవుల నుంచి తప్పించిన మాయావతి!



M బహుజన సమాజ్ పార్టీ చీఫ్ మయావతి సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన మేనల్లుడు, బీఎస్పీ జాతీయ సమన్వయకర్త అయిన ఆకాశ్ ఆనంద్ను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. గతంలో ఇదే ఆకాశ్ ఆనంద్ను తన రాజకీయ వారసుడిగా మాయావతి ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ, తాజాగా ఆమె తీసుకున్న నిర్ణయం ఆ పార్టీతో పాటు దేశ రాజకీయాల్లో కూడా చర్చనీయాంశంగా మారింది. ఆదివారం లక్నోలో జరిగిన అఖిల భారత పార్టీ సమావేశంలో బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి మాట్లాడుతూ.. తాను బతికి ఉన్నంత వరకు పార్టీలో తన వారసుడు ఎవరూ ఉండరని ప్రకటించారు. అలాగే తన మేనల్లుడు ఆకాష్ ఆనంద్ను బీఎస్పీ జాతీయ సమన్వయకర్త పదవి నుంచి తప్పిస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ ఎంపీ, ఆకాష్ ఆనంద్ మామ అయిన అశోక్ సిద్ధార్థ్ను పార్టీ నుంచి బహిష్కరించిన కొద్ది రోజులకే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆకాష్ ఆనంద్ రాజకీయ జీవితాన్ని అతని మామ ప్రభావితం చేశారని, అతను ఇప్పటికీ తన కుమార్తె, ఆకాష్ ఆనంద్ భార్య ప్రగ్య ద్వారా అతనిపై ప్రభావం చూపుతున్నాడని ఆమె పేర్కొన్నారు. ఆకాశ్ ఆనంద్ను తొలగించి ఆ స్థానంలో.. రాజ్యసభ ఎంపీ రాంజీ గౌతమ్ను బీఎస్పీ జాతీయ సమన్వయకర్తగా తిరిగి నియమించారు, ఆయన 2019 వరకు ఆ పదవిలో కొనసాగిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు మాయావతి తమ్ముడు ఆనంద్ కుమార్ కూడా పార్టీ జాతీయ సమన్వయకర్తగా నియమితులయ్యారు. ఈ నిర్ణయాన్ని కూడా మాయావతి ప్రకటించారు. ఆకాష్ ఆనంద్ ను తన బాధ్యతల నుండి తొలగించడం ఇది రెండోసారి. మొదటి సారి గత ఏడాది మేలో, లోక్సభ ఎన్నికల సమయంలో తొలగిస్తే, ఇప్పుడు మరోసారి తప్పించారు. మాయావతి మాట్లాడుతూ.. ఉత్తరప్రదేశ్ బహుజన సమాజం అభివృద్ధి, రాష్ట్ర పురోగతికే కాకుండా మొత్తం దేశ పురోగతికి అవసరమని మాయావతి నొక్కిచెప్పారు. బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతి వేడుకల ప్రణాళికలను కూడా ఆమె వివరించారు. కాన్షీరామ్ సూత్రాల గురించి మాట్లాడుతూ, కుటుంబ సభ్యులు పార్టీలో పనిచేయడాన్ని ఆయన ఎప్పుడూ వ్యతిరేకించలేదని, పార్టీకి లేదా ఉద్యమానికి హాని కలిగించడానికి వారిలో ఎవరైనా తన పేరును దుర్వినియోగం చేస్తే, వారిని వెంటనే తొలగిస్తానని ఆయన స్పష్టంగా చెప్పారని పేర్కొన్నారు. అశోక్ సిద్ధార్థ్ పార్టీలోనే విభజనకు కారణమయ్యారని, బీఎస్పీ సంస్థాగత బలాన్ని బలహీనపరిచే వర్గాలను సృష్టించారని మాయావతి ఆరోపించారు. ఇక ఆకాష్ ఆనంద్ పై అతని మామ ప్రభావం చూపే అవకాశం ఉన్నందున, అతని తొలగింపు తప్పనిసరి చర్య అని ఆమె వివరించింది. పార్టీ నాయకత్వాన్ని స్థిరీకరించడానికి, బీఎస్పీ జాతీయ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న ఆనంద్ కుమార్ ఇప్పుడు జాతీయ సమన్వయకర్త పాత్రను కూడా చేపడతారని మాయావతి ప్రకటించారు. అదనంగా, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడానికి రాజ్యసభ ఎంపీ రాంజీ గౌతమ్ను జాతీయ సమన్వయకర్తగా నియమించారు. పార్టీ వ్యవహారాలను నిర్వహించడంలో ఆనంద్ కుమార్ సామర్థ్యంపై మాయావతి విశ్వాసం వ్యక్తం చేశారు, ఆయన తనను ఎప్పుడూ నిరాశపరచలేదని, బీఎస్పీ లక్ష్యానికి విధేయుడిగా ఉన్నారని అన్నారు.

## నా కుమార్తెకు పోకిరీల వేధింపులు

### కేంద్ర మంత్రి రక్షా ఖడ్సే ఆందోళన



ముంబై : మహారాష్ట్రలో శాంతిభద్రతలపై కేంద్ర యువజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రక్షా ఖడ్సే ఆందోళన వ్యక్తం చేశారు. జల్గావ్ జిల్లా ముక్తాయ్నగర్లో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న తన కుమార్తెను కొందరు యువకులు వేధించారని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి తాజాగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.
"మహాశివరాత్రి సందర్భంగా మా ప్రాంతంలో ఏటా సంత్ ముక్తాయ్ యాత్ర నిర్వహిస్తారు. ఇటీవల నిర్వహించిన స్నేహితులతో కలిసి ఆ యాత్రకు వెళ్తానని నా కుమార్తె కోరడంతో సెక్యూరిటీ సాయంతో అక్కడకు పంపించాను. ఆ సమయంలో కొందరు యువకులు వారిని వెంబడించి వేధించారు. అడ్డుకున్న భద్రతా సిబ్బందిపైనా దురుసుగా ప్రవర్తించారు. గుజరాత్ పర్యటన నుంచి నేను ఇంటికి రాగానే మా అమ్మాయి ఈ విషయం చెప్పింది. ఓ ఎంపీ లేదా కేంద్ర మంత్రి కుమార్తెకే ఇటువంటి దుస్థితి ఎదురైతే.. సాధారణ మహిళలు పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఈ ఘటనపై పోలీస్ స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేశా" అని కేంద్ర మంత్రి ఖడ్సే మీడియాకు వెల్లడించారు.
ఇదే అంశంపై రక్షా ఖడ్సే మామ, మాజీ మంత్రి ఏక్నాథ్ ఖడ్సే మాట్లాడుతూ.. "ఈ యువకులపై గతంలోనూ పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయి. ఈ అబ్బాయిలు కరుడుగట్టిన నేరస్థులు. మహారాష్ట్రలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి. నేరస్థులు పోలీసులకు భయపడటం లేదు. బాధిత అమ్మాయిలు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. వారి తల్లిదండ్రులు కూడా తమ కుమార్తెల పేర్లు బయటకు రావద్దని భావిస్తున్నారు. మాకు ప్రత్యామ్నాయం లేకనే ఫిర్యాదు చేశాం" అన్నారు.
"పోలీస్ స్టేషన్కు వెళితే రెండు గంటలు మమ్మల్ని కూర్చోబెట్టారు. అమ్మాయిల విషయం కావడంతో పునరాలోచించుకోవాలని పోలీసులు మాకు చెప్పారు. యువకులు పోలీసులపైనా దాడి చేసిన సందర్భాలున్నాయి. వాళ్లు ఎంతగా తెగిస్తారో వీటిని బట్టి ఊహించుకోవచ్చు. వీళ్లకు రాజకీయ నాయకుల అండ ఉంది. ఇదే విషయంలో డీఎస్పీ, ఐజీతోనూ మాట్లాడాను" అని ఖడ్సే ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ ఘటనపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. నిందుతులు ఓ రాజకీయ పార్టీకి చెందినవాళ్లని, అందులో కొందర్ని పోలీసులు అరెస్టు చేశారని చెప్పారు.
వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తాజా పరిణామంపై కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కాల్ మాట్లాడుతూ.. మహాయుతి ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మండిపడ్డారు.

# అక్రమ వలసలు గణనీయంగా తగ్గాయి

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన



తాను తీసుకున్న చర్యల వల్లే అమెరికా-మెక్సికో సరిహద్దుల్లో అక్రమ వలసలు భారీగా తగ్గినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. అక్రమ వలసదారులను ఆయన ఆదేశాల మేరకు ప్రత్యేక విమానాల్లో వారి స్వదేశాలకు తిరిగి పంపిన విషయం తెలిసిందే. తాను విధించిన కఠినమైన ఇమిగ్రేషన్ విధానాలతో ఫిబ్రవరిలో అక్రమ వలసల సంఖ్య చరిత్రలోనే అతి తక్కువ స్థాయికి చేరాయని ట్రంప్ వెల్లడించారు. ఇంతటితో అమెరికాపై అక్రమ వలసదారుల దండయాత్ర ముగిసిందని అభివర్ణించారు.
ఫిబ్రవరిలో కేవలం 8,326 మంది అక్రమ వలసదారులు మాత్రమే దేశ సరిహద్దుల్లో పట్టుబడ్డారని ట్రంప్ పేర్కొన్నారు. జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో ప్రతినెలా దేశంలోకి మూడు లక్షలమంది అక్రమంగా ప్రవేశించేవారని గుర్తు చేశారు.
ఈ గణాంకాలకు సంబంధించి సీబీపీ విడుదల చేసిన నివేదికలను ఉటంకించారు.
దాదాపు 95 శాతం వలసలు తగ్గినట్లు వెల్లడించారు. తన పాలనలో ఎవరైనా చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించాలని ప్రయత్నిస్తే పెద్ద మొత్తంలో జరిమానాలు, తక్షణ బహిష్కరణను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.
ట్రంప్ ప్రకటనను పలు వార్తా సంస్థలు తప్పుబట్టాయి. ఆయన చూపిన గణాంకాలు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయని దుయ్యబట్టాయి. అమెరికా కస్టమ్స్, బోర్డర్ ప్రొటెక్షన్ విడుదల చేసిన డేటాను ఫాక్స్ న్యూస్ పంచుకుంది.
బైడెన్ అధికారంలో ఉన్న చివరి వారంలో దాదాపు 20,086 మంది అక్రమ వలసదారులను గుర్తించినట్లు పేర్కొంది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన మొదటి వారంలో 7,287 మంది పట్టుబడ్డారని వెల్లడించింది. అయితే అధ్యక్షుడు పేర్కొన్నట్లు ఈ సంఖ్యలో గణనీయమైన తగ్గుదల అనటం నిజం కాదని.. కేవలం 65శాతం మాత్రమే తగ్గాయని తెలియజేసింది.
రెండోసారి అమెరికా పగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపారు. కఠిన నిర్ణయాలతో వారిని దేశం నుంచి సాగనంపే ప్రక్రియను వేగవంతం చేశారు. దీంతో అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోంది.
ఇందులో భాగంగా అక్రమంగా వలస వెళ్లిన కొందరు భారతీయుల్ని సైనిక విమానాల్లో వెనక్కి పంపించారు.
భారత్ కూడా ఆ చర్యలకు మద్దతు పలికింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఎందుకంటే అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని స్పష్టం చేసింది.

# కుంభమేళాకు మోహన్ భాగవత్ ఎందుకు వెళ్లలేదు

- శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ప్రశ్న
- ప్రతిపక్షాలు కుంభమేళాకు వెళ్లలేదని అధికార పక్షం ఆరోపణల
- ఈ క్రమంలోనే ఈ అంశాన్ని లేవనెత్తిన శివసేన

ముంబయి: రాజకీయ నేతలు కుంభమేళా (లో పాల్గొనడంపై శివసేన(శిందే), శివసేన (యూబీటీ) నేతల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాను హిందువునని..ఆ ధర్మాలు పాటిస్తానని చెప్పుకునే శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే (కుంభమేళాకు మాత్రం వెళ్లలేదని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్నాథ్ శిందే చేసిన వ్యాఖ్యలను రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ తిప్పి కొట్టారు. భాజపాకి చెందిన నాయకులు అందరూ కుంభమేళాకు వెళ్లినట్లు ఆధారాలు ఉన్నాయా..? అని మండిపడ్డారు.
హిందూ ధర్మ పరిరక్షణ గురించి ప్రజలకు బోధనలు చేసే ఆర్ఎస్ఎస్ చీఫ్ డాక్టర్ మోహన్ భాగవత్ త్రివేణి సంగమంలో ఎందుకు పుణ్యస్నానం చేయలేదని ప్రశ్నించారు. "ప్రధాని నరేంద్ర మోదీ పవిత్ర స్నానం చేస్తున్న ఫొటోలను చూశాను. కానీ, ఆయన పీఎం కాకముందు కుంభమేళాకు వెళ్లినట్లు మాత్రం ఆధారాలు లేవు.
ప్రస్తుతం నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో కూడా ఆర్ఎస్ఎస్ ముఖ్యులైన మోహన్ భాగవత్, కేశవ్ బలిరామ్ హెడ్గేవార్, గురు గోల్వాల్కర్, బాలాసాహెబ్ దేవరాస్ వంటివారు పవిత్ర స్నానం ఆచరించినట్లు ఎటువంటి ఫొటోలు బయటకు రాలేదు" అని సంజయ్ రౌత్ అన్నారు. తమ పార్టీ నేతలు నకిలీ హిందుత్వ పబ్లిసిటీలను నమ్మరని పేర్కొన్నారు.

**దిల్లీ తొక్కిసలాటలో..**




ఇటీవల మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్నాథ్ శిందే మాట్లాడుతూ.."కొందరు నేతలు వారు హిందువులని చెప్పుకుంటుంటారు. కానీ, పవిత్ర ఆధ్యాత్మిక కార్యక్రమైన కుంభమేళాను దాటవేశారు" అని అన్నారు.
కేంద్రమంత్రి రాందాస్ ఆఠవలే సైతం ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఉద్ధవ్ ఠాక్రే మహాకుంభమేళా ను సందర్శించకుండా హిందూ సమాజాన్ని అవమానపరిచారన్నారు. అందుకుగాను హిందూ ఓటర్లు వారిని బహిష్కరించాలని.. ఎన్నికల్లో ఆ పార్టీలకు ఓట్లు వేయొద్దని అన్నారు. తరచూ సమావేశాల్లో హిందుత్వం గురించి మాట్లాడే ఠాక్రే ఈ విధంగా ప్రవర్తించడం సరైన చర్య కాదని మండిపడ్డారు.

# జాబిల్లిపై బ్లూ ఘోస్ట్..

### చందమామపై అడుగుపెట్టిన ప్రైవేటు ల్యాండర్

### ఫైర్ ఫ్లై ఏరోస్పేస్ సంస్థ ప్రయోగం విజయవంతం



వాషింగ్టన్: అమెరికాలోని టెక్సాస్ కు చెందిన ఫైర్ఫ్లై ఏరోస్పేస్ చరిత్ర సృష్టించింది. ఈ సంస్థ ప్రయోగించిన 'బ్లూ ఘోస్ట్ (Blue Ghost)' అనే వ్యోమనౌక జాబిల్లి ఉపరితలంపై విజయవంతంగా ల్యాండ్ అయ్యింది. ఫైర్ ఫ్లైకు చెందిన మిషన్ కంట్రోల్ ఈ విషయాన్ని నిర్ధరించింది. 'చంద్రుడిపై ఉన్నాం. ల్యాండర్ స్థిరమైన స్థితిలో ఉంది' అని ప్రకటించింది. తద్వారా చందమామపై కూలిపోకుండా, పడిపోకుండా.. సరైన స్థితిలో వ్యోమనౌకను ల్యాండ్ చేసిన తొలి ప్రైవేటు సంస్థగా నిలిచింది. ఫ్లోరిడాలోని కెనడీ అంతరిక్ష కేంద్రం నుంచి జనవరి 15న స్పేస్ ఎక్స్ సంస్థకు చెందిన ఫాల్కన్-9 రాకెట్.. బ్లూ ఘోస్ట్తోపాటు జపాన్కు చెందిన మరో ల్యాండర్ 'హకుటో-ఆర్2'ను నింగిలోకి తీసుకెళ్లింది. బ్లూ ఘోస్ట్ ల్యాండర్ పొడవు రెండు మీటర్లు. ఇది జాబిల్లి కక్ష్య నుంచి ఆటోపైలట్ మోడ్లో కిందికి ప్రయాణిస్తూ.. ఈశాన్య అంచున ఉన్న మోన్స్ లాట్రెయిల్ సమీపంలో దిగింది. తొలి ఫొటోను పంపించింది. అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా)కు సంబంధించిన 10 ప్రయోగాలను నిర్వహించనుంది. చందమామ ధూళిని సేకరించేందుకు వాక్యూమ్ వినియోగం, చంద్రుడి ఉపరితలం కింద ఉష్ణోగ్రతలను కొలవడానికి డ్రిల్లింగ్ చేయడం, వ్యోమగాముల స్పేస్ సూట్లు, పరికరాలకు అంటుకునే హానికరమైన ధూళిని తొలగించే మరో పరికరాన్ని పరీక్షించడం తదితరాలు ఇందులో ఉన్నాయి. టెక్సాస్కు చెందిన 'ఇన్ ట్యూయిటివ్ మెషీన్స్' సంస్థ ప్రయోగించిన ల్యాండర్ కూడా గురువారం జాబిల్లిపై దిగేందుకు సిద్ధంగా ఉంది. దక్షిణ ధ్రువానికి 160 కిలోమీటర్ల దూరంలో దీన్ని దించేందుకు శాస్త్రవేత్తలు సన్నాహాలు చేస్తున్నారు.

# బీజేపీ జాతీయాధ్యక్ష పదవి దక్కేదెవరికి

- మహిళ పేరు పరిశీలించాలని డిమాండ్లు
- చారిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును మనతో ఆరంభిద్దామంటున్న మహిళా లోకం
- కొత్త జాతీయాధ్యక్షుడి ప్రకటన వచ్చే వారం రానుందని సమాచారం
- ఇప్పటికే అన్ని రాష్ట్రాలలో పూర్తయిన అంతర్గత ఎన్నికలు
- దక్షిణాది వారికి ఇవ్వాలని ఊపందుకుంటున్న డిమాండ్



న్యూఢిల్లీః బీజేపీ ఇప్పటి వరకు రాష్ట్రపతి, ముఖ్యమంత్రి, లోక్సభ స్పీకర్ సహా మరెన్నో పదవులను మహిళలకు కట్టబెట్టినప్పటికీ, ఆ పార్టీ జాతీయాధ్యక్ష పదవిలో ఇప్పటి వరకు ఒక్క మహిళ కూడా లేదు. చారిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ చేసిన కమలనాథులు.. అధ్యక్ష పదవిని సైతం మహిళ చేతిలో పెట్టి జనాభాలో సగం ఉన్న మహిళల మనసు గెలుచుకునే ప్రయత్నాలు చేయవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భారతీయ జనతా పార్టీ కొత్త జాతీయాధ్యక్షుడి ప్రకటన మరో వారం, పది రోజుల్లో రానుంది. పార్టీ నియమావళి ప్రకారం జాతీయాధ్యక్షుడి ఎన్నిక జరగాలంటే దేశంలోని కనీసం సగం రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ పూర్తి కావాలి. అయితే రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు జాప్యం కావడం, వివిధ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో బీజేపీ జాతీయాధ్యక్షుడి ఎన్నిక ఆలస్యమవుతూ వచ్చింది. ఇప్పటి వరకు దేశంలోని 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అంతర్గత ఎన్నికలు పూర్తయ్యాయి. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల యూనిట్లు కలుపుకుంటే మొత్తం 36. ఇందులో సగం పూర్తి కావాలంటే.. మరో 6 రాష్ట్రాల్లో పార్టీ రాష్ట్ర అధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. అప్పుడే జాతీయాధ్యక్షుడి ఎన్నిక చేపట్టేందుకు మార్గం సుగమమవుతుంది. ఈ మేరకు ఆ 6 రాష్ట్రాల్లో అధ్యక్ష ఎన్నికల కసరత్తు తీవ్రతరమైంది. తదుపరి అసెంబ్లీ ఎన్నికలు జరుపుకోనున్న రాష్ట్రాలైన తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, గుజరాత్ సహా రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఈ జాబితాలో ఉన్నట్టు తెలిసింది. వీటిలో బిహార్లో ఈ ఏడాది చివర్లోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, అధ్యక్ష మార్పు ఉండకపోవచ్చని, ప్రస్తుత అధ్యక్షుడికే కొనసాగింపు ఇవ్వవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మరోవైపు జాతీయాధ్యక్షుడిగా ఎవరిని ఎంపిక చేస్తారన్న విషయంపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఎవరూ ఊహించని నేతలను తెరపైకి తెస్తూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్న బీజేపీ అగ్ర నాయకత్వం ఈసారి జాతీయాధ్యక్షుడి విషయంలోనూ అలాగే వ్యవహరించవచ్చని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. మార్చి 15 తర్వాత మంచి రోజులు లేవు కాబట్టి ఈలోగానే కొత్త అధ్యక్షుడి ప్రకటన ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**పేరు ప్రతిపాదించండి- రాష్ట్రాలకు ఆదేశం:**

ఇదిలా ఉంటే.. జాతీయాధ్యక్షుడి కోసం పేర్లను ప్రతిపాదించాల్సిందిగా రాష్ట్ర యూనిట్లకు బీజేపీ కేంద్ర నాయకత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత బీజేపీ జాతీయాధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా (జేపీ నడ్డా) పదవీకాలం పూర్తయినప్పటికీ, ఆయనకు తాత్కాలికంగా పదవీకాలాన్ని పొడిగిస్తూ.. కొత్త అధ్యక్షుడి ఎన్నిక జరిగే వరకు అధ్యక్ష బాధ్యతల్లో కొనసాగే వెసులుబాటు కల్పించిన విషయం తెలిసిందే. బీజేపీ జాతీయాధ్యక్షుడిగా జేపీ నడ్డా 2019లోనే పగ్గాలు చేపట్టినప్పటికీ... 2020లో ఆయన ఎన్నికకు అధికారిక ముద్ర పడింది. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆయన పదవీకాలాన్ని 2024 జులై వరకు పొడిగించారు. మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత జేపీ నడ్డాను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలను అప్పగించారు. ఆ వెంటనే జాతీయాధ్యక్షుడి ఎన్నిక నిర్వహించి కొత్తవారికి బాధ్యతలు అప్పగించాల్సి ఉన్నప్పటికీ.. హర్యానా, జార?ండ్, మహారాష్ట్ర, జమ్ము-కాశ్మీర్, ఢిల్లీ రాష్ట్రాల్లో వరసగా అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో తాత్కాలికంగా వాయిదా వేస్తూ వచ్చారు. ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు కూడా ముగిసిన నేపథ్యంలో.. అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ వేగవంతమైంది.

**పరిశీలనలో వివిధ సమీకరణాలు :**

కీలక పదవులను అప్పగించే విషయంలో ఏ రాజకీయ పార్టీ అయినా సామాజిక, ప్రాంతీయ, మత, లింగ సమీకరణాలను పరిశీలిస్తుంది. తద్వారా ఆయా వర్గాలకు ప్రాధాన్యత కల్పించినట్టు సందేశాన్ని పంపిస్తూ.. ఎన్నికల సమయంలో లబ్ధి పొందాలని చూస్తుంది. ఇప్పుడు బీజేపీ జాతీయాధ్యక్షుడి ఎన్నిక విషయంలోనూ పార్టీ అగ్రనాయకత్వం వివిధ సమీకరణాలను బేరీజు వేసుకుంటోంది. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తర్వాత దక్షిణాది రాష్ట్రాల నుంచి అధ్యక్ష బాధ్యతలను ఎవరూ చేపట్టలేదు. 2002-2004 మధ్యకాలంలో వెంకయ్య నాయుడు బీజేపీ జాతీయాధ్యక్షుడిగా పనిచేయగా, ఆయన కంటే ముందు జానా కృష్ణమూర్తి 2001-2002 మధ్యకాలంలో, బంగారు లక్ష్మణ్ 2000-2001 మధ్యకాలంలో ఈ పదవిని అందుకున్న దక్షిణ భారతీయులుగా రికార్డుల్లో ఉన్నారు. హిందీ మాట్లాడే రాష్ట్రాలతో పాటు మరికొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ విస్తరించి, బలంగా పాతుకుపోయినప్పటికీ.. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక మినహా మరెక్కడా ఆ పార్టీకి అధికారం దక్కలేదు. లోక్సభ ఎన్నికల్లో మాత్రం తెలంగాణ నుంచి కూడా ప్రాతినిధ్యం కనిపిస్తున్నప్పటికీ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇంకా తృతీయస్థానంలోనే ఉంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పార్టీ విస్తరణ అనుకున్నట్టుగా ముందుకు సాగడం లేదు. దీంతో దక్షిణాది ప్రజల భావోద్వేగాలను పసిగట్టి, అందుకు తగ్గ వ్యూహాలతో ముందుకెళ్లాలంటే దక్షిణాదికి చెందిన నేతకే అప్పగిస్తే ఫలితం ఉంటుందని అగ్రనాయకత్వం భావిస్తున్నట్టు తెలిసింది.
ఈ క్రమంలో దక్షిణాది రాష్ట్రాల నుంచి రేసులో ఎవరున్నారన్నది పరిశీలిస్తే.. బీజేపీ సంస్థాగత వ్యవహారాల జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ దక్షిణాదిన కర్ణాటకకు చెందినవారే. ఆయన జాతీయస్థాయిలో అధ్యక్షుడి తర్వాత అత్యంత ప్రాధాన్యత కల్గిన పదవిలో పనిచేస్తున్నారు. దేశవ్యాప్తంగా లోతైన అవగాహన ఉంది. పైపెచ్చు బీజేపీ సైద్ధాంతిక మాతృసంస్థ "రాష్ట్రీయ స్వయం సేవక్ (RSS) నుంచి వచ్చారు. కాబట్టి ఆయన పేరును పరిశీలించవచ్చని కొన్ని కథనాలు వినిపిస్తున్నాయి. అలాగే బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయాధ్యక్షుడిగా ఉన్న డా. కే. లక్ష్మణ్ (తెలంగాణ), మహిళా మోర్చా జాతీయాధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ (తమిళనాడు)కూడా దక్షిణాదికి చెందినవారే. పైగా బీజేపీ అనుబంధ విభాగాలకు జాతీయాధ్యక్షులుగా పనిచేస్తున్నందున వారికి జాతీయస్థాయి రాజకీయాలపై అవగాహన ఇప్పటికే ఉంది. వీరిలో వనతి శ్రీనివాసన్ మహిళ కావడంతో ఆ సమీకరణాల్లోనూ ఆమెకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. బీజేపీ ఇప్పటి వరకు రాష్ట్రపతి, ముఖ్యమంత్రి, లోక్సభ స్పీకర్ సహా మరెన్నో పదవులను మహిళలకు కట్టబెట్టినప్పటికీ, ఆ పార్టీ జాతీయాధ్యక్ష పదవిలో ఇప్పటి వరకు ఒక్క మహిళ కూడా లేదు.
చారిత్రాత్మక మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ చేసిన కమలనాథులు.. అధ్యక్ష పదవిని సైతం మహిళ చేతిలో పెట్టి జనాభాలో సగం ఉన్న మహిళల మనసు గెలుచుకునే ప్రయత్నాలు చేయవచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జాతీయాధ్యక్షుడి రేసులో వీరితో పాటు దక్షిణాది రాష్ట్రాల నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి (తెలంగాణ), ప్రహ్లాద్ జోషి (కర్ణాటక) పేర్లు కూడా వినిపించాయి. అయితే ఇద్దరూ అనాసక్తి ప్రదర్శించినట్టు తెలిసింది. ఇక ఉత్తరాది రాష్ట్రాల నుంచి భూపేంద్ర యాదవ్, శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్ ఖట్టర్ వంటి నేతల పేర్లు రేసులో వినిపిస్తున్నాయి. అలాగే రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలిచినప్పటికీ.. ముఖ్యమంత్రి పదవికి దూరమైన మాజీ సీఎం వసుంధర రాజే పేరు సైతం అధ్యక్ష పదవి రేసులో వినిపిస్తోంది. పార్టీలో ప్రధాన కార్యదర్శిగా ఉన్న సునీల్ బన్సల్, మహారాష్ట్ర బీజేపీ నేత వినోద్ తావ్డే లు సైతం రేసులో ఉన్నారు.

సూర్య
హైదరాబాద్
సోమవారం
3 మార్చి 2025





## ఎస్ఎల్‌బీసీ ప్రమాదాన్ని రాజకీయం చేయడం తగదు

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఎట్టి పరిస్థితుల్లో ఈ ఎస్ఎల్బీసీ టన్నెల్ ఆపరేషన్ కొనసాగాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రమాదాన్ని రాజకీయం చేయడం తగదని ప్రతిపక్షాలకు ఆయన హితవు పలికారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు ఈ ప్రాజెక్టును పక్కన పెట్టిందని గుర్తు చేశారు. ఈ పనులు చేపట్టిన సంస్థకు గత ప్రభుత్వం.. బిల్లులు సైతం చెల్లించ లేదన్నారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ తరహా ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఘటన కేస్ స్టడీగా తీసుకోవాలన్నారు. ఈ ఘటన ఓ విపత్తు ఓ ప్రమాదమని ఆయన అభివర్ణించారు. ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాద ఘటనను ఆయన పరిశీలించారు. ఆ క్రమంలో టన్నెల్లోకి సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారు. సహాయక చర్యలపై ఉన్నతాధికారులను ఆయన ఆరా తీశారు. అలాగే సహాయక చర్యలపై అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఎట్టి పరిస్థితుల్లో ఈ ఆపరేషన్ కొనసాగాలన్నారు. ఎస్ఎల్బీసీ ప్రమాదాన్ని రాజకీయం చేయడం తగదని ప్రతిపక్షాలను ఆయన హితవు పలికారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు ఈ ప్రాజెక్టును పక్కన పెట్టిందని గుర్తు చేశారు. అంతేకాదు.. ఈ పనులు చేపట్టిన సంస్థకు గత ప్రభుత్వం.. బిల్లులు సైతం చెల్లించలేదని తెలిపారు. పనులు చేస్తున్న సంస్థ బిల్లులు చెల్లించలేదని.. దీంతో విద్యుత్ సరఫరా కూడా ఆపేశారన్నారు. అలాగే బోరింగ్ మిషన్కు విడిభాగాలు కూడా సమకూర్చలేదని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. పనులు జరుగుతోండగా.. అనుకోకుండా జరిగిన ప్రమాదం ఇదని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. టన్నెల్లో బాధితులను రక్షించే పని కొలిక్కిరావడానికి మరో 2, 3 రోజులు పడుతుందన్నారు. కన్వేయర్ బెల్ట్ పని చేయక పోవడంతో.. మట్టి తరలించడం ఇబ్బందిగా మారిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీశైలం పవర్ ప్లాంట్లో అగ్ని ప్రమాదం సంభవించిందని.. ఈ ప్రమాదంలో ఆరుగురు మరణించారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఆ సమయంలో తాను పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నానని.. అయితే ఈ ప్రమాద ఘటన స్థలికి వెళ్తామంటే నాటి ప్రభుత్వం అనుమతించ లేదన్నారు.

## శాస్త్ర, సాంకేతిక రంగాల్లో

# భారత్ గ్లోబల్ హీరో

● ఐఐటిలలో బ్యాక్ బెంచ్‌లే ఉంటాయి,బ్యాక్ బేచేర్‌లు ఉండరు ● ఐఐటి విద్యార్థులు, టీచింగ్ సిబ్బంది నాకు అతిథులు ● సృజనాత్మకత, ఆవిష్కరణలే భారత్ పెట్టుబడి ● శాస్త్ర, సాంకేతిక రంగాలె భారత్ ను శాసిస్తున్నాయి ● అర్థవంతమైన పరిశోధనలకు మూలం ఐఐటీ లు ● కృత్రిమ మేధా (ఏఐ)నూతన శకానికి నాంది, ఒక నూతన విప్లవం ● విద్యార్థులు భారత దేశ వారసత్వాన్ని అభివృద్ధి చేయాలి ● విమర్శలకు లోను కావొద్దు... విమర్శను ఆదర్శంగా తీసుకోవాలి ● ఉప రాష్ట్రపతి జగదీష్ దన్కర్




సంగారెడ్డి, మేజర్ న్యూస్ ప్రతినిధి: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్ గ్లోబల్ హీరోఐఐటిలలో బ్యాక్ బెంచ్ లె ఉంటాయి,బ్యాక్ బేచేర్ లు ఉండరు.ఐఐటి విద్యార్థులు, టీచింగ్ సిబ్బంది నాకు అతిథులు.ఉప రాష్ట్రపతి జగదీష్ దన్ఖర్ అన్నారు. ఆదివారం నాడు సంగారెడ్డి నియోజకవర్గం కంది మండలంలోని హైదరాబాద్ ఐఐటి నీ ఉపరాష్ట్రపతి జగదీప్ దన్కర్, సుదేశ్ దన్కర్ సందర్శించారు. సాంకేతిక విద్య ప్రగతి గురించి విద్యార్థులు అధ్యాపకులతో ముచ్చటించారు. ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ..మిమల్ని పార్లమెంట్ కు ఆహ్వానిస్తున్నానని సృజనాత్మకత, ఆవిష్కరణలె భారత్ పెట్టుబడి.శాస్త్ర, సాంకేతిక రంగాలె భారత్ ను శాసిస్తున్నాయి.అర్థవంతమైన పరిశోధనలకు మూలం ఐఐటీ లుకృత్రిమ మేధా (ఏఐ)నూతన శకానికి నాంది, ఒక నూతన విప్లవం.విద్యార్థులు భారత దేశ వారసత్వాన్ని అభివృద్ధి చేయాలి. అని అన్నారు.విద్యార్థులు భారత దేశ వారసత్వాన్ని అభివృద్ధి చేయాలి.ప్రశ్నలు అడగడం ,ప్రశ్నలకు సమాధానాలు వెతకడం విద్యార్థులు నేర్చుకోవాలి.విలువలతో కూడిన విద్య అవసరం.విద్యార్థులు ఆలోచన శక్తి ని పెంచుకోవాలి, మానవత్వాన్ని అలవరుచుకోవాలి.ఈ ఐఐటి లో 5000 మంది విద్యార్థులకు,600 మంది టీచింగ్ సిబ్బందికి ప్రపంచాన్ని మార్చే శక్తి ఉంది.టెక్నాలజీని గ్రామీణ ప్రాంతాలకు చేరావేయాలి-- గ్రామీణ ప్రాంతాలనుంచి అందుకోవాలి.విద్యార్థి జీవితం లో మార్పు ముఖ్యం , స్థిర లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి.చంద్రయాన్ -2 ,3 సమయం లో భారత్ ఎన్నో సవాళ్లు ఎదుర్కొని విజయవంతం చేశాం. విద్యార్థుల పెట్టుబడి సృజనాత్మకత,ఆవిష్కరణలు.వ్యాపార, పారిశ్రామిక వేత్తలు ఎదగాలి.భారత్ వివిధ భాషల నిలయం,పార్లమెంటు లో అన్ని భాషలు ట్రాన్స్లేట్ అవుతున్నాయి.సోషల్ మీడియా చాలా శక్తి వంతంగా తయారు అయింది.బ్యాంకింగ్ ,డిజిటల్ ఇండియా సేవలో దేశం ముందుకు పోతుంది.విమర్శలకు లోను కావొద్దు.విమర్శను ఆదర్శంగా తీసుకోవాలి. అని నూతన ఆవిష్కరణలు, పరిశోధనలు దేశ అభివృద్ధికి తోడ్పడాలని ఉపరాష్ట్రపతి పిలువునిచ్చారు. ఆవిష్కరణలు, పరిశోధనలపై, ఆర్థిక వ్యవస్థ పలు అంశాలను విద్యార్థులతో ఉపరాష్ట్రపతి పంచుకున్నారు. విభిన్న భాషలు, సంస్కృతల నేపధ్యం భారతదేశం..5 వేల సంవత్సరాల పూర్వం నుంచి భారతదేశం మేదో పరంగా ఉన్నతంగా ఉందన్నారు. ఐఐటీల శాస్త్రయ పరిశోధనలతో 20 కోట్ల మంది రైతులకు నేరుగా బ్యాంకుల్లో .ప్రోత్సాహం పొందుతున్నారని అన్నారు. పరిశోధనలు, ఆవిష్కరణలతో డిజిటల్ మార్కెటింగ్ అభివృద్ధి చెందిందన్నారు. విద్యార్థులు సృజనాత్మకతపై దృష్టి సారించాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం ఒక గ్లోబల్ లీడర్ గా ఎదగాలన్నారు. విద్యార్థులు ఐఐటీ ల విద్యార్థులు, అధ్యాపకులు తనకు అతిథులని.పార్లమెంటును సందర్శించాలని కోరారు. చంద్రయాన్ తొలిదశలో విఫలమైనప్పటికీ.. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని విజయవంతం చేశామన్నారు. ఐఐటీ విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారవేత్తలుగా రాణించాలన్నారు.ఐఐటి ని సందర్శించడం ఆనందంగా ఉందన్నారు .గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఐఐటీ చైర్మన్ బివి మోహన్ రెడ్డి, ఐఐటి డైరెక్టర్ బీ ఎస్ మూర్తి, పార్లమెంటు సభ్యుడు.. ఎం రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి కేసీఆర్ గతే పడుతుంది

● కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి పై సీఎం రేవంత్ విమర్శలు హద్దు మీరుతున్నాయి
● ఇకనైనా జాగ్రత్తగా ఉండాలి ● బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్ వి సుభాష్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన విమర్శలు హద్దు మీరే విధంగా ఉన్నాయని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వి సుభాష్ ఆరోపించారు. ఆదివారం హైదరాబాదులో విడుదల చేసిన ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం వనపర్తి బహిరంగ సభలో మాట్లాడిన విధానం ఆయన వ్యక్తిత్వాన్ని తగ్గించుకొని ప్రధానంగా ముఖ్యమంత్రి పీఠాన్ని అవమానించేలా ఉందన్నారు.కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి గా ఉన్న జి కిషన్ రెడ్డి ని వ్యక్తిగతంగా ఏకవచనంతో మాట్లాడడం దూషించడం తెలంగాణ సమాజానికి ముఖ్యమంత్రి హోదాలో శ్రీ రేవంత్ రెడ్డి మాట్లాడడం అసహజమైనదన్నారు. ప్రోటోకాల్ పద్ధతి ప్రకారం కేంద్ర ప్రభుత్వం వద్దకు వెళ్లనప్పుడు మర్యాదపూర్వకంగా కేంద్ర మంత్రిని రాష్ట్ర ముఖ్యమంత్రి కలిసి రాష్ట్ర సమస్యలపై వివరిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాల్సి ఉంటుందన్నారు.
కేంద్ర ప్రభుత్వంలో ప్రధానమైన బొగ్గు మరియు గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రజల తరఫున కేంద్ర ప్రభుత్వంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అలాంటి వారిని ఏకవచనంతో మాట్లాడడం ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి పదవికి తగినది కాదు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర రావు కూడా ఇదే విధమైన భాషను ఉపయోగించి ప్రస్తుతం ఫామ్ హౌస్ లో ఏం చేస్తున్నారో తెలంగాణ ప్రజలకు కూడా అర్థం కాకుండా ఒంటరిగా జీవితాన్ని గడుపుతున్నారు. అహంభావం అధికారమదం ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంచిది కాదు. కేసీఆర్ ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజలు తిరస్కరించి దురదృష్టవశాత్తు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. కాంగ్రెస్ పార్టీ గతంలో వారు చేసిన మంచిని చూసి కాదు. అందులో అదృష్టం వరించి రేవంత్ రెడ్డి గారికి ముఖ్యమంత్రి పదవి వచ్చిందన్నారు. కాంగ్రెస్ అధిష్టానం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై దురాభిప్రాయం కలిగినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. సంవత్సర కాలంలోనే ముగ్గురు ఇన్చార్జిలను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. ప్రధానంగా నేడు మీనాక్షి నటరాజన్ ని ముఖ్యమంత్రిపై పరోక్షంగా ఆయన వ్యవహార శైలిని గమనించడానికి వేసినట్లు కాంగ్రెస్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఎన్ని సార్లు ఢిల్లీకి వెళ్లి రాహుల్ గాంధీ గారిని కలవాలని ప్రయత్నించిన రిసెప్షన్ గది దాటి లోపలికి వెళ్లడానికి అనుమతి లభించలేదు అనేది వాస్తవం అని నేడు తెలంగాణ ప్రజల్లో, కాంగ్రెస్ వర్గాల్లో కలుగుతున్నదన్నారు. రేవంత్ రెడ్డిని రాహుల్ గాంధీ దూరం పెడుతున్నారనేది కాంగ్రెస్ వర్గాలు చెప్పుకునేది వాస్తవం. దానిని కప్పువుచ్చుకోవడానికి బహిరంగ సభలో మీడియా సమావేశాల్లో వ్యక్తిగతంగా, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి శ్రీ జి కిషన్ రెడ్డి గారిని, అదేవిధంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ని మాట్లాడడం జరుగుతున్నదన్నారు. ఇకనైనా ముఖ్యమంత్రి తన హోదాకు తగ్గట్టు ఇతరులను గౌరవిస్తూ రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులు జి కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ లను గౌరవిస్తూ కేంద్ర ప్రభుత్వంతో కలిసి రావాలని కోరుతున్నాం. దేశం అభివృద్ధి చెందాలని అందుకు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని నరేంద్ర మోడీ తెలంగాణ రాష్ట్రానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ మెప్పు పొందడానికి చేయాల్సిన ప్రయత్నాలు ఏమిటో ఆయన ముఖ్యమంత్రి పదవి తెచ్చుకోవడానికి ఏ విధంగా చేశారో అదే విధంగా నేడు పదవి కాపాడుకోవడానికి ఆ విధమైనటువంటి కాంగ్రెస్ మార్క్ ప్రయత్నాలు చేసుకుంటే మంచిది. జి కిషన్ రెడ్డి బండి సంజయ్ కుమార్ గారిని అవమానించడం ఏకవచనంతో సంబోధించడం మానుకోవాలి. గతంలో అంతర్జాతీయ స్థాయిలో రామప్ప దేవాలయానికి యునెస్కో లో గుర్తింపు రావడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అనేక ప్రయత్నాలు చేసి గుర్తింపు తీసుకొచ్చారు. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న కల్వకుంట్ల చంద్రశేఖర రావు రామప్ప దేవాలయానికి నేనే యునెస్కో అవార్డు తీసుకొచ్చాను అని గొప్పలు చెప్పారు. నేడు ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వరంగల్ పట్టణానికి విమానాశ్రయం రావటానికి కారణం నేను అని . నేనే తెచ్చానని కిషన్ రెడ్డి చేసింది ఏమీ లేదని చెప్పుకోవటం ఇద్దరు ముఖ్యమంత్రులు గొప్పలు మాని తప్పులు ఎదుటివారిని అని చెప్పడంలో నిష్ణాతులు అని పేర్కొన్నారు.

# ఓపిఎస్ నినాదాలతో దద్దరిల్లిన ధర్నా చౌక్

● గో బ్యాక్ యుపిఎస్ ఏప్రిల్ 1 న బ్లాక్ డే
● మే 1 న చలో ఢిల్లీ ● సెప్టెంబర్ 1 న సామూహిక సెలవు,లక్ష కలాలతో కవాతు




తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: హైదరాబాద్ లోని ధర్నా చౌక్ లో తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ అధ్యక్షతన యుపిఎస్ వద్దని యుద్ధభేరి ధర్నా కార్యక్రమం జరిగింది ఈ ధర్నాకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్ రాష్ట్ర కోశాధికారి నరేష్ గౌడ్ లు భారీ సంఖ్యలో ఉద్యోగ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఇటీవల జనవరి 24న కేంద్ర ఆర్థిక శాఖ విడుదల చేసిన గెజిట్ ప్రకారం యుపిఎస్ యూనిఫైడ్ పెన్షన్ స్కీం అనేది ఏప్రిల్ 1 2025 నుండి అమలు చేయాలని గెజిట్ లో పేర్కొన్నారు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ నేడు ధర్నా ను నిర్వహించమన్నారు. ధర్నా లో రాష్ట్ర అధ్యక్షులు గంగావురం స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ ఈ యుపిఎస్ విధానం అనేది కార్పొరేట్లకు ధన ప్రవాహం కొనసాగించుటకు కోసమే వచ్చిందన్నారు కేంద్రం ఆర్థిక శాఖ ఈ గెజిటెడ్ తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతే వసూలు చేసిన 10.5 లక్షల కోట్ల రూపాయల్ని అప్పనంగా కార్పోరేట్ చేతుల్లోనికి వెళ్తున్నాయని తెలిపారు. గత పది సంవత్సరాలుగా సిపిఎస్ వద్దని ఓ పి ఎస్ మాత్రమే సామాజిక భద్రతను చేకూర్చుండని పోరాటం చేస్తున్నామని, ఇప్పుడు ఈ యుపిఎస్ విధానం తెచ్చి ప్రభు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులని గందరగోళానికి గురి చేస్తుందన్నారు.ఇది ఏ ఉద్యోగ ఉపాధ్యాయ వర్గానికి ఆమోదయోగ్యంగా లేదన్నారు.
అసలు ఈ యుపిఎస్ లో 56 జే రూల్ ప్రకారం ఉద్యోగి కంట్రిబ్యూషన్ 10% మరియు ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ 10% ఇలా సర్వీస్ మొత్తం జమ అయిన పెన్షన్ నిధిని ఉద్యోగి ప్రాన్ అకౌంటు ద్వారా ఎన్ పి ఎస్ ట్రస్ట్ కు బదిలీ చేశాకనే ఉద్యోగికు సర్వీస్ పెన్షన్ నిర్ణయం జరుగుతుందన్నారు. అదే ఉద్యోగితోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా తన ఉద్యోగుల కోసం పెన్షన్ను కొనుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. గత పదిహేళ్లుగా సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ ఇవ్వాలని పోరాటం చేస్తే గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించుకున్నామన్నారు. ఇంకా పాత పెన్షన్ లో ఉండే డి ఏ ఆధారిత సర్వీస్ పెన్షన్ ,కమ్యూటేషన్ సౌకర్యాలను సాధించుకోవాలన్న తరుణంలో ఈ యుపిఎస్ విధానం వచ్చిందన్నారు.
జనవరి నెలలో సిపిఎస్ విధానంలో రిటైర్ అయిన హైకోర్టు జడ్జి విశ్రాంతిని న్యాయమూర్తులకు కేవలం 6 నుండి 15వేల రూపాయల మధ్య పెన్షన్ అందుతుందని తెలిసి గౌరవనీయులైన సుప్రీంకోర్టు యే దిగ్భ్రాంతి పోయిందన్నారు. మన రాష్ట్రంలో 2003 లా ఉపాధ్యాయులు రిటైర్ అవుతున్నారని వారికి 2000 నుండి 5000 లోపే పెన్షన్ వస్తుందని,ఈ సొమ్ముతో కుటుంబాన్ని ఎలా గడిపేది గౌరవ ప్రద జీవనం ఎలా అన్నారు..? సామాజిక భద్రత కల్పించాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ల కడుపు నింపే విధంగా తయారయ్యాయి అన్నారు.సిపిఎస్ రద్దు వల్ల రాష్ట్రానికి నష్టం లేదు.
గతంలో కాంగ్రెస్ పాలనలో ఉన్న రాజస్థాన్ ,ఛత్తీస్గఢ్ , ప్రస్తుత కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు ఝార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్లలో సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ అమలు చేస్తున్నాయన్నారు.ప్రతినెల రాష్ట్రం నుంచి సిపిఎస్ ఉద్యోగుల కంట్రిబ్యూషన్ 450 కోట్ల రూపాయలు షేర్ మార్కెట్ కు ఎన్.పి.ఎస్ ట్రస్ట్ ద్వారా తరలిపోతాయన్నారు ఇటీవల ప్రభుత్వ ఏర్పడ్డాక ముఖ్యమంత్రి గారు నియమించిన 51 వేల ఉద్యోగస్తుల సి.పి.ఎస్ సొమ్ముతో కలిపి దాదావు 600 కోట్లు షేర్ మార్కెట్ కు తరలి పోతున్నాయన్నారు.
మన రాష్ట్రం సీపీఎస్ నుండి పాత పెన్షన్ లోకి వెళ్లినట్లయితే ఇప్పటివరకు గత ఇరవై ఏళ్లుగా ఉద్యోగ,ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ సొమ్ము ఉన్న పెన్షన్ నిధి 17 వేల కోట్ల రూపాయల ఇతర ప్రజా ప్రయోజన పథకాలకు ఉపయోగించుకోవచ్చునని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులు రిటైర్మెంట్ సమయంలో పాత పెన్షన్ సౌకర్యాలు కల్పిస్తే చాలన్నారు.


# ప్రభుత్వ విద్యను పరిష్టం చేయండి

● ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయండి
● నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించండి ● సీఎం రేవంత్ రెడ్డికి బీసీ నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య బహిరంగ లేఖ




తెలంగాణ బ్యూరోప్రతినిధిః ప్రభుత్వ విద్యను పరిష్టం చేయాలని, అందుకోసం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్ రెడ్డికి కృష్ణయ్య బహిరంగ లేఖ రాశారు. గత సంవత్సరం టీచర్ పోస్టులను భర్తీ చేశారు. వివిధ కారణాలతో మొత్తం టీచర్ పోస్టులు భర్తీ కాలేదు. ఇంకా పెద్ద ఎత్తున ఖాళీలు ఉన్నవి. ఇంకొక వైపు లక్షలాదిమంది నిరుద్యోగుల ఉద్యోగాలు లేక రోడ్ల వెంట తిరుగుతూ, శక్తి- యుక్తులు వృథా చేసుకుంటున్నారు.
టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో 12 వేల పాఠశాలలో ఇంగ్లీష్, మథ్స్, సైన్స్ పాఠాలు చెప్పేవారు లేరు. విద్యార్థులుకు ఈ సబ్జెక్టుల్లో విషయ పరిజ్ఞానం లేక చదువులల్లో వెనుకబడి పోతున్నారు. దీనిలో బేసిక్ విషయ పరిజ్ఞానం లేక జాతీయ పరీక్షలలో పోటీలో నీట్, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర పోటీపరీక్షలలో ఇతర రాష్ట్రాలతో పోటీ పడలేకపోతున్నారు. ఇటీవల జరిపిన టీచర్ పోస్టుల నియమకాలలో ప్రభుత్వ పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలో నాన్ జాయినింగ్ అభ్యర్థులు పెద్ద ఎత్తున ఉండడంతో భారీగా ఖాళీలు మిగిలిపోయాయి. అలాగే రిటైర్ మెంట్ అయిన వాళ్ళ ఖాళీలతో కలిపి దాదావు 30వేల టీచర్ పోస్టులు ఖాళీగా యున్నట్లు తెలుస్తుంది. ప్రభుత్వ పాఠశాలలు, ఎస్సీ/ఎస్టీ/బీసీ/ మైనారిటీ గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బా పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలల్లో కలిసి దాదావు 30 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నవి. గెస్ట్ టీచర్స్/ పార్ట్ టైం టీచర్స్ ను నియమించి పాఠాలు చెబుతున్నారు. ఇంకొక వైపు బీఈడీ, డీఈడీ చేసి, అన్నీ అర్హతలు గల 16 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగం లేక తమ శక్తి -యుక్తులు వృథా అవుతున్నాయి. వీరి శక్తి- యుక్తులు సమాజాభివృద్ధికి ఉపయోగించవలసిన అవసరం ఉంది. టీచర్ పోస్టుల భర్తీని నిరుద్యోగులకు ఉద్యోగం ఇస్తున్నామనే బడ్జెటు ఖర్చు అవుతుందని కోణంలో చూడరాదు. ఈ టీచర్ల ద్వారా భావి భారత పౌరులైన బాలలను తీర్చిదిద్ది ఈ సమాజానికి ఉపయోగపడే గొప్ప వారికి తయారు చేస్తామన్నామనే కోణంలో చూడాలి. పూర్తి స్థాయి టీచర్ పోస్టులు భర్తీ చేస్తే ప్రభుత్వ పాటశాల వ్యవస్థను బలోపేతం చేస్తే విద్యాప్రమాణాలు పెరిగి విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప నైపుణ్యం గల మానవ వనరులుగా సమాజాభివృద్ధికి తోడ్పడుతారు. విద్యార్థులను తీర్చి దిద్దితే, వారిలో ఉన్న సృజనాత్మక శక్తి, తెలివి తేటలకు సాన పెడితే గొప్ప ఇంజినీర్లు, డాక్టర్లుగా, శాస్త్రవేత్తలుగా, సంఘ సంస్కర్తలుగా విలువ గల రాజకీయ నాయకులుగా తయరవుతారు. అప్పుడు దేశం శీఘ్ర గతిన అభివృద్ధి చెందుతుంది. వాస్తవంగా ఎన్ని ఖాళీలు యున్నవి లెక్కించాలని, గత 10 సంవత్సరాల కాలంలో ఎంత మంది రిటైర్ అయ్యారు? ఎంత మంది ప్రమోషన్లు పొందారు. ఇతర కారణాలతో ఎన్ని ఖాళీలు ఏర్పడ్డాయి. లెక్కించి అన్నీ భర్తీ చేయాలి. అలాగే టీచర్ పోస్టుల ఈ విషయంలో ప్రభుత్వ పాఠశాలల పోస్టులు, ఎస్సీ/ఎస్టీ/ బీసీ/మైనారిటీ గురుకుల పాఠశాల పోస్టులు, ఆదర్శ పాఠశాల పోస్టులు కస్తూర్బా పాఠశాలలు ఎయిడెడ్ పాఠశాలల టీచర్ పోస్టులు కూడా వేరువేరుగా జరపడంతో మెరిట్ అభ్యర్థులు ఈ మూడు నాలుగు రకాల యాజమాన్యాల పాఠశాలలో మెరిట్ ఉన్న ఒకే అభ్యర్థికి నాలుగు పోస్టులలో సెలెక్ట్ అవుతారు. చివరకు ఒకే యాజమాన్యశ్వం పాఠశాల లో జాయిన్ అవుతారు. సెలెక్ట్ అయిన మిగతా మూడు వృథా అవుతాయి. అందుకే ఆప్షన్ పద్ధతి పెట్టడం, వెయిటింగ్ లిస్ట్ పెట్టడం, అన్ని ఫలితాలు ఒకేసారి ప్రకటించడం లాంటి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సుచిస్తున్నాము. అంతేగాక వీలుంటే అన్నిటికి కలిపి ఒకే నోటిఫికేషన్ జారీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు.

## టీడీపీ నేత బీద రవిచంద్ర యాదవ్ కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరైన మంత్రి లోకేష్



హైదరాబాద్:టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్ కుమారుడి వివాహ రిసెప్షన్ కు విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు.
శంషాబాద్ లోని ఫోర్ట్ గ్రాండ్ లో ఏర్పాటుచేసిన వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులు గోకుల్ రిష్వంత్, దివ్యలను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్ వాళ్లు బీసీని ఎందుకు సీఎం చేయరు

# పేరుకే బీసీకి పిసిసి బాధ్యతలు


### బిజెపి ఎంపీ రఘునందన్ రావు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ఎస్ఎల్బీసీ వద్దకు వెళ్లేందుకు సీఎం రేవంత్ రెడ్డికి 8 రోజుల వరకు టైమ్ దొరకలేదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు వ్యంగ్యంగా ఆరోపించారు. తెలంగాణలో పాలన పడకేసిందని ఆయన విమర్శించారు. పాలన చేతకాక ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ఆదివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్రం కార్యాలయంలో ఎంపీ రఘునందన్ రావు విలేకర్లతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ లేకుండా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి వచ్చారని ఓ వేళ రాహుల్ గాంధీని కలిస్తే ఒక్క ఫోటో కూడా ఎందుకు విడుదల చేయలేదని కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.
పేరుకు మాత్రం పీసీసీ అధ్యక్ష పదవి బీసీకి ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవి సైతం బీసీలకు ఇవ్వాలని అధిష్టానానికి లేఖ రాయాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్కు ఎంపీ రఘునందన్ రావు సూచించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లో ఓ ఉన్నతాధికారి.. గత ఐదేళ్లుగా డిప్యూటేషన్పై పని చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. మున్సిపల్ పాలనపై సీఎం రేవంత్ రెడ్డికి పట్టు లేదన్నారు. ఇక వరంగల్లో ఏర్పాటు కానున్న మమునూరు ఎయిర్ పోర్ట్ గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని ఆయన స్పష్టం చేశారు. గద్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే తన ఫోటోలను కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీల్లో వేస్తున్నారని ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యేలంతా తిరిగి తమ సొంత గూటికి వెళ్లేందుకు సిద్ధమవుతోన్నారన్నారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సౌమ్యుడని.. ఆయనపై మాట్లాడే హక్కు సీఎం రేవంత్ రెడ్డికి లేదన్నారు. ఆరు మంత్రి పదవులను భర్తీ చేసుకోలేని దుస్థితిలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని చెప్పారు. ప్రధాని మోదీతో కలిసిన ఫొటో అధికారికంగా విడుదల చేశారని.. మరి రాహుల్ గాంధీని కలిసిన ఫోటో ఎక్కడ? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఎంపీ రఘునందన్ రావు సూటిగా ప్రశ్నించారు. త్రిభాషా సిద్ధాంతానికి పునాదులు వేసింది కాంగ్రెస్ పార్టీనేనని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అలాంటి కాంగ్రెస్ సిద్ధాంతానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. అయినా.. తెలంగాణలో ఉర్దూ భాష ఎందుకు రాస్తున్నారని ప్రశ్నించారు.
90 శాతం ప్రజలకు ఉర్దూ రాకున్నా.. బోర్డులపై ఎందుకు ఆ భాషను రాస్తున్నారని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ఎవరికి భయపడి ఉర్దూ భాష రాస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆయన బల్ల గుద్ది ప్రశ్నించారు. అసెంబ్లీలో ఎంఐఎం సభ్యుడు అనుమతి తీసుకొని సీఎం రేవంత్ రెడ్డి తెలుగులో మాట్లాడరని ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు గుర్తు చేశారు. మరి పార్లమెంట్లో కాంగ్రెస్ పార్టీ నేతలు ఏ భాషలో మాట్లాడతారని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత విమర్శలపై తాము మాట్లాడగలమని కానీ.. సిద్ధాంతం మీద ప్రజా సమస్యలపై చర్చకు సిద్ధమన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డికి, హరీష్‌రావు బహిరంగ లేఖ

● సన్ ఫ్లవర్ గింజల కొనుగోలు కేంద్రాలు ఏమయ్యాయని ప్రశ్న
● రైతులు వేల రూపాయలు నష్టపోతున్నరని ఆవేదన
● వెంటనే ఈ అంశంపై స్పందించాలని డిమాండ్

తెలంగాణ బ్యూరోప్రతినిధిః ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు బహిరంగ లేఖ రాశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూనె గింజల ఉత్పత్తిని పెంచడానికి రైతులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దడం జరిగింది. సమయానికి రైతుబంధు తో పాటు సబ్సిడీలు అందజేసి నూనె గింజల పంటల ను సాగు చేసేలా ప్రోత్సాహం కల్పించాం. సాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నాం. నాటి ప్రణాళికా బద్ధంగా నేడు తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున నూనె పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పొద్దుతిరుగుడు(సన్ ఫ్లవర్) పంట కోతకు వచ్చింది. సన్ ఫ్లవర్ గింజలను విక్రయించడానికి ఇప్పటిదాకా రాష్ట్రంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉంది. అని హరీష్ రావు పేర్కొన్నారు. రైతులు రూ. 5,500 నుంచి రూ. 6000 వరకు దళారులకు క్వింటాల్ చొప్పున విక్రయిస్తున్న పరిస్థితి దాపురించిందని తెలిపారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాఫెడ్ ద్వారా సన్ ఫ్లవర్ నూనె గింజలకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేశాము. ఈసారి కూడా రూ. 7280 మద్దతు ధరను నాఫెడ్ ప్రకటించింది. ఇప్పటిదాకా కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దళారులకు విక్రయించడం వల్ల క్వింటాల్ కు రూ. 1000 నుండి రూ. 2000 వరకు నష్టాన్ని చవిచూడాల్సిన దుస్థితి రైతులకు కలిగింది. మీ అలసత్వం కారణంగా తెలంగాణ వ్యవసాయం తిరోగమన దిశలో పయనిస్తున్నది. నూనె పంటలు వేయాలంటేనే రైతులు ఆందోళన చెందే పరిస్థితులను మీరు కల్పిస్తున్నారు. ఇప్పటికైనా కళ్ళు తెరవండి.. వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా సన్ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతుల పక్షాన నేను డిమాండ్ చేస్తున్నాను. అని హరీష్ రావు లేఖలో పేర్కొన్నారు.

## సౌత్ సెంట్రల్ డివిజన్ అభివృద్ధికి మరింత కృషి చేస్తా

### డివిజనల్ రైల్వే యోజెస్ కన్సల్టెంట్ కమిటీ సభ్యులు కాలపురెడ్డి సాయిబాబా

తెలంగాణ బ్యూరోప్రతినిధిః సౌత్ సెంట్రల్ డివిజన్ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ రైల్వే యోజెస్ కన్సల్టెంట్యు కమిటీ సభ్యులు కాలపురెడ్డి సాయిబాబా అన్నారు. రాంబాబుతో సాయిబాబా రైల్వేలో ప్రయాణికులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. రైల్వేలో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను ఈ సందర్భంగా సాయిబాబా రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. యుటిఎస్ ఏపిపి ద్వారా రైల్వే టికెట్లు సులువుదరంగా బుక్ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సాయిబాబా మీడియా తో మాట్లాడుతూ సౌత్ సెంట్రల్ రైల్వే లో సిబ్బంది ఎదురుకొంటున్న సమస్యలు. అలాగే ప్రయాణికులకు మెరుగైన సేవలకు తనవంతు కృషి చేయగలనన్నారు. మరింత అభివృద్ధికి కృషి చేశానని ఈ సందర్భంగా తెలియచేసారు. రైల్వే సిబ్బంది, ప్రయాణికులకు రైల్వే పరంగా సమస్యలుంటే 8919192508 నంబర్ కు ఫోన్ చేయగలరని సాయిబాబా కోరారు. ఈ మేరకు నేడు విజయవాడలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వి. రాంబాబు చేతుల మీదుగా గుర్తింపు కార్డును అందుకున్నారు. ఈ సమావేశంలో ఎస్.రవికుమార్ యాదవ్, రాధా, సాయి తేజ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

suryachitramagazine@gmail.com

# సూర్య సినిమా

## యంగ్ టైగర్- ప్రశాంత్ నీల్ బడ్జెట్



యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. తొలి షెడ్యూల్ హైదరాబాద్లో జరుగుతోంది. షూట్ లో ఇంకా తారక్ జాయిన్ కాలేదు. ప్రస్తుతం తారక్ లేని సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. మార్చి లో తారక్ కూడా షూట్ లో జాయిన్ అవుతాడు. ఇది పక్కా ప్రశాంత్ వర్మ మార్క్ లో తెరకెక్కుతోన్న హై ఆక్టేన్ యాక్షన్ కంటెంట్ ఉన్న చిత్రం. ఎన్టీఆర్ మాస్ ఇమేజ్ ని పాన్ ఇండియా కి కనెక్ట్ చేస్తూ రాసుకున్న కథ ఇది. అందుకు తగ్గట్టే ప్రశాంత్ వర్మ పదునైన టెక్నీషియన్లను రంగంలోకి దింపుతున్నాడు. కొంత మంది ఫస్ట్ క్లాస్ విదేశీ టెక్నిషియన్లు కూడా సినిమాకి పనిచేస్తున్నట్లు సమాచారం. అలాగే కోట్ల రూపాయాలతో భారీ సెట్లు కూడా నిర్మాణం జరుగుతున్నాయి. సెట్లు కోసం...బ్యాకెండ్ టెక్నికల్ కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారుట. మైత్రీ మూవీ మేకర్స్- ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మరి ఈ సినిమా బడ్జెట్ పై ఇంతవరకూ ఎక్కడా చర్చకు రాలేదు. తాజాగా ఆ విషయం కూడా లీకైంది. ఈ సినిమాకు ఏకంగా 500 కోట్ల బడ్జెట్ కేటాయించారుట. ఇందులో మైత్రీ మూవీ మేకర్స్ ఎక్కువ శాతం పెట్టుబడి పెడుతుందిట. మిగతా బడ్జెట్ ఎన్టీఆర్ ఆర్ట్స్ పెడుతు న్నట్లు సమాచారం. కానీ ఎవరెంత పెడుతున్నారు? అన్నది క్లారిటీ లేదు. మైత్రీ మూవీ మేకర్స్ బడ్జెట్ విషయంలో ఎంత మాత్రం ఆలోచించదు. సినిమా కోసం ఎన్నికోట్లైనా ఖర్చు చేసే నిర్మాణ సంస్థ అది. ఇప్పటికే కొన్ని పాన్ ఇండియా సినిమాలు నిర్మించింది. %-%పుష్ప 2%-% తో ఆసంస్థ భారీగా లాభాలు చూసింది. ఈ నేపథ్యంలో తారక్ సినిమా విషయంలో ఎంత మాత్రం రాజీ పడదు. ఇప్పటికే ఎన్టీఆర్ హీరోగా నటించిన %-%జనతా గ్యారేజ్%-% ను కూడా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన సంగతి తెలిసిందే.

## 'కన్నప్ప' రెండో టీజర్



శివ భక్తుడైన కన్నప్ప పురాణ కథను ఆధారంగా చేసుకుని విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా 'కన్నప్ప' సినిమాను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద డా. మోహన్ బాబు నిర్మాణంలో ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో మోహన్ బాబు, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్, కాజల్ అగర్వాల్ వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ మూవీ ఏప్రిల్ 25న గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. ఈ క్రమంలో ప్రమోషన్స్‌లో భాగంగా కన్నప్ప టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ టీజర్‌లోని ఒక్కో షాట్, యాక్షన్ సీక్వెన్స్, విజువల్స్ అన్నీ కూడా ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసేలా ఉన్నాయి. మరీ ముఖ్యంగా విష్ణు చేసిన యాక్షన్ సీక్వెన్స్, శివపార్వతులుగా అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ కనిపించిన తీరు.. టీజర్ చివర్లో రుద్రుడిగా ప్రభాస్ ఎంట్రీ.. ఆ క్లోజప్ షాట్స్‌కు అభిమానులతో పాటుగా, సినీ లవర్స్ అంతా ఫిదా అయ్యేలా ఉంది. ఈ రెండో టీజర్‌తో కన్నప్ప మీద అంచనాలు మరింతగా పెరిగాయి. ఈ మూవీని ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ చేయబోతోన్న సంగతి తెలిసిందే.

## సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ లో సత్తా చాటిన "బేబి"



ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్ కేఎన్ నిర్మాణంలో దర్శకుడు సాయి రాజేశ్ రూపొందించిన కల్ట్ బ్లాక్ బస్టర్ బేబి మూవీ ఫిలింఫేర్, సైమా, గామా వంటి ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు గెల్చుకుంది. ఇప్పుడు ఈ సినిమా మరో క్రెడిట్ దక్కించుకుంది. సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ లో బేబి సినిమా నాలుగు అవార్డ్స్ గెల్చుకుంది. బెస్ట్ మూవీ, బెస్ట్ హీరోగా ఆనంద్ దేవరకొండ, బెస్ట్ హీరోయిన్ గా వైష్ణవి చైతన్య, బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్ గా విజయ్ బుల్గానిన్ సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ దక్కించుకున్నారు. ఆనంద్ దేవరకొండ తరుపున హీరోయిన్ వైష్ణవి చైతన్య అవార్డ్ స్వీకరించారు. ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్, డైరెక్టర్ సాయి రాజేష్ ఈ మూవీ కోసం పెట్టిన ఎఫర్ట్స్ తో బేబి ప్రేమ కథా చిత్రాల్లో క్లాసిక్ గా నిలవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద 100 కోట్ల గ్రాసర్ గా నిలిచింది.

## గుడ్ బ్యాడ్ అగ్లీ టీజర్

ప్రముఖ పాన్-ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, కోలీవుడ్ ఐకాన్ అజిత్ కుమార్‌ను తమ మల్టీ లాంగ్వేజ్ ప్రాజెక్ట్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ'తో తెలుగు సినిమాకు తీసుకురావడానికి సిద్ధంగా ఉంది. టి-సిరీస్ గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన ఈ హై-ప్రొఫైల్ మూవీ ఇప్పటికే సంచలనం సృష్టించింది. ఈ చిత్రం తమిళ టీజర్ నిన్న విడుదలై 30 మిలియన్లకు పైగా వ్యూస్ తో అదరగొట్టింది. ఈ రోజు మేకర్స్ తెలుగు టీజర్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ అజిత్‌ను నెవర్ బిఫోర్ క్యారెక్టర్ లో అద్భుతంగా ప్రజెంట్ చేసింది. అతని పాత్ర ఎకె 'రెడ్ డ్రాగన్' డెడ్లీ, వైలెన్స్ వరల్డ్ ని పరిచయం చేసింది. "నువ్వు ఎంత మంచివాడివైనా, ప్రపంచం నిన్ను చెడుగా మార్చేస్తుంది" ఈ డైలాగ్ యాక్షన్-ప్యాక్డ్ నెరెటివ్ కి టోన్ సెట్ చేసింది. ఎ.కె. తన నిజాయితీతో ఎంత పోరాడినా, అతని చుట్టూ ఉన్న శక్తులు అతన్ని చీకటి, ప్రమాదకరమైన ప్రపంచంలోకి నెట్టివేస్తాయని చూపిస్తుంది. టీజర్‌లో అద్భుతమైన విజువల్స్, పవర్ ఫుల్ డైలాగ్స్ అజిత్ అభిమానులను కట్టిపడేశాయి. అజిత్ రెడ్ డ్రాగన్ క్యారెక్టరైజేషన్ మెస్మరైజ్ చేస్తోంది. అభినందన్ రామానుజం సినిమాటోగ్రఫీ అద్భుతంగా ఉంది, జి.వి. ప్రకాష్ కుమార్ నేపధ్య సంగీతం ఎక్సయిటమెంట్ ని మరింత పెంచుతుంది. అజిత్ క్యారెక్టర్ లో వైవిధ్యమైన కోణాలు అతని పాత్రను మరింత ఆసక్తిని రేపాయి. ఈ చిత్రంలో త్రిష కృష్ణన్ హీరోయిన్ గా నటిస్తోంది. అర్జున్ దాస్, ప్రసన్న, సునీల్ ,ప్రభు కీలక పాత్రలలో నటిస్తున్నారు. అద్భుతమైన యాక్షన్, పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్ లతో గుడ్ బ్యాడ్ అగ్లీ ఆడియన్స్ గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ని ఇవ్వబోతుందని ఈ బ్లాస్టింగ్ టీజర్ ప్రామిస్ చేస్తోంది.



## రీ ఎంట్రీకి సిద్ధమైన రంభ

90వ దశకంలో హీరోయిన్ రంభ పేరు ఎక్కువగా మార్మోగిపోయింది. తమిళం, తెలుగు, మలయాళం, హిందీ, కన్నడ ఇలా అన్ని భాషల్లో రంభ తన ముద్ర వేశారు. నటిగా రంభ కెరీర్‌లో మరుపురాని క్లాసిక్ చిత్రాలెన్నో ఉన్నాయి. గత కొన్నేళ్లుగా రంభ ఈ సినీ పరిశ్రమకు, నటనకు దూరంగా ఉంటూ వచ్చారు. ప్రస్తుతం రంభ రీ ఎంట్రీకి సిద్దంగా ఉన్నారు. రంభ గ్లామర్, నటన, ఆమె గ్రేస్ ఫుల్ స్టెప్పులకు అప్పటి ఆడియెన్స్ ఫిదా అయ్యేవారు. రంభ తన రీ ఎంట్రీ గురించి మాట్లాడుతూ.. 'నా ఫస్ట్ ఛాయిస్ ఎప్పుడూ సినిమానే. ఇక ఇప్పుడు ఎలాంటి ఛాలెంజింగ్ రోల్స్ చేసేందుకు అయినా నేను సంసిద్ధంగా ఉన్నాను. ఇదే సరైన సమయం అని నేను భావిస్తున్నాను. కొత్త పాత్రలను ఎంచుకుని, మళ్లీ ఆడియెన్స్‌ను ఆకట్టుకునే సినిమాలతో రీ ఎంట్రీ ఇవ్వాలని ఎదురుచూస్తున్నాను' అని అన్నారు. ఇక అభిమానులు, ప్రేక్షకులు ఆమె రీ ఎంట్రీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి రంభ రీ ఎంట్రీ ఎలా ఉంటుందో.. ఎలాంటి చిత్రాలతో ఆడియెన్స్ ముందుకు వస్తుందో అని అంతా ఎదురుచూస్తున్నారు.



## "డ్రింకర్ సాయి" కి డెబ్యూ యాక్టర్ గా ధర్మ



"డ్రింకర్ సాయి" సినిమాలో నటనకు ప్రేక్షకుల రివార్డ్స్ తో పాటు అవార్డ్స్ అందుకుంటున్నారు యంగ్ హీరో ధర్మ. సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ లో బెస్ట్ డెబ్యూ యాక్టర్ గా హీరో ధర్మకు అవార్డ్ దక్కింది. కెరీర్ బిగినింగ్ లోనే తనకు సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్ రావడం ఎంతో ఎంకరేజింగ్ గా ఉందని హీరో ధర్మ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. గతేడాది థియేటర్స్ లోకి వచ్చిన "డ్రింకర్ సాయి" సినిమా యూత్ తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ ను ఆకట్టుకుని మంచి విజయాన్ని సాధించింది. ఈ సినిమాలో హీరో ధర్మ తన డ్యాన్సులు, ఫైట్స్, యాక్టింగ్ తో అందరినీ మెప్పించాడు ధర్మ. సాయి పాత్రలో ధర్మ చేసిన పర్ ఫార్మెన్స్ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. టీజింగ్, ఫన్, ఎమోషనల్ సీన్స్ లో మెచ్యూర్డ్ యాక్టింగ్ చేశాడు ధర్మ. హీరో ధర్మ ఫ్యూచర్ కెరీర్ కు "డ్రింకర్ సాయి" మంచి స్టెప్ అయ్యింది.

## ఎవరికీ సమస్యను చెప్పను



ఒకప్పుడు తమకు ఎలాంటి వ్యక్తిగత సమస్యలున్నా, ఆరోగ్య సమస్యలున్నా సెలబ్రిటీలు బయటపెట్టే వారు కాదు. కానీ సోషల్ మీడియా వచ్చాక ప్రతీ ఒక్కరూ ఎంతో ఓపెన్ గా ఉంటూ ప్రతీదీ షేర్ చేసుకుంటున్నారు. తమ ఇబ్బందుల గురించి, తమ సమస్యల గురించి అందరితో షేర్ చేసుకుంటూ మానసిక ప్రశాంతత పొందుతున్నారు. తాను ఒకానొక టైమ్ లో తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైనట్టు బాలీవుడ్ నటి దీపికి పదుకొణె బయటపెట్టింది. 2014లో కెరీర్లో పీక్స్ లో ఉన్నప్పుడే తాను ఈ ఇబ్బంది పడినట్టు దీపక తెలిపింది. ఆ టైమ్ లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్న తనకు ఓ రోజు బాగా అలసటగా అనిపించి కళ్లు తిరిగి పడిపోయినట్టు చెప్పిన దీపికా మొదట్లో వర్క్ స్ట్రెస్ వల్ల అలా అవుతుందనుకుందట. కానీ స్కానింగ్ చేయించుకున్న తర్వాత తన సిట్యుయేషన్ అందరిలా లేదని అర్థమైందని, ఆ టైమ్ లో తనకేదో అయిపోతున్నట్టు భయపడేదాన్నని, అనవసరమైన విషయాలకు కూడా విపరీతంగా ఏడ్చేదానన్ని చెప్తోంది. ఆఖరికి తన తల్లి సూచన మేరకు థెరపిస్ట్ ను కలిసి తాను మానసిక ఒత్తిడికి లోనైన విషయాన్ని తెలుసుకున్నట్టు దీపిక వెల్లడించింది. అయితే ఆ విషయాన్ని ఎవరికీ చెప్పకుండా కావాలనే సీక్రెట్ గా ఉంచాలనుకున్నట్టు దీపిక చెప్పింది. అందుకే ట్రీట్‌మెంట్ గురించి కూడా ఎవరికీ తెలియదని, ఆ సమస్య నుంచి బయటపడుతున్న టైమ్ లోనే తాను మెంటల్ హెల్త్ గురించి అందరికీ చెప్పి, తనకు వచ్చిన ప్రాబ్లమ్ ను అందరితో షేర్ చేసుకున్నట్టు దీపికా చెప్తోంది. అందులో భాగంగానే దీపికా లివ్ లాఫ్ ఫన్ తో ఒక ఫౌండేషన్ ను ఏర్పాటు చేసి మెంటల్ హెల్త్ పై అవగాహన కల్పిస్తూ దానిపై వర్క్ చేస్తుంది.

## 'కోర్టు - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' ఆకట్టుకున్న ట్రైలర్



నాని వాల్ పోస్టర్ సినిమా ప్రెజెంట్ చేస్తున్న మూవీ 'కోర్ట్' - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' ప్రియదర్శి ప్రధాన పాత్రలో నటిస్తున్న నటిస్తున్న ఈ చిత్రాన్ని రామ్ జగదీష్ దర్శకత్వం వహించారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. దీప్తి గంటా సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రం మార్చి 14న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఫస్ట్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిన తర్వాత మేకర్స్ ఒక ఆసక్తికరమైన గ్లింప్స్ ద్వారా సినిమా ట్రైలర్ గురించి అనౌన్స్ చేశారు. వీడియోలో హర్ష్ రోషన్ పాత్ర అతను ఫోన్‌లో మాత్రమే మాట్లాడిన తన గర్ల్ ఫ్రెండ్ ని కలవమని ఉత్సాహంగా అడుగుతున్నట్లు చూపిస్తుంది. మరొక సన్నివేశంలో ఒక క్లయింట్ న్యాయవాదితో మీటింగ్ షెడ్యూల్ చేయడానికి ప్రయత్నిస్తాడు, అతని అసిస్టెంట్, ప్రియదర్శి శుక్రవారం ఏదో ముఖ్యమైన విషయం గురించి సూచిస్తాడు. సినిమా థియేటర్లలోకి రావడానికి వారం ముందు మార్చి 7న ట్రైలర్ విడుదల అవుతుందని రివిల్ చేస్తూ క్లిప్ ముగుస్తుంది. ముందుగా రివిల్ చేసినట్లు సినిమా పోక్సో చట్టం నేపథ్యంలో వుంటుంది, ఇది క్లిష్టమైన, సోషల్ ఇష్యూని ప్రస్తావిస్తుంది. శివాజీ, సాయి కుమార్, రోహిణి, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్, రాజశేఖర్ అనింగి, సురభి ప్రభావతి, విశిక, వడ్లమాని శ్రీనివాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## సాక్షి ఎక్సలెన్స్ లో "అంబాజీపేట మ్యారేజి బ్యాండు"

సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ లో క్రిటికల్లీ అక్లైమ్డ్ మూవీగా అవార్డ్ గెల్చుకుంది "అంబాజీపేట మ్యారేజి బ్యాండు". సుహాస్, శివాని నాగరం జంటగా నటించిన ఈ సినిమా మన సొసైటీని రిఫ్లెక్ట్ చేసే ఒక మంచి కాన్సెప్ట్ తో ప్రేక్షకుల్ని ఆలోచింపజేసింది. థియేట్రికల్ సక్సెస్ తో పాటు ఓటీటీలోనూ ఆదరణ పొందింది. "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" క్రిటికల్లీ అక్లైమ్డ్ మూవీగా సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్ గెల్చుకోవడం వెల్ డిసర్వ్ డ్ అనే ప్రశంసలు దక్కుతున్నాయి. "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" చిత్రాన్ని జీఏ2 పిక్చర్స్, దర్శకుడు వెంకటేష్ మహా బ్యానర్ మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మించారు. దర్శకుడు దుశ్యంత్ కటికినేని రూపొందించారు. శరణ్య ప్రదీప్, నితిన్ కీ రోల్స్ చేశారు. గతేడాది ఫిబ్రవరిలో ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ కు వచ్చి విజయాన్ని సాధించింది.



## గ్రిప్పింగ్ ట్రైలర్ శివంగి

ఆనంది, వరలక్ష్మి శరత్‌కుమార్ ప్రధాన పాత్రలలో దేవరాజ్ భరణి ధరణ్ దర్శకత్వంలో ఫస్ట్ కాపీ మూవీస్ బ్యానర్ పై నరేష్ బాబు పి. నిర్మించిన పవర్ ఫుల్ విమెన్ సెంట్రిక్ ఫిల్మ్ శివంగి. జాన్ విజయ్, డాక్టర్ కోయ కిషోర్ కీలక పాత్రల్లో నటించారు. ఇటివలే రిలీజ్ చేసిన టీజర్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ సినిమా 'శివంగి' థ్రిల్లింగ్ ట్రైలర్ రిలీజ్ చేశారు. అందరి జీవితంలో గుడ్ డే, బ్యాడ్ డే అని ఒక రోజు వుంటుంది. కానీ నా జీవితంలో రెండూ ఒకే రోజు జరిగాయి' అంటూ ఆనంది చెప్పిన డైలాగ్ తో ఓపెన్ అయిన ట్రైలర్ ఆద్యంతం థ్రిల్లింగ్ సాగింది. వరలక్ష్మి శరత్‌కుమార్ కు ఆనందిని విచారించడం చాలా ఇంట్రస్టింగ్ గా వుంది. ఆనంది జీవితంలో జరిగిన విషయాలు చాలా సస్పెన్స్ ఫుల్ గా ప్రజెంట్ చేశారు. సత్యభామ క్యారెక్టర్ లో ఆమె పెర్ఫార్మెన్స్ అదిరిపోయింది. సత్యభామరా .. సవాల్ చేయకు చంపేస్తా' అనే డైలాగ్ అదిరిపోయింది. వరలక్ష్మిశరత్‌కుమార్ పవర్ ఫుల్ క్యారెక్టర్ లో కనిపించింది. డైరెక్టర్ దేవరాజ్ భరణి ధరన్ డిఫరెంట్ స్టొరీ తో ప్రేక్షకులని అలరించబోతున్నారని ట్రైలర్ చూస్తే అర్థమౌతోంది.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185, SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185, SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185, SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044